ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 27, అక్టోబరు 2024



కొండపిలో సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి స్వామి

ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు

- కొండపిలో ప్రారంభించిన మంత్రి స్వామి
- రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం
- వైపాలెంలో తొలిరోజే 16 మంది నమోదు

ఒంగోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ తెలుగు తమ్ముళ్ల ఎక్కడికక్కడ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ కేంద్రాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సభ్యత్వ నమోదు ప్రారంభించడంతోపాటు వారు కూడా తీసుకున్నారు. ఈసారి రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందే అవకాశాన్ని అధిష్ఠానం కల్పించడంతో పలువురు ప్రముఖులు స్వీకరించారు. అందులో వెనుకబడిన ప్రాంతమైన, ఎన్నికల్లో ఓటమి చెందినా ఏమాత్రం ఉత్సాహం తగ్గకుండా పనిచేస్తున్న వైపాలెం నియోజకవర్గంలో తొలిరోజే ఏకంగా 16 మంది రూ.లక్ష వంతున చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందారు. రెండు నెలలపాటు ఈ ప్రక్రియ సాగనుంది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చి సులభంగా సభ్యత్వం పొందేలా ఏర్పాట్లు చేశారు. దీంతో పార్టీశ్రేణులు అనేక మంది ఎవరి సెల్‌ఫోన్‌లో వారు రూ.వంద చెల్లించి రెండేళ్లపాటు సాధారణ సభ్యత్వం తీసుకుంటున్నారు.


కొండపిలో ప్రారంభించిన మంత్రి

మంత్రి డాక్టర్ స్వామి శనివారం ఉదయం కొండపిలో సభ్యత్వ నమోదు ప్రక్రియను లాంచనంగా ప్రారంభించారు. అనంతరం స్థానిక నేతలు సభ్యత్వం పొందారు. ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చెరో లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం పొందారు. పలువురు ఇతర నాయకులు సాధారణ సభ్యత్వం తీసుకున్నారు. కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక సమావేశం

మిగతా 6వ పేజీలో

ఓ అధికారి, కొందరు ఉద్యోగుల తప్పిదం జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేసే గ్రేడ్ 5, 6 సచివాలయ ఉద్యోగులకు శాపంగా మారింది. తమకు కేటాయించిన పోస్టుల్లో చేరి సాఫీగా ఉద్యోగం చేయాల్సిన వారు గాలిలో ఉన్నారు. దాదాపు నెల రోజులుగా ఎదురుచూపులే మిగిలాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని శాఖల్లో బదిలీలు చేపట్టింది. మిగతా అన్నింటిలో ప్రక్రియ సాఫీగా సాగగా జిల్లా పంచాయతీ కార్యాలయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. వాటిపై త్రిసభ్య కమిటీ విచారణ కూడా నడిచింది. ఈ మొత్తం వ్యవహారం కారణంగా 53 మంది పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్‌లు రాలేదు. బదిలీలు చేస్తున్నట్లు చెప్పినా ఆర్డర్లు మాత్రం వారికి అందలేదు. వీరి స్థానాలలో కొత్త వారు వచ్చి చేరిపోయారు. దీంతో వారంతా లబోదిబోమంటూ కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆ ఉద్యోగులు గాలిలోనే..



కొందరి అక్రమాలు.. వారికి తిప్పలు

- డీపీవో ఆఫీసులో బదిలీల తప్పిదాల ఫలితం
- 50మంది గ్రేడ్-5, ముగ్గురు గ్రేడ్-6..
- నెల నుంచి పోస్టింగ్‌ల కోసం ఎదురుచూపులు
- నిరంతరం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు
- భవిష్యత్ ఉద్యోగోన్నతుల్లో నష్టపోతామని ఆందోళన
- పీఆర్ కమిషనర్‌కు లేఖ రాసిన కలెక్టర్
- ఇతర జిల్లాల్లో సాఫీగా సాగిన ప్రక్రియ
- ఇక్కడ మాత్రం అస్తవ్యస్తం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేసే కార్యదర్శులు (సచివాలయ ఉద్యోగులు) నెలరోజుల నుంచి పోస్టింగ్‌లు లేక రోడ్డున పడ్డారు. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అందుకు అనుగుణంగా ఆయా శాఖల అధికారులు శ్రీకారం చుట్టారు. ఇతర శాఖల్లో ఆ ప్రక్రియ సాఫీగా సాగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు మాత్రం అస్తవ్యస్తమయ్యాయి. ఆశాఖ పూర్వ డీపీవో చేసిన తప్పిదాల వల్ల ఇప్పుడు ఉద్యోగులకు పోస్టింగ్‌లు లేక గాలిలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియను చేపట్టాల్సి ఉన్నా ఇష్టారీతిన వ్యవహరించిన కారణంగానే ఈ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గతనెల 22 వరకూ గడువు ఇచ్చింది. అతర్వాత బదిలీల ప్రక్రియను నిషేధించింది. అనంతరం రెండు, మూడు రోజులు పాత తేదీలతో బదిలీ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉన్నా పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఇప్పుడు ఆ ఉద్యోగులకు పోస్టింగ్‌లు లేక నిరంతరం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడంతో

మిగతా 6వ పేజీలో

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి వస్తే ఇదా మా పరిస్థితి

సచివాలయ ఉద్యోగుల్లో ఎక్కువమంది గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన వారే. బీటెక్, ఎంటెక్, ఉన్నత ప్రొఫెషనల్ కోర్సులు చదివారు. అయితే గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో వాటి కోసం సాఫ్ట్‌వేర్ కొలువులను వదిలేశారు. సచివాలయ ఉద్యోగాలకు పోటీపడ్డారు. ఎక్కువమంది కొలువులు సాధించారు. ఇప్పుడు బదిలీల్లో జరిగిన అక్రమాలతో తమను రోడ్డున పడేశారని వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు వెంటనే పోస్టింగ్‌లు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.



గృహయోగం

- 1 నుంచి లబ్ధిదారుల గుర్తింపు
- నెల రోజులు సాగనున్న ప్రక్రియ
- ప్రత్యేక యాప్‌ను రూపొందించిన ప్రభుత్వం
- అన్ని వివరాలు అందులోనే నమోదు
- గతంలో ఇల్లు మంజూరై నిర్మాణాలు ప్రారంభించని వారికీ అవకాశం

ఒంగోలు నగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబానికి గూడు సమకూర్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. అర్హులైన పేదలందరికీ పక్కాగృహాలను మంజూరు చేసేందుకు సిద్ధమైంది. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సొంతిల్లు లేని కుటుంబాల్ని గుర్తించి వారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద పక్కాగృహం మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా వచ్చేనెల ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టబోతోంది. ప్రతి

మిగతా 6వ పేజీలో

డీఈవోగా కిరణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

పలువురు శుభాకాంక్షలు



ఒంగోలు విద్య, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా అత్తోటి కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీ అయిన డీఈవో సుభద్ర నుంచి ఆయన చార్జి తీసుకున్నారు. విద్యారంగంలో కిరణ్‌కుమార్‌కు విశేష అనుభవం ఉంది. గుంటూరు జిల్లా బోయపాలెం డైట్‌లో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. డైట్ అధ్యాపకుడిగా పనిచేస్తూ గుంటూరు సర్వశిక్షా అభియాన్‌లో ఏఎంవోగా పనిచేశారు. వివిధ విద్యా డివిజన్లలో ఉప విద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో మైనంపాడు డైట్‌లో అధ్యాపకుడుగా పనిచేస్తూ మార్కాపురం, పర్చూరు డివిజన్ ఉపవిద్యాధికారిగా కూడా పనిచేశారు. డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ కిరణ్ కుమార్‌రెడ్డి, కార్యాలయ ఏడీ, ఇతర సూపరింటెండెంట్లు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలోని పలువురు ఎంఈవోలు, మైనంపాడులోని డైట్ అధ్యాపకులు, సిబ్బంది, సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

అందరితో మర్యాదగా మెలగాలి

డీఈవో కార్యాలయానికి వివిధ పనుల మీద వచ్చే ఉపాధ్యాయులు, ఇతరులతో కార్యాలయ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని తనను కలిసిన సిబ్బందికి డీఈవో సూచించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యాలయ నోట్ ఫైల్స్‌పై కచ్చితంగా సంబంధిత సిబ్బంది సంతకాలు ఉండాలన్నారు. టీచర్ల సమస్యలను పరిష్కరించే విషయంలో ఫైళ్లు పరుగులు పెట్టాలని ఉద్యోగులకు సూచించారు.



జిల్లా పరిపాలన కేంద్రమైన ఒంగోలులోని ప్రకాశం భవన్

సిద్ధమైన కొత్త టీమ్

- కీలక శాఖలకు నూతన అధికారులు
- ఈనెలలోనే అధికంగా చేరికలు
- ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజులకే కలెక్టర్, ఎస్పీలు చేరిక
- ప్రస్తుతం దాదాపు బదిలీలు పూర్తి

ఒంగోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగు నెలలు పూర్తి కావస్తుండగా జిల్లాలో కీలక శాఖల అధికారుల నియామకం పూర్తికావచ్చింది. ఇంకా కొద్దిశాఖల్లో ఇన్‌చార్జిలు కొనసాగుతున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికార యంత్రాంగం కీలకం కాగా ప్రతి రెండు, మూడేళ్లకు ఒకసారి సాధారణంగా జిల్లాస్థాయి అధికారుల మార్పులు, చేర్పులు జరుగుతాయి. అందులో రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినప్పుడు విధిగా జిల్లాస్థాయి అధికారుల బదిలీలు ఉంటాయి. జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సూచనలకు రాష్ట్ర స్థాయిలో

మిగతా 6వ పేజీలో



పాఠశాలలో జరుగుతున్న వజ్రోత్సవ ఏర్పాట్లు

ఆదర్శం.. అపూర్వం

- తర్లుపాడు జడ్పీ హైస్కూల్‌కు మంచిరోజులు
- అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం
- రూ.50లక్షలతో వివిధ రకాల పనులు
- మౌలిక సదుపాయాల కల్పన
- నేడు వజ్రోత్సవం

6

విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు నడుం కట్టారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన నాడు-నేడు పథకానికి ఎంపిక కాకుండా అరకొర వసతులతో ఉన్న సరస్వతీ నిలయాన్ని సూపర్ స్కూల్‌గా తీర్చిదిద్దారు. రూ.50లక్షలతో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆదివారం వజ్రోత్సవం జరుపుకుంటున్న తర్లుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

4న ఇన్‌చార్జి మంత్రి రాక

- కీలక అంశాలపై అధికారులతో సమీక్ష



ఒంగోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వచ్చేనెల 4న ఒంగోలు రానున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల అనంతరం ఇటీవల జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమించిన విషయం విదితమే. అందులో జిల్లాకు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నియమితులయ్యారు. కాగా ప్రస్తుతం అన్నిచోట్లా ఇన్‌చార్జి మంత్రులు ఆయా జిల్లాలకు వెళ్లి ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వచ్చేనెల 4న రామనారాయణరెడ్డి జిల్లాకు వస్తున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఈ సమావేశం ఏర్పాటుపై జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామితో శనివారం ఇన్‌చార్జి మంత్రి ఆనం మాట్లాడినట్లు సమాచారం. అనంతరం సమావేశ నిర్వహణ, అజెండాలో చేర్చాల్సిన అంశాలపై కలెక్టర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.



సబ్ కలెక్టర్ పట్టుకున్న బియ్యం లారీ

600 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

లారీని వెంబడించి పట్టుకున్న మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్

6వ పేజీలో



పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయజెండా



స్కూలు ఆవరణలో ఏర్పాటు చేస్తున్న వైజ్ఞానిక పార్క్



ప్రారంభానికి సిద్ధంగా 75వ వసంతాల స్థూపం

ఆదర్శం.. అపూర్వం

విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. కలిసికట్టుగా పనిచేసి రూ.50 లక్షలతో తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఈ స్కూలులో నేడు వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నారు.

తర్లుపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తర్లుపాడు పాఠశాలను 1949లో స్థాపించారు. అప్పట్లో చుట్టుపక్కల గ్రామాల్లో పాఠశాలలు లేవు. దీంతో 20 గ్రామాల నుంచి విద్యార్థులు ఈ పాఠశాలకు వచ్చేవారు. ఇక్కడ వేలాదిమంది విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ఇక్కడి పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా పోలీస్, మిలటరీ అధికారులుగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. నాటి పూ ర్వ విద్యార్థులు, నేటి ప్రధానోపాధ్యాయు ల నిరంతర కృషితో 75 వసంతాల వేడుకలకు ప్రస్తుతం పాఠశాల వేదికైంది.

తర్లుపాడు హైస్కూల్‌కు మంచిరోజులు
అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం
రూ.50 లక్షలతో వివిధ రకాల పనులు
నేడు వజ్రోత్సవాలు

నాడు-నేడుకు ఎంపిక కాక..

పాఠశాలలో మౌలిక వసతులు మెరుగు పరచడానికి గత ప్ర భుత్వం నాడు-నేడు కార్యక్రమాన్ని అమలుజేసింది. అయితే తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాడు-నేడు కింద ఎంపిక కాలేదు. దీంతో పాఠశాలలో మౌలిక వసతులు కరువయ్యాయి. అరకొర వసతులతోనే విద్యార్థులు విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొందరు పూర్వ విద్యార్థులు సమావేశం ఏర్పాటు చేసుకుని పాఠశాలను అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలో రూ.50లక్షలతో అభివృద్ధి పనులు, మౌలిక వసతులు చేపట్టి జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దారు

దాతల కృషితో..

పాఠశాలలో దాతల కృషితో అభివృద్ధి పనులు చేపట్టారు. ముఖద్వారం నిర్మాణం, ప్రార్థనా ప్రాంగణం ఆధునికీకరణ, అబ్దుల్ కలాం సభా ప్రాంగణ ఏ ర్పాటు, బాలికలు, బాలుర కోసం ప్రత్యేకంగా డైనింగ్ హాలు ఏర్పాటు, సృజనాత్మక విద్య విషయంలో వివిధ అంశాలతో నాలెడ్జ్ పార్క్ నిర్మాణం, అన్ని తరగతి గదులకు నూతన బెంచీలు, ప్రతి తరగతి గదికి మినరల్ వాటర్, ఐరన్ ర్యాక్స్ గాంధీ విగ్రహం నుంచి సిమెంట్ బ్రిక్స్‌తో రహదారి ఏర్పాటు, కాంపౌండ్ వాల్ ఎత్తుపెంపు, పాఠశాల ఆవరణను గ్రీన్‌పార్క్‌గా చేయటం, 4వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్‌ల నిర్మాణం, పాఠశాలలో జాతీయ జెండా స్థూపం ఏర్పాటు తదితర ఆధునిక పనులను చేపట్టారు.

నేడు వజ్రోత్సవ కార్యక్రమానికి సర్వం సిద్ధం



తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 75వ వసంతోత్సవాలకు సర్వం సిద్ధం చేశాం. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, ప్రజలు 10 వేలమంది హాజరవుతారని అంచనా వేశాం. ముఖ్య అతిథులుగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఉన్నతస్థాయి అధికారులు హాజరుకానున్నారు.

– ఎం.సుధాకర్, ప్రధానోపాధ్యాయులు

ఆదర్శ పాఠశాలగా చేయటమే ధ్యేయం

జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా తర్లుపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను చేయటమే ధ్యేయంగా పనిచేస్తున్నాము. అక్కడ 19976-77లో పదో తరగతి చదువుకున్నాను. మా ఉన్నతికి కారణమైన పాఠశాల రుణం తీర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. తోటి మిత్రులతో పాఠశాలను అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషిచేస్తున్నాం.

-గోసు సుబ్బారావు(పూర్వ విద్యార్థి)

విద్యార్థుల అవసరాలను తీర్చటమే లక్ష్యం

1969-70 సంవత్సరం పాఠశాలలో పదో తరగతి చదువుకున్నా. మాతృభూమి రుణం తీర్చుకునేందుకు పాఠశాలను పూర్వపు విద్యార్థుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నాము. పాఠశాలలో ముందుముందు మరిన్ని కార్యక్రమాలు తోటి మిత్రులతో కలిసి చేసి రాష్ట్రంలోనే తర్లుపాడు హైస్కూల్‌కు గుర్తింపు తెచ్చేందుకు కృషిచేస్తాం.

– తిప్పిరెడ్డి వెలుగొండారెడ్డి (పూర్వ విద్యార్థి)



విద్యార్థుల భోజనశాలకు తయారుచేసిన బల్లలు



బాలికల కోసం భోజనశాల

బాలికల వివరాలను పకడ్బందీగా సేకరించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 12నుంచి 18 ఏళ్లలోపు బాలికల వివరాలను పకడ్బందీగా సేకరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బాల్య వివాహాల నివారణ కోసం జిల్లా యంత్రాంగం బంగారు బాల్యం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు ఎంత మంది ఉన్నారు. వారిలో ఎంతమంది అంగన్‌వాడీల్లోను, అలాగే పాఠశాల వయస్సు పిల్లలు ఎంత మంది ఉన్నారో గుర్తించాలని చెప్పారు. వారికి వ్యాక్సిన్స్ వేస్తున్న తీరు, రక్తహీనత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాల కార్మికులుగా పనిచేసి విముక్తి పొందిన పిల్లల ప్రస్తుత స్థితిగతులపై కూడా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాల్యం ప్రతి చిన్నారికి సంతోషమయంగా ఉండేలా జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టినందున పాఠశాలల నుంచి డ్రాపౌట్స్ లేకుండా, పోషకాహార లోపం లేకుండా, బాల్య వివాహాలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అందుకు సంబంధించిన డేటాను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు సమావేశంలో అధికారులు మాధురి, డాక్టర్ భగీరథి, గాయత్రీదేవి, పద్మజ, అంజల, జగన్నాథరావు, దినేష్‌కుమార్, సామా సుబ్బారావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్ల బాలిక దత్తత



బాలికతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు నగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్త్రీశిశు సంక్షేమశాఖ సంరక్షణలో ఉన్న ఏడేళ్ళ బాలికను చీరాల ప్రాంతానికి చెందిన మహిళ దత్తత తీసుకున్నారు. చీరాల న్యాయ స్థానంలో గుమస్తాగా పనిచేస్తున్న సుజిని అనే మహిళ ఏడేళ్ల బాలికను తాత్కాలిక ప్రాతిపదికపై దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియ చేతుల మీదుగ బాలికను దత్తత ఇచ్చారు. కార్యక్రమంలో స్త్రీ శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ మాధురి, డీసీపీవో దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి

మంత్రి స్వామి ● కొండపిలో రక్తదాన శిబిరం ప్రారంభం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి స్వామి

కొండపి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు మరువలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం కొండపిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పోలీసులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం మంచి కార్యక్రమమన్నారు. సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో కొండపి, మర్రిపూడి, పొన్నలూరు ఎస్సైలు ప్రేమ్‌కుమార్, రమేష్, అనూక్ పోలీసు సిబ్బందితోపాటు మరో 125 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో గొర్రెపాటి రామయ్యచౌదరి, డాక్టర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, ఎంసీ సభ్యుడు మన్నం ప్రసన్నరాజు, నాయకులు చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పా రెడ్డి కృష్ణారెడ్డి, కొర్రపాటి వసంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు

(5వ పేజీ తరువాయి)

నిర్వహించి తాను రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకోగా మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. యర్రగొండపాలెంలో జరిగిన సమావేశంలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతోపాటు మరో 15మంది నియోజకవర్గ నాయకులు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. దర్శిలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీతోపాటు మరో ఇద్దరు కూడా శాశ్వత సభ్యులుగా చేరారు. మండల కేంద్రమైన మద్దిపాడులో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నేత, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మండవ రంగారావు సభ్యత్వం తీసుకోగా సంతనూతలపాడు మండలం మంగమూరులో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా పలు మండల కేంద్రాలు, గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగింది.

600 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం సమీపంలోని సాయిబాబానగర్ నుంచి అక్రమంగా తరలిస్తున్న 600 బస్తాల రేషన్ బియ్యం లారీని మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్ శనివారం వేకువజామున వెంబడించి పట్టుకున్నారు. సాయిబాబానగర్ నుంచి నిత్యం బియ్యం అక్రమంగా రవాణా జరుగుతుందన్న సమాచారంతో సబ్‌కలెక్టర్ రెవెన్యూ పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో అధికారులు లారీని వెంబడించి పట్టుకున్నారు. అయితే లారీడ్రైవరు, కూలీలు అక్కడ నుంచి పరారయ్యారు. లారీని వైపాలెం గొడౌన్‌కు తరలించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వైపాలెం ఎస్ఐ చౌడయ్య పాల్గొన్నారు.

సిద్ధమైన కొత్త టీం

(5వ పేజీ తరువాయి)

మంత్రులు, ఉన్నతాధికారులు ప్రాధాన్యం ఇచ్చి వారి సిఫార్సులకు అనుగుణంగా నియామకాలు చేస్తుంటారు. కీలక అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగడం ద్వారా మెరుగైన ఫలితాలు రాబట్టాలన్న లక్ష్యంతో ఇలా జరుగుతాయి. జిల్లాలో ఈసారి బదిలీలు దాదాపు ఒక కొలిక్కి రాగా పంచాయతీరాజ్ మినహా ఇతర శాఖల్లో జిల్లా ప్రజాప్రతినిధులకు సిఫార్సులకు ప్రాధాన్యం లభించింది. అలాగే ఇరిగేషన్, ఇతరత్రా కొన్నింటిలో నేరుగా రాష్ట్రస్థాయి నుంచి నియామకాలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే పోస్టింగ్‌లలో ఎవరికి ప్రాధాన్యం ఇచ్చారన్న విషయాన్ని పక్కన పెడితే కీలక శాఖ అధికారుల నియామకాలు ఒక కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది. సాధారణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నెలలోనే జిల్లాలో అత్యంత కీలకమైన కలెక్టర్, ఎస్పీల బదిలీలు జరిగి కొత్తవారు వస్తారు. అదే పరిస్థితి ఈసారి కూడా కొనసాగింది. జిల్లాకు కొత్త కలెక్టర్‌గా అన్సారియా జూన్‌లో రాగా, జూలై తొలిపక్షంలోనే ఎస్పీగా దామోదర్ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత కొద్దిగా ఆలస్యంగా అధికారుల నియామకాలు చేపట్టారు. సెప్టెంబరు ఆఖరు నుంచి భారీగా నియామకాలు జరిగి ప్రస్తుతం ఒక కొలిక్కి వచ్చాయి.

ఈ నెలలోనే అత్యధికం

కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా జిల్లాకు నియమితులైన అధికారులు ఈనెలలో పెద్దసంఖ్యలోనే చేరారు. రెవెన్యూ శాఖల్లో చూస్తే ఎన్నికల ముందు నుంచి ఉన్న జేసీ గోపాలకృష్ణ ఇక్కడే కొనసాగుతుండగా తర్వాత కీలకంగా ఉండే డీఆర్వో ఓబులేసు నియామకం జరిగింది. ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. మార్కాపురం సబ్ కలెక్టర్‌గా త్రివినాథ్‌తోపాటు ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలుగా లక్ష్మీప్రసన్న కేశవర్ధన్‌రెడ్డిలు వచ్చారు. అలాగే పోలీసు శాఖ విషయానికి వస్తే అన్ని సబ్ డివిజన్లు, సర్కిళ్లకు కొత్త డీఎస్పీలు, సీఐలు వచ్చారు. లూప్‌లైన్‌లో ఉండే ఏఎస్పీ పోస్టుల్లోనూ కొత్తవారే చేరారు. పంచాయతీరాజ్‌లో కీలకమైన జడ్పీ సీఈవోగా చిరంజీవి, డిప్యూటీ సీఈవోగా బాలమ్మ, డ్వామా పీడీగా జోసఫ్‌కుమార్, డీపీవోగా గొట్టిపాటి వెంకటనాయుడులు బాధ్యతలు స్వీకరించారు. జలవనరుల శాఖలో సీఈగా శ్యాంప్రసాద్, ప్రాజెక్టుల ఎస్ఈగా అబ్దుల్ సలీం, ఎన్నెస్పీ ఎస్ఈగా వరలక్ష్మి చేరారు. విద్యుత్ శాఖ ఎస్ఈగా కట్టా వెంకటేశ్వర్లు, ఒంగోలు ఈఈగా మాకినేని హరిబాబు, డీఎస్‌వోగా ఎస్.పద్మశ్రీ, గనుల శాఖ డీడీగా రాజశేఖర్, డీఈవోగా కిరణ్‌కుమార్, సర్వే ఏడీగా గౌస్‌బాషాలు బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్ శాఖలో డీసీగా హేమంత్‌నాగరాజు, ఏసీగా కె.విజయ, ఈఎస్‌గా ఖాజామొహిద్దీన్‌లు చేరారు. వ్యవసాయ, పశు సంవర్ధకశాఖల్లో బదిలీలు లేక గతంలో ఉన్న అధికారులే కొనసాగుతున్నారు. డీఆర్‌డీఏలో బదిలీలు ఇంకా జరగలేదు. ఇక ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్, మెడికల్ వంటి శాఖల్లో ఉద్యోగ విరమణ ఖాళీలతో ఇన్‌చార్జి అధికారులు ఉండగా పలు ఇతర శాఖల్లోనూ మార్పులు, చేర్పులు జరిగాయి. ఇంచుమించు అన్నిశాఖల్లో సబ్ డివిజన్, మండల, గ్రామస్థాయి వరకు బదిలీలు జరిగి కొత్తవారు చేరారు. మొత్తంగా జిల్లాలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కొత్త టీమ్‌సిద్ధమైంది.

గృహయోగం

(5వ పేజీ తరువాయి)

సచివాలయం పరిధిలో ఇది నెలరోజులు సాగనుంది. గ్రామంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేదా వెల్ఫేర్ అసిస్టెంట్ లేదా గృహ నిర్మాణ సంస్థ వర్కు ఇన్‌స్పెక్టర్ ఈ యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేయనున్నారు.

గతంలో మంజూరైనవి రద్దు..

జిల్లాలో గృహం లేని పేద కుటుంబాలకు చెంది ముందుకు వచ్చే వారికే కొత్తగా గృహాలను మంజూరు చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల్లో ఇప్పటికీ 25 వేల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. వీరికి కూడా పాత మంజూరు ఉత్తర్వులను రద్దుచేసి కొత్తగా పీఎంఏవై గ్రామీణ్ 2.0 పథకం కింద కొత్తగా పక్కా గృహాలను మంజూరు చేయనున్నారు. అయితే గతంలో ప్రభుత్వం నుంచి పక్కా గృహం మంజూరై ఒక్కసారి ప్రభుత్వం నుంచి బిల్లు తీసుకున్నా ప్రస్తుతం మంజూరు చేసే కొత్త గృహాల్లో చోటు కల్పించరు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 పథకం మంజూరుచేసే పక్కాగృహాలకు యూనిట్ విలువ ఎంత ఇస్తారన్న విషయంలో ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. నవంబర్ ఒకటో తేదీ నుంచి సఖి యాప్ ద్వారా ఇళ్లు లేని పేదలను గుర్తిస్తారు. వారు గృహాలను నిర్మించుకునేందుకు ఆసక్తి చూపుతుంటే వారి వివరాలను ఆ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఈ ప్రక్రియ నవంబర్ 30వతేదీ వరకు కొనసాగించనున్నారు.

యూనిట్ విలువను పెంచనున్న ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం హయాంలో పక్కాగృహాలు మంజూరైన వారిలో 25వేల మంది నేటికీ గృహ నిర్మాణాలను ప్రారంభించనే లేదు. నాడు ఇచ్చిన యూనిట్ విలువ సరిపోకపోవడమే ఇందుకు కారణమైంది. వీరు నవంబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే లబ్ధిదారుల గుర్తింపులో తిరిగి తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పక్కాగృహాల యూనిట్ విలువను పెంచుతామని ప్రకటించింది. దీంతో గతంలో ఇళ్లను పొంది నిర్మాణాలను ప్రారంభించని పేదలు కూడా ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న లబ్ధిదారుల గుర్తింపులో పేర్లను నమోదు చేయించుకునే అవకాశం ఉందని గృహ నిర్మాణ శాఖ అధికారులు భావిస్తున్నారు.

అపార్ ఐడీ రూపకల్పనను వేగవంతం చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రి) ఐడీ రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ విషయంపై శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మండల విద్యాధికారులు, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అడ్మినిస్ట్రేషన్ రిజిస్టర్, ఆధార్‌కార్డు, యూడైస్‌లలో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలు సరిపోలినట్లు అయితే వారికి వెంటనే అపార్ ఐడీ జనరేట్ చేయాలన్నారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన డేటా మేనేజ్‌మెంట్ కోసం అపార్ ఐడీ రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. అందువల్ల ఈ ప్రక్రియను జిల్లాలో వేగవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కాగా యూడైస్ లాగిన్ ఎంఈవోల ఆధ్వర్యంలో ఉందని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లాగిన్ ఇస్తే కొంత వెసులుబాటు ఉంటుందని పలువురు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. విద్యార్థుల పేర్లలో మార్పులు, పుట్టిన తేదీల్లో తప్పులను సరి చేసేందుకు ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ లాగిన్ విషయంపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాతానని హామీ ఇచ్చారు. నవంబరు 14వతేదీన పేరెంట్ టీచర్ మీటింగ్ విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పాఠశాలల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో కిరణ్‌కుమార్, డిప్యూటీ డీఈవో సామా సుబ్బారావు, చంద్రమౌళీశ్వరరావు, ఆర్‌ఐవో సైమన్‌విక్టర్, సమగ్ర శిక్ష ఏఎంవో రమేష్, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉద్యోగులు గాలిలోనే..

(5వ పేజీ తరువాయి)

దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 53 మంది సచివాలయ ఉద్యోగులకు పోస్టింగ్‌లు లేని పరిస్థితి ఏర్పడింది. అందులో గ్రేడ్-6 ఉద్యోగులు ముగ్గురు, గ్రేడ్-5 ఉద్యోగులు 50మంది ఉన్నారు. వీరంతా రానున్న రోజుల్లో ఉద్యోగోన్నతుల విషయంలో నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు సర్వీసు ఆధారంగా ఉద్యోగోన్నతులు లభిస్తాయి. అయితే ఈ 53 మంది ఉద్యోగులు ప్రస్తుతం సర్వీసును సుమారు నెలరోజులకుపైగా కోల్పోయారు. ప్రభుత్వ ఉద్యోగికి సర్వీసు అనేది కూడా ఎంతో కీలకం. దాన్ని రోడ్డున పడేయడంతో ఉద్యోగులు మదనపడిపోతున్నారు.

పైనుంచి వచ్చే ఆదేశాల ప్రకారమే..

ఇటీవల సచివాలయ ఉద్యోగుల బదిలీల అవినీతి, అక్రమాలపై జిల్లా ఫారెస్ట్ అధికారి లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీ సమగ్ర విచారణ చేసి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నివేదికను అందజేసింది. అందులో పూర్వపు అధికారి చేసిన తప్పిదం వల్లనే ఉద్యోగులకు పోస్టింగ్ దక్కలేదని రాసినట్లు సమాచారం. మరోవైపు పోస్టింగ్‌ల ఆర్డర్లు అందని ఉద్యోగులు కూడా ఇదే విషయాన్ని విచారణాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు నివేదికలో పోస్టింగ్‌లు అందని ఉద్యోగుల వివరాలను కూడా పొందుపర్చినట్లు సమాచారం. దీంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా వెంటనే ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడుతో చర్చించినట్లు తెలిసింది. పోస్టింగ్‌లు ఇవ్వని ఉద్యోగుల వివరాలతో జాబితా రూపొందించి తదుపరి చర్యల కోసం పంచాయతీరాజ్ కమిషనర్‌కు లేఖ రాయాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఆయా ఉద్యోగుల జాబితాను రూపొందించి కమిషనరేట్‌కు పంపించినట్లు సమాచారం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా వారికి ఉద్యోగ పోస్టింగ్‌లు వచ్చే అవకాశం ఉంది.

త్వరలోనే సమస్య పరిష్కారం : కలెక్టర్

గ్రేడ్-5, 6 పంచాయతీ కార్యదర్శుల పోస్టింగ్‌ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని కలెక్టర్ తమీమ్ అన్సారియా హామీ ఇచ్చారు. శనివారం రాత్రి పోస్టింగ్‌లు రాని కార్యదర్శులు పది మంది కలెక్టర్‌ను కలిశారు. వారి సమస్యను సావధానంగా విన్న ఆమె జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలోని బదిలీల వ్యవహారాన్ని ఒక కొలిక్కి తెచ్చామని త్వరలోనే మిగిలిన వారందరికీ పోస్టింగ్‌లు ఇస్తామని ఆమె తెలిపారు.

కూటమి పొత్తు ధర్మాన్ని పాటించాలి

స్థాయిని మరచి పవన్‌కల్యాణ్‌పై మాట్లాడితే ఊరుకోం ● జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి పొత్తు ధర్మాన్ని పాటించకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ హెచ్చరించారు. ఆ మేరకు శనివారం సాయంత్రం ఒక వీడియోను రిలీజ్ చేశారు. ఒంగోలులో శుక్రవారం జరిగిన తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆ పార్టీకి చెందిన ఎద్దు శశికాంత్ మాట్లాడిన మాటలను ఖండించారు. గతంలో ఒక నాయకుడు వైసీపీలో ఉన్నప్పుడు మీరు ఎలా పోరాటం చేశారో, తాము కూడా అలాగే చేశామన్నారు. తమ పార్టీ అంతర్గత విషయాలు మాట్లాడే అర్హత లేదని చెప్పారు. జనసేనలోకి ఎవరిని తీసుకోవాలో..ఎవరిని తీసుకోకూడదో తమ పార్టీ అంతర్గత విషయమని స్పష్టం చేశారు. ఈ విషయంపై అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై అనవసరంగా మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. మరోసారి తమ అధినేతపై మాట్లాడితే ఊరుకోబోమన్నారు. జనసేన పార్టీలో పదవులు ఎవరికి ఇవ్వాలో.. ఏ కమ్యూనిటీకి ఇవ్వాలో అధినేత నిర్ణయమని, ప్రొటోకాల్ లేకుండా ఇష్టమొచ్చినట్లు జనసేన నేతలు మాట్లాడటం తగదని హితవు పలికారు.

బీసీ కార్పొరేషన్ ఈడీ బాధ్యతల స్వీకరణ



ఎంపీ మాగుంటను సత్కరిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలు నగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.వెంకటేశ్వరరావు శనివారం ఒంగోలులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో జిల్లాలో బీసీ కార్పొరేషన్ ఈడీగా, నగర కమిషనర్‌గా, అంతకుముందు జిల్లాలోని కొత్తపట్నం, ఒంగోలు మండలాలకు ఎంపీడీవోగా పని చేశారు. ఎన్నికలకు ముందు ఆయన తాటిగడప మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ క్రమంలో ప్రభుత్వం వెంకటేశ్వరరావును బీసీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ చేయ గా మరోసారి ఆయన బాధ్యతలు చేపట్టారు.

ఎంపీ మాగుంటకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్: స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని బీసీ కార్పొరేషన్ ఈడీగా నియమితులైన వెంకటేశ్వర రావు మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందజేసి శాలువతో సత్కరించారు.

సెల్‌ఫోన్ రిపేరులో ఉచిత శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రూడ్‌సెట్ సంస్థలో వచ్చేనెల 4నుంచి డిసెంబరు 3వతేదీ వరకు సెల్‌ఫోన్ రిపేరులో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు అర్హులన్నారు. 18నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండి, ఆధార్‌కార్డ్, రేషన్ కార్డు కలిగి ఉండాలని, వివరాలకు 9492583484 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దోర్నాలలో రక్తదాన శిబిరం

పెద్ద దోర్నాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):స్థానిక శివ సదన్ సమీపంలో ఆపద్బంధు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావు ప్రారంభించారు.ఈ శిబిరం ఏర్పాటుతో యువకులు రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా పలువురిని ప్రాణాపాయం నుండి రక్షించవచ్చని శివకోటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫౌండర్ సాయికిరణ్ రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన

గిద్దలూరు టౌన్, అక్టోబరు 26 : పోలీసుల సంస్మ రణ వారోత్సవాలలో భాగంగా ఓపెన్‌హౌస్ గురించి విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. పట్టణానికి చెందిన అనూష పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు శనివారం స్థానిక పోలీసు స్టేషన్ వచ్చారు. ఏఎస్సై జిలాని విద్యార్థులకు కేసుల గురించి, రికార్డుల గురించి అవగాహన కల్పించారు. పోలీసుస్టేషన్ ఆవరణను విద్యార్థులకు చూపించారు.



విద్యార్థులకు స్టేషన్ నిర్వహణను వివరిస్తున్న ఏఎస్సై

నీటికుంటను అభివృద్ధి చేయించిన ప్రజాసంకల్ప వేదిక

గిద్దలూరు టౌన్, అక్టోబరు 26 : మండలంలోని కొంగళవీడు గ్రామంలో కంపచెట్లతో నిరుపయోగంగా ఉన్న నీటికుంటను ప్రజాసంకల్ప వేదిక రాష్ట్ర అధ్య క్షులు మదిరె రంగసాయిరెడ్డి తన సొంత నిధులతో అభివృద్ధి చేయించారు. శనివారం గ్రామానికి వెళ్లి ఎక్సకవేటర్లను ఏర్పాటు చేసి కుంటలోని కంపచెట్లను తొలగించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పందనబోయిన లక్ష్మీప్రసన్న, బీరం భూపతి రెడ్డి, పందనబోయిన రాజభూపాల్ ఉన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పొదిలి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : హిందువుల పవిత్ర కార్తీకమాసంలో భక్తులు వివిధ క్షేత్రాలను దర్శించుకునేందుకు పొదిలి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు డీఎం సుందరరావు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 4వ తేదీ నుంచి ప్రతి కార్తీక సోమవారం పంచారామదర్శనం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. అమరారామం, సోమారామం, క్షీరారామం, ద్రాక్షారామం, కుమారరామాలకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా భక్తుల కోరిక మేరకు కార్తీకమాసంలో ప్రతి ఆదివారం రాత్రి 10 గంటలకు, కార్తీక పౌర్ణమి రోజున కూడా డిపో నుంచి బస్సులు బయలుదేరతాయన్నారు. ఎక్స్‌ప్రెస్ చార్జి 1700లు, సూపర్‌లగ్జరీ చార్జీ 2200లుగా నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 10శాతం రాయితీతో యాత్రకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

భార్యాభర్తల పంచాయితీలో ఘర్షణ

● ఐదుగురికి గాయాలు

మార్కాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య పంచాయితీ విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకొంది. దీంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు కురిచేడుకు చెందిన మంచా కృపాకు పట్టణంలోని పీఎస్ కాలనీకి చెందిన సునీతను ఇచ్చి ఆరు నెలల క్రితం వివాహం చేశారు. పెళ్లైన సమయం నుంచి వారిమధ్య సఖ్యతలేదు. దీంతో నెల రోజుల క్రితం సునీతను వారి తల్లిదండ్రులు మార్కాపురం తీసుకొచ్చారు. భర్త కృపా బంధువులు అమ్మాయిని పంపమని సునీత తల్లిదండ్రులను అడిగారు. వారి మధ్య సయోధ్య కుదర్చాలని శనివారం కురిచేడు నుంచి కృపా బంధువులు 10 మంది మార్కాపురం వచ్చారు. స్థానికంగా ఓ చర్చి సమీపంలో కూర్చుని మాట్లాడుతుండగా మాటామాటా పెరిగింది. దీంతో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కురిచేడుకు చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్సై సైదుబాబు తెలిపారు.

సేవచేయడం ఒక వరం

పొదిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సేవ చేయడం ఒక వరమని ఎంపీడీవో జి శోభన్‌బాబు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హబీబుల్లా బేగ్ స్వచ్ఛందసేవ సంస్థ ఆధ్వర్యంలో గొడుగులు, చాపల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఆరు సంవత్సరాలుగా హబీబుల్లా బేగ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఆర్టీసి డీఎం సుందరరావు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరీమున్‌బీబీ, విశ్రాంత ఎంఈవోలు సుబ్బారావు, యలమంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, ఎస్‌బీఐ, ఆంధ్రప్రగతి, కెనరా బ్యాంక్ మేనేజర్లు సాహు, సునీల్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

- ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల పిలుపు
- ఘనంగా ప్రారంభమైన కార్యక్రమాలు



సభ్యత్వ నమోదును చూపిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత తదితరులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తొలి సభ్యత్వాన్ని ఎంపీ మాగుంటకు ఎమ్మెల్యే దామచర్ల అందజేశారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల మంది పార్టీ కార్యకర్తలే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించారన్నారు. అలాగే ఒంగోలు నియోజకవర్గంలో దామచర్ల ఆధ్వర్యంలో తాను సభ్యత్వాన్ని స్వీకరించడం సంతోషంగా ఉందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. సభ్యత్వ నమోదు ద్వారా కార్యకర్తకు, వారి కుటుంబానికి భరోసా లభిస్తుందని తెలిపారు. గతంలో ప్రమాద బీమా రూ.2లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.5 లక్షలకు పెంచారని, అలాగే ఎవరైనా మరణిస్తే తక్షణ సహాయం కింద రూ.10వేలు అందిస్తారన్నారు. మన పార్టీ-మన సభ్యత్వం అనేలా అందరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, దామచర్ల అనీషా, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం : మంత్రి

కొండపి: కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని మంత్రి స్వామి పేర్కొన్నారు. శనివారం కొండపిలోని టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. కార్యకర్తల ప్రమాద బీమాను రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచినట్లు చెప్పారు. గతంలో సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులు కొన్ని రాలేదని, ఈ దఫా అందరికీ అందేలా చేస్తామని తెలిపారు. ఇప్పటి నుంచి పార్టీ, అనుబంధ కమిటీలన్నీ రద్దయ్యాయన్నారు. జనవరిలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కొత్త కమిటీలు ఏర్పడతాయని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గొర్రెపాటి రామయ్య చౌదరి, కొర్రపాటి వసంతరాయుడు, చింతల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్ శనివారం స్థానిక కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, బెల్లం జయంత్‌బాబు, బ్రహ్మానందం పాల్గొన్నారు.

మంగమూరులో..

సంతనూతలపాడు: మంగమూరులో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ప్రారంభించారు. రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు మొదటి సభ్యత్వ నమోదు తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణరావు, ఎస్.చిన్న, పి.బుజ్జి, వి.రవి, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: టీడీపీకి కార్యకర్తలే మూల స్తంభాలను ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ రంగారావు అన్నారు. శనివారం మద్దిపాడులోని టీడీపీ కార్యలయలో సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నాగన్నపాలెం సర్పంచ్ కాకర్ల విజయకుమార్, మండవ గోపీనాథ్, మండవ మారుతీప్రసాద్, దేవబత్తిన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మనబ్రోలులో..

నాగులుప్పలపాడు: టీడీపీ సభ్యత్వ నమోదును పార్టీ శ్రేణులు విస్తృతంగా చేపట్టాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ కోరారు. అమ్మనబ్రోలులోని టీడీపీ కార్యాలయం వద్ద శనివారం సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఈదర వెంకట కృష్ణారావు, వలేటి పాండురంగారావు, మహ్మద్‌బేగ్, స్వర్ణ కిషోర్‌బాబు, సిరిమళ్ల ఏలియా, బొద్దపాటి కృష్ణ, మందపాటి అంజనేయులు పాల్గొన్నారు.



టంగుటూరులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్



మద్దిపాడులో సభ్యత్వ నమోదు చేస్తున్న జయంత్‌బాబు, రంగారావు



అమ్మనబ్రోలులో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మనోజ్‌కుమార్

టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

సింగరాయకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రాంగణంలో శనివారం టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణమ్మ, ఈవో పి.కృష్ణవేణి, చైర్మన్ పామర్తి మాధవరావు, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాలక్ష్మీనరసింహాచార్యులు, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, కూనపరెడ్డి సుబ్బారావు, జి.హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, గుడే వెంకటేశ్వర్లు, సర్దార్, శేషు, రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కె.ఉప్పలపాడు విద్యార్థి

కొండపి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హైజంప్ బాలుర (అండర్-14) పోటీలకు కె.ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎన్.ప్రణీత్ ఎంపిక య్యారు. వచ్చేనెల 5న ఏలూరు జిల్లా కైకారంలో జరిగే పోటీలలో పాల్గొననున్నారు. ఈసందర్భంగా ప్రణీత్‌ను స్కూల్ హెచ్‌ఎం సున్నకుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ.రవికిరణ్, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు అభినందించారు.

వైసీపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి

- జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి పిలుపు



ముఖ్యనేతలతో సమావేశమైన శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలుకలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైసీపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ముఖ్యనాయకులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. పార్టీ అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్‌రావు, రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు టీజేఆర్.సుధాకర్‌బాబు, సీనియర్ నేత బత్తుల బ్రహ్మానందరెడ్డి, నగర అధ్యక్షుడు కఠారి శంకర్‌తో పాటు జిల్లాలోని పలునియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్పొరేటర్లు తదితరులు హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అనంతరం జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మరో వైపు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే దామచర్ల
- సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, మాధవి

కొత్తపట్నం(ఒంగోలునగరం) అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం కొత్తపట్నం మండలంలోని కొత్తపట్నం పల్లెపాలెం, రంగాయపాలెం, పాదర్తి గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తొలుత పల్లెపాలెంలో రూ.1.06 కోట్లతో చేపట్టనున్న సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కె.పల్లెపాలెంలోని మత్స్యకారులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గతంలో మత్స్యకారుల పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఆశ్రమ పాఠశాలలను తిరిగి పునరుద్ధరించాలని, గ్రామంలో డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేయాలని, అర్హులకు ఇళ్ల పట్టాలను అందజేయాలని, శ్మశానవాటికకు చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని వినతి చేశారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ మత్స్యకార గ్రామాల్లో ఉన్న అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు, ఎంపీడీవో శ్రీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి, ఎంపీటీసీ నరసింహారావు, నాయకులు ప్రభుప్రకాష్, తమ్ము శ్రీను, రత్తయ్య పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ

ఒంగోలు కార్పొరేషన్: నగరంలోని మంగమ్మ కాలేజీ వద్ద నుంచి కర్నూలు రోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు రూ.1.30 కోట్లుతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. గత ఐదేళ్ళలో నగరంలో అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు మెచ్చుకునేలా సీఎం చంద్రబాబు పాలన ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆలస్యంగా ప్రారంభం.. అరకొర చర్చ

- సాదాసీదాగా మండల సమావేశం
- హాజరు కాని మెజారిటీ వైసీపీ సభ్యులు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో టంగుటూరు సర్పంచ్ వాగ్వివాదం



అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య వాదోపవాదాలు

టంగుటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం కోరం లేక మధ్యాహ్నం 12.30 గంటలకు మొదలైంది. మండలంలోని మొత్తం 18 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 15 మంది వైసీపీ, ముగ్గురు టీడీపీకి చెందిన వారు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది రెండో సమావేశం కాగా వైసీపీకి చెందిన నలుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. టీడీపీ నుంచి మరో ఇద్దరు వచ్చారు. ఎంపీపీ సైతం గైర్హాజరయ్యారు. కోరంకాగానే ఎంపీడీవో దేవసేనకుమారి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుమన్‌రెడ్డిని అధ్యక్షస్థానంలో కూర్చోబెట్టి సమావేశాన్ని ప్రారంభించారు. అధికారుల్లో ప్రధాన శాఖలకు చెందిన వారంతా హాజరయ్యారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతుండగా టంగుటూరు పంచాయతీ సభ్యుడు మక్కెన కోటేశ్వరరావు అడ్డుతగిలారు. నీటి సరఫరాలో అవరోధాలు వస్తే మాకు చెప్పాలిగా అని ప్రశ్నించారు. నేనెందుకు చెప్పాలి.. మీరే తెలుసుకోవాలని ఏఈ సమాధానం ఇవ్వడంతో ఇద్దరి మధ్య మాటలు పెరిగాయి. ఈ సమయంలో టంగుటూరు సర్పంచ్ మద్దిరాల మమత జోక్యం చేసుకొని మాకెందుకు చెప్పరని ఏఈని నిలదీయండంతో కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. సమావేశంలో అనంతవరం, ఆలకూరపాడు, టంగుటూరు-4, కారుమంచి, పొందూరు, కొణిజేడు ఎంపీటీసీ సభ్యులు కసుకుర్తి కోటేశ్వరరావు, శేషమ్మ, కొమ్ము దాసు, సుమన్‌రెడ్డి, పమిడి నాగేశ్వరరావు, బుర్రా అంకరాజు, వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్‌బాబు, ఉద్యానవనశాఖాధికారి తేజ, ఏపీవో సుభాషిణి, ఎంఈవో చెంచుపున్నయ్య, ఏవో జి.స్వర్ణలత, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ విజయ మాధురి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమతానగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు : కమిషనర్



సూచనలు ఇస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 38వ డివిజన్ పరిధిలోని సమతానగర్‌లో సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక సమతానగర్‌లో ఆయన ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలు తాగునీటి సరఫరాతోపాటు, వర్షం వస్తే నీరు రోడ్లపై నిలుస్తుందని తెలిపారు. మురుగుకాలువలో నీరుపాదల సక్రమంగా లేదని కమిషనర్‌కు వివరించారు. ఈ ఆయన మాట్లాడుతూ మెయిన్‌రోడ్ నుంచి అడ్డరోడ్డుకు వెళ్ళే జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న కల్వర్టు తొలగించి, కాంక్రీట్ కల్వర్ట్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రధాన కాలువ అనేక మలుపులు తిరిగి ఉందని, ఆ ప్రాంతాన్ని సర్వే చేసి, కాలువలపై ఆక్రమణలు తొలగించాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి ఆదేశించారు. కర్నూలురోడ్‌లోని హోటళ్ళలో నుంచి వచ్చే వ్యర్థాలు, మురుగునీరు రోడ్లపైకి రాకుండా శానిటరీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, ఎంఈ చంద్రయ్య, ఏసీపీ సుధాకర్, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విధులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు (కొండపి) : పొన్నలూరు జడ్పీ స్కూల్ విద్యార్థులకు పోలీసు విధులపై స్టేషన్‌లో ఎస్సై కె.అనూక్ శనివారం అవగాహన కల్పించారు. పోలీసు విధులు, పౌరుల బాధ్యతలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. అంతకుముందు సైబర్ నేరాల నియంత్రణలో యువతపాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో వైద్య పరీక్షలు

మద్దిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని బీసీ వసతిగృహంలో శనివారం డాక్టర్ ఆనంద్‌మోహన్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. ఆకుకూరలు ఎక్కువగా ఆహారంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధార్ సేవలు

మద్దిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు శనివారం ప్రత్యేకంగా ఆధార్ శిబిరం నిర్వహించారు. సుమారుగా 35మంది విద్యార్థులు ఆధార్ సేవలను ఉపయోగించుకున్నారు. ఈవోఆర్డీ రఘుబాబు పరిశీలించారు. ఆధార్‌లో పేర్లు మార్పు, జనన తేదీ సరిచేయటం వంటి వాటిని చేపట్టినట్లు డీపీ పద్మ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏపీఎంకు అభినందన

మద్దిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంక్ ద్వారా డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు చేయించడంపై ఏపీఎం సుధాకర్‌ను జనరల్ మేనేజర్ మమత ఏఆర్ జోషి శనివారం అభినందించారు. సుధాకర్ పది రోజుల్లో 59గ్రూపులకు రూ.8కోట్ల రుణం ఇప్పించారని, మరిన్ని డ్వాక్రా గ్రూపులకు రుణాలు ఇప్పించాలని సూచించారు. అనంతరం సుధాకర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

గ్రామసభల్లో సమస్యల వెల్లువ

చీమకుర్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : రీసర్వే జరిపిన గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం మండలంలోని రంగసాయిపురం, నేకునంబాదు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. చిన్న గ్రామమైన నేకునంబాదు నుంచే 57అర్జీలు అందటం పరిస్థితికి అద్దం పడుతున్నది. ఈ సందర్భంగా తహసీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ సమస్యలన్నింటికి వీలైనంత త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కర్నాటి హరిబాబు, టీడీపీ నాయకులు పొందూరి హరిబాబు, నరికొండ చిరంజీవిరాజు, జ్యోతి వేణు, గమిని ప్రసాద్, బెల్లంకొండ రామచంద్రరావు, నారిపెద్ది అంజమ్మ, కృష్ణారావు పాల్గొన్నారు.

దొడ్డవరప్పాడులో..

మద్దిపాడు: దొడ్డవరప్పాడులో మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. తహసీల్దార్ సృజనకుమార్ భూసమ్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమలో సర్పంచ్ బెజవాడ శ్రీరామమూర్తి, పాటిబండ్ల అజయ్‌బాబు, ముల్లూరి మురళి, వై.అంకమ్మ, పి.సురేష్‌కుమార్, గోరంట్ల వెంకట్రావు, గోరంట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాగుంటను కలిసిన ఎమ్మెల్యే మాధవి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి మార్యదపూర్వకంగా కలిశారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాగుంటకు ఎమ్మెల్యే మాధవి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

సౌత్ జోన్ పోటీలకు పేస్ విద్యార్థి ఎంపిక



రాహుల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఒంగోలు విద్య, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం చదువుతున్న ఆర్.రాహుల్ సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. భీమవరం ఎస్‌ఆర్‌కేటీ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపడంతో రాహుల్ యూనివర్శిటీ జట్టులో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా శనివారం రాహుల్‌ను స్థానిక కళాశాలలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ అభినందించారు. తమిళనాడులోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో ఈనెల 27నుంచి 29 వరకు జరగనున్న పోటీలకు హాజరవుతారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ వి.సుబ్బారావు, అప్పారావు, ఆర వీరాంజనేయులు పాల్గొన్నారు.

కొండలను అధిరోహించిన విద్యార్థులు



యరజర్ల కొండపైకి చేరిన విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో ఆరు, ఏడు తరగతులు చదువుతున్న విద్యార్థులు శనివారం కొండలను అధిరోహించారు. సుమారు 200మంది విద్యార్థులు యరజర్ల నుంచి మర్లపాడు కొండల మీదుగా కొణిజేడు కొండలను ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఎక్కారు. ఇలాంటి క్షేత్ర పర్యటనలు విద్యార్థుల్లో ఐక్యత పెరగడానికి, మనోధైర్యం పెంపొందించేందుకు దోహదపడుతాయని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సాయినాధుని శృతి తెలిపారు.

వెబ్‌సైట్‌లో కేజీబీవీ పోస్టుల మెరిట్ జాబితాలు

ఒంగోలు విద్య, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికావిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులభర్తీకి సంబంధించి అభ్యర్థుల ప్రాథమిక మెరిట్ జాబితాలు ప్రకాశం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు 1:10 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. అనంతరం అభ్యర్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 27, 28వ తేదీల్లోపు తమ అభ్యంతరాలకు తగు ఆధారాలతో సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

గౌతమి కిడ్స్‌లో బ్లూ డే వేడుకలు



బ్లూ డ్రస్సుల్లో చిన్నారులు

ఒంగోలు విద్య అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని గౌతమ్ కిడ్స్ స్కూలులో శనివారం బ్లూడే వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో పాఠశాలలోని నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు బులుగు రంగుపై అవగాహన కల్పించేందుకు బ్లూడ్రెస్ ధరించారు. వివిధవస్తువులు, బొమ్మలను చిన్నారులకు చూపించి వారికి బులుగు రంగుపై అవగాహన కల్పించినట్లు పాఠశాల చైర్మన్ ఎం.కొండయ్య తెలిపారు. పాఠశాల డైరెక్టర్ పద్మజ, ప్రిన్సిపాల్ అలెక్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్

కొండపి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వం రాయితీపై ఇచ్చే శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ఈనెల 28 నుంచి ప్రారంభమవుతుందని ఏవో డి.విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 25శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. క్వింటా ఎర్ర శనగలు ఖరీదు రూ.9,400 కాగా అందులో రాయితీ పోను రూ.7,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. తెల్లశనగలు క్వింటా రూ.12,100 ఉండగా అందులో సబ్సిడీ పోను రూ.9,075 చెల్లించాలని ఏవో వివరించారు. రైతులు వారి ఆధార్ కార్డు, పొలం పాస్‌పుస్తకం, ఫోన్ నంబరుతో వచ్చి ఓటీపీ చెప్పి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

డీఈవోకు శుభాకాంక్షలు

ఒంగోలు విద్య, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎ.కిరణ్‌కుమార్‌ను ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు శనివారం ఒంగోలులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టీఎల్.కాంతారావు, వై.వెంకట్రావు, కోశాధికారి జీఎస్‌ఆర్.సాయి, నాయకులు సీహెచ్.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, డీసీఈబీ కార్యాలయం శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు లంకా దినకర్ ఆత్మీయ సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన లంకా దినకర్ ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం పదిన్నరగంటలకు ఒంగోలులోని ఎ1 కన్వెన్షన్‌హాలులో జరుగుతుందని లంకా దినకర్ మిత్రమండలి ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యంషాపు ఏర్పాటుపై నిరసన



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీకాంత్

నాగులుప్పలపాడు అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నివాస సముదాయాల ఎదురుగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఉప్పుగుండూరు గ్రామంలోని మద్యం షాపును మట్టిగుంట రోడ్డులోని టెలిఫోన్‌ఎక్స్చేంజ్ కార్యాలయం ఎదురుకు మార్చి ఆదివారం ప్రారంభించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దాంతో స్థానిక పురుషోత్తం కాలనీవాసులు సదరు మద్యం దుకాణాన్ని తమ కాలనీ వద్ద నుంచి తరలించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దాంతో ఎస్‌ఐ బి.శ్రీకాంత్ అక్కడకు చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని శాంతింపజేశారు. అబ్కారీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

హిందూ ధర్మ రక్షణ అందరి బాధ్యత



ప్రసంగిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

మద్దిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మరణ రక్షణలో అందరి బాధ్యతని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) దక్షిణాంధ్ర ప్రాంత సత్సంగ వర్గ కేంద్రమంత్రి యక్కలి రాఘవులు కోరారు. శనివారం మల్లవరంలోని శ్రీవేంకటేస్వామి దేవస్థాన ప్రాంగణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మం సంరక్షణ తదితర అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో నందిరెడ్డి సాయిరెడ్డి, పండరీనాథ్, సోమా సుబ్బారావు, పర్రె కోటేశ్వరరావు, శివశంకర్, స్వాత్మానంద స్వామీజీ, మహా విద్యానందగిరి మాతాజీ, తూనుగుంట మల్లికార్జున్, సత్సంగ సభ్యులు పాల్గొన్నారు.

ఇవేం తనిఖీలు బాబోయ్

● నగరంలో విస్తృత తనిఖీలు ● 60 బృందాల ఏర్పాటు

● ద్విచక్రవాహనదారుల అవస్థలు ● పరిశీలించిన ఎస్పీ దామోదర్



సరైన పత్రాలు లేని ద్విచక్రవాహనదారులను పట్టుకొని జరిమానా రాస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వారాంతంలో పోలీసు తనిఖీలు ద్విచక్ర వాహనదారులను చుక్కలు చూపెట్టింది. శనివారం నగరంలో విజిబుల్ పోలీసింగ్ పేరుతో పోలీసులు 60 బృందాలుగా ఏర్పడి బైక్‌లను తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా నగరాన్ని అష్టదిగ్బంధం చేసి తనిఖీలు నిర్వహించారు. దీంతో వాహనదారులు బయటకు రావాలంటేనే భయపడ్డారు. అదేసమయంలో సామాన్యులు సైతం తనిఖీలు చూసి దొంగలు ఏమైనా తిరుగుతున్నారా.. అంటూ చర్చించుకోవడం జరిగింది. పోలీసు తనిఖీలను ఎస్పీ ఏఆర్.దామోదర్ శనివారం రాత్రి స్వయంగా పరిశీలించారు. వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్, వాహనం ఆర్‌సీ, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు ఉన్నాయా.. అనేది ప్రధానంగా పరిశీలించారు. ఈ తనిఖీలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తనిఖీలు కొనసాగాయి. ఈ తనిఖీలలో మోటర్‌సైకిల్‌పై వెళుతున్న ఓ పాత నేరస్థుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

తనిఖీలు ఇబ్బంది కలిగించాయి.

నగరంలో ఉదయం 9 గంటల నుంచి తనిఖీలను పోలీసులు ప్రారంభించారు. అదే సమయంలో ఒక్కో పాయింట్ నుంచి 10 వాహనాలు ఖచ్చితంగా సీజ్ చేయాలని అంక్ష లు పెట్టడంతో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది కాస్తంత అత్యుత్సాహం చూపించారు. పేపర్లు ఇంట్లో ఉన్నాయి అని చెప్పినా వినిపించుకోకుండా వాహనం సీజ్ చేయడం కొందరిని ఇబ్బందులకు గురిచేసింది. అదే సమయంలో వివిధ కార్యాలయాలకు వెళ్లే వారు సైతం తనిఖీల కారణంగా ఆలస్యంగా వెళ్లారు. దీంతో అక్కడ వారికి ఉన్నతాధికారుల నుంచి సమస్య ఏర్పడింది. అంతేకాదు ఆఫ్‌డే సెలవు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. పోలీసు సిబ్బంది తీసుకునే చర్యలు అందరికీ అవగాహన కలిగించేలా ఉండాలి కానీ ఇలా ఇబ్బందిపెట్టేలా ఉండకూడదని పలువురు వాపోయారు.

కొత్త వాహనాలకు కష్టాలే

అదేవిధంగా కొత్తగా వాహనం కొనుగోలు చేసిన వారికి షోరూంల నుంచి పేపర్లు ఇవ్వడం లేదు. అయితే ఆ వాహనాలను సీజ్ చేశారు. అందుకు కారణం వాహనదారుడు కాదు. అది పూర్తిగా షోరూంలో జరుగుతున్న తప్పిదం. ఆ విషయాన్ని రవాణా శాఖ అధికారులు కలుగజేసుకొని వాహనం కొనుగోలు చేసిన వెంటనే టీఆర్ నంబరుతో పేపర్లు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి. తనిఖీల మూలంగా అత్యవసరంగా బయటకు వచ్చిన వారికి సైతం అవస్థలు తప్పలేదు. ఒక యువకుడు కారుమంచి నుంచి కొత్తపట్నంలోని వసతిగృహంలో ఉన్న తన అల్లుడిని ఇంట్లో జరిగే శుభకార్యానికి తీసుకెళ్లేందుకు ఒంగోలు



వచ్చి పోలీసులకు దొరికాడు. అతని వద్ద ఎలాంటి పేపర్లు లేవు. దీంతో వాహనం సీజ్ చేశారు. ఆ యువకుడు ఇంటి వద్ద ఉన్న పేపర్లు వాట్సాప్ పెట్టించి చూపిస్తాను అన్నా పోలీసులు స్పందించలేదు. దీంతో అతను వెనుతిరిగి ఇంటికి వెళ్లాడు. ఇలా చిన్న చిన్న వ్యాపారులు, చిరు ఉద్యోగులు అవస్థలు పడ్డారు. అంతే కాకుండా పోలీసులు తనిఖీలు శనివారం జరుగుతాయని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చాలా మంది జాగ్రత్తలు తీసుకున్నారని తెలిసింది. ముఖ్యంగా నేర చరిత్ర కలిగిన వారు రోడ్ల మీదకు రాలేదు. ముఖ్యంగా స్పోర్ట్స్ బైక్‌లతో నగర రోడ్లపై హల్‌చల్ చేసే యువత పెద్దగా బయట కనిపించని పరిస్థితి.

తనిఖీలు పరిశీలించిని ఎస్పీ

ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా నగరంలో జరిగిన ప్రత్యేక తనిఖీలను ఎస్పీ ఏఆర్.దామోదర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నగరంలో 500 మంది పోలీసులతో 61 ప్రాంతాలలో తనిఖీలు జరిగాయి. ఎస్పీ మాట్లాడుతూ 795 వాహనాలను తనిఖీలు చేసి అందుకు సంబంధించిన చలానాలను కట్టించామన్నారు. ఎలాంటి పేపర్లు లేని వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. ముఖ్యంగా నంబర్ లేకుండా తిరుగుతున్న వాహనాలకు ప్లేట్లు ఏర్పాటు చేయించామని అన్నారు. రోడ్డుప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరు రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. లైసెన్స్, వాహనపత్రాలు వెంట తీసుకురావాలని, విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఆయన వెంట ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



సూక్ష్మసేద్య పరికరాలకు సంబంధించిన పత్రాలను అందజేస్తున్న మంత్రి స్వామి

రైతుల అభ్యున్నతికి చేయూత

● మంత్రి స్వామి

● బిందు, తుంపర సేద్య పరికరాల పంపిణీ

మర్రిపూడి,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా చేయూత అందిస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూక్ష్మసేద్యం కింద నియోజకవర్గంలోని 124 మంది రైతులకు బిందు, తుంపర పరికరాలను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు పెద్దఎత్తున సూక్ష్మసేద్య పరికరాలను పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. వైసీపీ పాలనలో రైతుల సంక్షేమం ఊసే మరిచారని విమర్శించారు. జిల్లాలో 75వేల ఎకరాల్లో సూక్ష్మసేద్యం అమలుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

ఇప్పటి వరకు 2,931 మంది రైతులకు 3,227 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.33.11కోట్ల రాయితీతో పరికరాలను అందజేశామన్నారు. కొండపి నియోజకవర్గంలో 124 మంది రైతులకు 131 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.94.41లక్షల రాయితీతో పరికరాలు ఇచ్చామని తెలిపారు. భూగర్భ జలాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్వల్ప నీటి ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. అనంతరం స్థానిక సుబ్రమణ్యేశ్వర కాంప్లెక్స్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రమణ, టీడీపీ నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, రేగుల వీరనారాయణ, చేరెడ్డి నర్సారెడ్డి, గొంటు హనుమారెడ్డి, తుళ్లూరి నరసింహారావు, వై.వెంకటరెడ్డి, గురిజాల బాబూరావు, గురిజాల పోలయ్య, గురిజాల రాజేష్, కొణిదెన మోహన్‌రావ్, సారెడ్డి ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపు

ఒంగోలు విద్య, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025 మార్చి, ఏ ప్రిల్‌లో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 28నుంచి నవంబరు11వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ప్రభుత్వ పరీక్షల సహాయ కమి షనర్ శివకుమార్ శనివారం తెలి పారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఒ కసారి పరీక్ష రాసి ఫెయిలైన విద్యార్థులు కూడా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.50 అపరాధ రుసుంతో నవంబరు 18వర కు, రూ.200 రుసుం తో 25 వరకు, రూ.500 రుసుంతో 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించ వచ్చు. రెగ్యులర్ విద్యార్థులు పరీక్ష ఫీజు రూ.125, 3 సబ్జెక్టులకు మించి రూ.125, 3 సబ్జెక్టుల వరకు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60, వయస్సు మినహాయింపునకు రూ.300 ఫీజు చెల్లించాలి. మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జేడీఏ శ్రీనివాసరావు

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దర్శి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పంటల తెగుళ్ల నివారణకు సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జేడీఏ ఎస్. శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో అవగాహన, సదస్సు, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వలన పంటలకు తెగుళ్ళు, చీడపీడలు ఆశిస్తున్నాయని ఆరంభంలోనే నివారించేందుకు సత్వరమే సస్యరక్షణ చేపట్టే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి వినియోగంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. రబీ పంటల సాగులో రైతులు శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు తీసుకొని అనువైన వంగడాలను సాగుచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన అధికారి డాక్టర్ వరప్రసాదరావు, ప్రధాన శాస్త్రవేత్త సంధ్యారాణి, ఏడీఏ బాలాజీనాయక్, సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

శింగరకొండలో అన్నదానానికి పెరిగిన భక్తులు

అద్దంకి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద నిత్య అన్నదానం ఉన్నప్పటికీ ఇటీవల వరకు నిర్దేశించిన సంఖ్య వరకు మాత్రమే జరిగేది. అయితే శనివారం అనూహ్యంగా భక్తుల సంఖ్య పెరగడంతో అప్పటికప్పుడు ప్రత్యేక ఏర్పాట్లు చేసి వచ్చిన భక్తులందరికీ అన్నదానం అందేలా చేశారు. ఇటీవల వరకు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం 500 మంది, ఆదివారం 350 మంది, మిగిలిన రోజులలో 200 మంది భక్తులకు మధ్యాహ్నం అన్నదానం జరిగేది. ఇటీవల ఈవోగా బాధ్యతలు చేపట్టిన తిమ్మానాయుడు అన్నదానంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి రోజూ అన్నదానానికి ఎంత మంది భక్తులు వస్తే అంతమందికీ అన్నదానం నిర్వహించేలా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం 773 మంది దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భోజనం చేశారు. భక్తుల సంఖ్య పెరగడంతో అన్నదాన మండపంలో స్థలం సరిపోక పోవడంతో బయట టెంట్‌లను ఏర్పాటు చేసి అన్నం వడ్డించారు. రాత్రి సమయంలో కూడా దేవాలయం వద్ద ని ద్రించే భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేలా అన్నదానం ప్రారంభించారు. ప్రస్తుతం రాత్రిపూట 50 మందితో ప్రారంభించగా, భక్తుల సంఖ్య పెరిగితే అందరికీ అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

గుండ్లకమ్మలో ఆక్రమణలపై కొనసాగిన సర్వే

అద్దంకి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలో ఆక్రమణల పై రెండవ రోజు శనివారం సర్వే కొనసాగింది. గుండ్లకమ్మ నది ఆక్రమణలు, కలుషితంపై ప్రజా సంఘాల పోరాటంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో శుక్రవారం నుంచి మండల సర్వేయర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. రెండోరోజు శనివారం కూడా బ్రిడ్జి ఎగువ భాగానా సర్వే చేపట్టారు. ప్రజాసంఘాల నేతలు మన్నం త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కార్యకర్తలకు టీడీపీ అండ

» విద్యుత్ మంత్రి రవికుమార్

» పార్టీ సభ్యత్వాల నమోదు ప్రారంభం

అద్దంకి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : ఆపద లో ఉన్న కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచే పార్టీ తెలుగుదేశం పార్టీ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద మంత్రి గెస్ట్‌హౌస్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ముందుగా మంత్రి రవికుమార్ రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, అనుబంధ సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ శ్రేణులకు సభ్యత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 100 రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. నియోజకవర్గంలో గతంలో కంటే ఎక్కువ సభ్యత్వ నమో దు జరిగేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కూడా త్వరలో అమలు చేస్తామన్నారు. గ్రామాలలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యానికి ప్రాధాన్యత కల్పించి ప్రజల వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అద్దంకి పట్టణ, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు, కఠారి నాగేశ్వరరావు, రావూరి రమేష్, ఇ బ్రాయిల్, గాడిపర్తి వెంకటరావు, నేతలు అట్లా చినవెంకటరెడ్డి, కరి పరమేష్, ఏసోబు, సన్నెబోయిన ఏడుకొండలు,కరి సుబ్బారావు, కుందారపు రామారావు, కాకాని అశోక్, గుర్రం శేఖర్ పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వ రసీదును అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

సభ్యత్వ నమోదుతో భరోసా : ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు ఆర్థిక భరోసా చేకూరుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా పార్టీ నిలుస్తుందని, రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న కార్యకర్తకు రూ.5లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా సభ్యత్వ నమోదు తీసుకోవాని ఆయన కోరారు. పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రారంభించారు.

దంత వైద్యానికి పెరిగిన ప్రాధాన్యం

● మంత్రి స్వామి

● ఒంగోలులో ఘనంగా ఐడీఏ రాష్ట్ర స్థాయి సదస్సు ప్రారంభం

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దంత వైద్యానికి గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రాధాన్యత పెరిగిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఇండియన్ డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సదస్సు శనివారం ఒంగోలులో ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఐటీఏ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ఐడీఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించగా, మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, గల్లా మాధవిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి నేతలు సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వైద్యరంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. అందుబాటులో ఉన్న అడ్వాన్స్ టెక్నాలజీని వినియోగించుకుని మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సదస్సు డెంటల్ సీనియర్ డాక్టర్స్ అందించే సలహాలు, సూచనలు నేటితరం వైద్యులకు ఉపయోగపడతాయన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సదస్సు ఒంగోలులో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఐడీఏ అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అలాగే దంత వైద్యరంగంలో వచ్చిన ఆధునిక టెక్నాలజీ అందరికీ ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా నాటి తరం వైద్యులు ఇచ్చే సలహాలు, సూచనలు నేటి తరం వైద్యులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అలాగే ఎప్పటికప్పుడు టెక్నాలజీలో మార్పులు రావడం, నూతన వైద్య పరికరాలు అందుబాటులోకి రావడంతో నేడు డెంటల్ విభాగానికి కూడా ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు ఐడీఏ జిల్లా సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆర్గనైజింగ్ చైర్మన్ ఆర్.శ్రీధర్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ కోశాధికారి వేమూరి సురేష్, కాన్ఫరెన్స్ చైర్మన్ సుధాకర్‌రాజు, కాన్ఫరెన్స్ సెక్రటరీ ఆర్.రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్‌బెనర్జీ, మురళీధర్‌రెడ్డి, ఎం.రాంబాబు, అరవింద్, అమృతకుమార్ పాల్గొన్నారు.



ఐడీఏ జిల్లా సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్

ఉపాధి పనుల్లో అవినీతి

● సామాజిక తనిఖీలో సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం

● బాధ్యతారాహిత్యంగా పనిచేస్తే వేటు

● రూ.7 లక్షలు రికవరీ చేయాలని ఆదేశం

పామూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పామూరు మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతి కన్నా సిబ్బంది బాధ్యతారాహిత్యం అధికంగా ఉందని, పని తీరు మార్చుకోకపోతే వేటు తప్పదని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ హెచ్చరించారు. పామూరు మండలంలో 2023- 2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 603 పనులకు గాను ఖర్చు చేసిన రూ. 12,11,76,918లపై స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఉపాధి పథకం కింద చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగాయని గుర్తించారు. సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు పంచాయతీల్లో అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు లేవని, కేవలం గుంతలు మాత్రమే ఉన్నాయని డీఆర్పీలు తెలిపారు. మొక్కల మీద పెట్టిన నిధులు వృథా అయినట్లు అధికారులు గుర్తించి సిబ్బందిని నిలదీశారు. కోడిగుంపల, చింతలపాలెం, లక్ష్మీనరసాపురం పంచాయతీల్లో పని ప్రదేశంలో నాటిన మొక్కలు లేక పోవడంతో సంబంధిత టీఏ, ఎఫ్ఏలకు జరిమానా విధించారు. రోజ్‌గార్ నివాస్ కార్యక్రమాలు చేపట్టడం లేదని, జాబ్‌కార్డు మంజూరుకు రూ. 500లు, వారానికి రూ.100 లు కూలీల నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో మానవత్వంతో పనిచేయాలని సూచించారు. వగ్గంపల్లిలో హార్టీకల్చర్ కింద పండ్ల తోటలను సాగు చేసిన రైతులకు బ్యాంకు ఖాతాలు తెరవకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గ్రామానికి వెళ్లి రైతులతో సమావేశం పెట్టి బ్యాంకు ఖాతాలను తెరిపించి తనకు ఫొటోలు పెట్టాలని హెచ్చరించారు. పంట కుంటల పనుల్లో, కొలతల్లో భారీగా వ్యత్యాసం ఉందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనుల్లో విచారిస్తామని పీడీ తెలిపారు. సక్రమంగా పనులు చేయకపోతే మానుకోవాలని సూచిస్తూ ఉపాధి పనుల అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో రూ.3.37 లక్షలు, పీఆర్ పనుల్లో జరిగిన అవినీతి పై రూ. 3.50 లక్షలు సంబంధిత వ్యక్తుల నుంచి వారం రోజుల్లో రికవరీ చేపట్టాలని ఆదేశించారు. మరోమారు ఉపాధి పనుల్లో అవినీతికి ఆస్కారం ఇస్తే ఉపేక్షించేదిలేదన్నారు. డీవీవో ఝాన్సీరాణి, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో బి. సురేష్, ఏపీవో బి. మాల్యాద్రి, ఎస్ఆర్‌పీ వెంకటేశ్వరరావు, డీఆర్‌పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ

ప్రతి కార్యకర్త సంక్షేమానికి కృషి

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే నారాయణ రెడ్డి ఆయన సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం నియోజకర్గంలో 50 వేల పార్టీ సభ్యత్వం నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి నాయకుడు, క్రియాశీలక కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాల న్నారు. ముఖ్యంగా సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా ఉందనే విషయాన్ని కార్యకర్తలకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి, కౌన్సిలర్ నాలి కొండయ్య, మాలపాటి వెంకటరెడ్డి, మర్రి.కొండలు, తడికమళ్ల బాలసుబ్బారావు, కొప్పుల వెంకటే శ్వర్లు, పఠాన్ హుసేన్‌ఖాన్, షాకీర్, దూపాటి యలమంద, మేడిద రంగస్వామి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు) :టీడీపీ సభ్యత్వాన్ని ప్రతి కార్యకర్త తీసుకోవాలని వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం ఎర్రగొండ పాలెం పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ఎరిక్షన్‌బాబు లక్ష రూపాయలతో శాశ్వత సభ్యత్వం తీసుకొని మరో 15 మందికి లక్ష రూపాయలతో శాశ్వత సభ్యత్వం ఇప్పించారు. సభ్యత్వం ఇప్పించారు. కస్టర్ల వారిగా ప్రతి ఒక్కరు టీడీపీ సభ్యత్వం తీసుకోనేందుకు టీడీపీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాద్, మల్లికార్జునరెడ్డి, నాయకులు వేగినాటి శ్రీనివాస్, కామేపల్లి వెంకటేశ్వర్లు,కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, షేక్.వలి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలకు సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

కంభం : మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. కంభం పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని షేక్ అత్తర్‌హుస్సేన్, చమన్ తది తరులు 53, 54 పోలింగ్ కేంద్రాల పరిధిలో నమోదు చేయించారు.కార్యక్రమంలో బూత్ కన్వీనర్ నాగూర్‌వలి, ఖాదర్‌వలి, ఖాదర్‌హుస్సేన్, రజాక్, రవి, పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయం వీధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగు యువత అధ్యక్షులు దొడ్డా శేషాద్రి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చంటి, షేక్ సమ్మద్‌బాష, ఈదర మల్లయ్య, షేక్ ఇస్మాయిల్, బాష, ఎలకపాటి చెంచయ్య, బట్టు సుధాకర్‌రెడ్డి, ఏర్వ మల్లికార్జునరెడ్డి, షేక్. మౌలాలి, రఫీ, తాతిరెడ్డి, దానం తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

గిద్దలూరు టౌన్ : టీడీపీ సభ్యత్వ నమోదు గిద్దలూరు నియోజకవర్గంలో ముమ్మరంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశానుసారం నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు సభ్యత్వ నమోదు తీసుకుంటున్నారు. పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య లక్ష రూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా బాలీశ్వరయ్య మాట్లాడుతూ టీడీపీ పట్ల అభిమానం, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలే తనను ఆకర్షించాయని, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలతో తాను స్ఫూర్తి పొందానన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబ భద్రత

పెద్దారవీడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో కుటుంబభద్రత ఉంటుందని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గొట్టం రామనారాయణరెడ్డి, వల్లూరి సుబ్బారెడ్డి, వేశపోగు సాల్మన్‌రాజు, పిక్కిలి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవా మద్యం సీసాల స్వాధీనం

కంభం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణంలోని ఓ గృహంలో అక్రమంగా నిలువ ఉంచిన 50 గోవా మద్యం సీసాలను మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్య స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కంభం మధుప్రియ రెస్టారెంట్ సమీపంలో నివాసం ఉంటున్న కొప్పాలపాటి గోపీకృష్ణ గృహంలో పెద్దఎత్తున మద్యంసీసాలను నిలువ ఉంచి రహస్యంగా విక్రయిస్తున్నాడనే సమాచారం అందింది. దీంతో శుక్రవారం రాత్రి ఇంటిపై అధికారలు దాడి చేశారు. 50 ఫుల్‌బాటిళ్ల గోవా మద్యం పట్టుబడినట్లు ఆయన తెలిపారు. ఇకపై రైల్వేస్టేషన్, బస్టాండ్‌ల వద్ద నిఘా ఉంటుందన్నారు. దుకాణాలలో ఎవరైనా ఎక్కువ బెల్లం అమ్మినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.





రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఈ.చిరంజీవి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థిని అభినందించి మాట్లాడారు. కందుకూరులో ఈనెల 25న జరిగిన అండర్-17 బాలుర అథ్లెటిక్స్ పోటీలు 110 మీటర్ల హడిల్స్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.జాహ్నవి ప్రియ, చెన్నకృష్ణ, ఉపాధ్యాయులు సమీవుల్లా, రమేష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయం లేదేమో!

గిద్దలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మున్సిపాలిటీకి కొత్త కమిషనర్‌గా బి.వెంకటదాసు ఆగస్టు 24న బాధ్యతలు చేపట్టారు. కానీ మున్సిపల్ కమిషనర్ గదిలోని బోర్డులో మాత్రం ఇంకా ఇన్‌చార్జ్ కమిషనర్ ఐ.శంకర్‌నాయక్ విధుల్లో ఉన్నట్లే కనిపిస్తోంది. ఈ బోర్డు కమిషనర్ రూములోనే ఉంది. దీనిని అటు కమిషనర్ గాని, ఇటు సిబ్బంది గాని బోర్డు సరిచేయక పోవడం గమనార్హం.



బోర్డులో ఉన్న శంకర్‌నాయక్ పేరు



యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

బేస్తవారపేట,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. యూటీఎఫ్ ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభ శనివారం ఘనంగా నిర్వహించి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా ఎస్.మధుసుదన్‌రెడ్డి, అధ్యక్షులుగా ఎస్.లక్ష్మీరెడ్డి, సహాధ్యక్షులుగా పీవీ.రాజశేఖర్, బీఈ.సుభద్రాదేవి, ప్రధాన కార్యదర్శిగా డి.ఖాశింవలి, కోశాధికారిగా జి.శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు వీరారెడ్డి, వీరాంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణరెడ్డి, అబ్దుల్ హై, రమణారెడ్డి, రామిరెడ్డి తదితులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించడంపై అవగాహన

కంభం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలంటే వాటి నుంచి తప్పించుకోవద్దని, తట్టుకోవాలని ప్రముఖ మానసిక తత్వవేత్త ఎం.రాధాకృష్ణరావు తెలిపారు. కంభంలోని వాసవీ డిగ్రీ, జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం ప్రేరణపై విద్యార్థులకు మోటివేషన్ క్లాసు నిర్వహించారు. పాలమూరు విశ్వవిద్యాలయం తత్వవేత్త, హైదరాబాద్ ముఖ్యమంత్రి బూరుగల రామకృష్ణారావు మనువడు అయిన రాధాకృష్ణారావు శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షలంటే పండుగని, బద్ధకం, సోమరితనం, అశ్రద్ధలను వదిలి పట్టుదలతో, శ్రద్ధతో చదివితే విజయాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోళ్ల సుబ్బరత్నం, ప్రిన్సిపాల్ కె.రాము, వెంకటరెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



వసతిగృహాల్లో న్యాయాధికారి తనిఖీ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల, బీసీ బాలుర పాఠశాల వసతిగృహా లను, బీసీ బాలుర కళాశాలల వసతి గృహాలను, మానసిక దివ్యాంగుల హాస్టళ్లను శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎ.ఓంకార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీసీ బాలికల హాస్టల్‌లోనికి వర్షం నీరు రావడంపై ఆయన అధికారులను నిలదీశారు. బాలుర వసతిగృహంలో మురికినీరు బయటకు పోయేందుకు సరైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బాత్‌రూమ్‌ల నిర్వహణ పట్ల, మురికినీరు నిలువ ఉండడంపై జడ్జి సంబంధిత అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు దోమలతో ఇబ్బందులు ఏర్పడకుండా, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు మంచి ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, వెలుతురు, గాలి వచ్చే విధంగా చూడాలన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయాధికారి ఓంకార్

డిసెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్

గిద్దలూరు టౌన్ : డిసెంబరు 14వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ అన్నారు. శనివారం కోర్టు భవనాల పరిధిలో న్యాయవాదులు, పోలీసు, రెవిన్యూ, మున్సిపల్, బ్యాంక్, టెలిఫోన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్జి ఓంకార్ మాట్లాడుతూ డిసెంబరు 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



వైద్యమిత్రల సమస్యలు పరిష్కరించరూ!

పెద్ద దోర్నాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యమిత్రల సమస్యలు పరిష్కరించాలని దోర్నాల వైద్యమిత్రలు ఎం.చంద్రశేఖర్, ఎస్.సాంబయ్య ప్రభుత్వాన్ని కోరుతూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవలో 18 ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నామని ప్రభుత్వాలు ఇప్పటి వరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. రూ.13,000లతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్రంలో మూడు వేల మంది పరిస్థితి ఇలాగే ఉందని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమానవేతనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

పురుగుమందుల దుకాణాల్లో తనిఖీ


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో విజయభాస్కర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 26 : పట్టణంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో శనివారం ఏవో విజయభాస్కర్‌రెడ్డి తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్‌బుక్స్, ఇన్‌వాయిస్, లైసెన్సులు, ఆయా దుకాణాల గోడౌన్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ దుకాణ యజ మానులు స్టాక్ బోర్డులోకి ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. కొత్త స్టాక్ వచ్చినపుడు మండల వ్యవసాయాధికారికి తప్పనిసరిగా తెలుపాల న్నారు. ఎక్కడైనా బిల్లులు, ప్రిన్సిపల్ సర్టిఫికేట్లు లేకుండా అమ్మకాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువ ధరలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.





తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దర్శి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పంటల తెగుళ్ల నివారణకు సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జేడీఏ ఎస్. శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో అవగాహన, సదస్సు, శిక్షణతరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వలన పంటలకు తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తున్నాయని ఆరంభంలోనే నివారించేందుకు సత్వరమే సస్యరక్షణ చేపట్టే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి వినియోగంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన అధికారి డాక్టర్ వరప్రసాదరావు, ప్రధాన శాస్త్రవేత్త సంధ్యారాణి, ఏడీఏ బాలాజీ నాయక్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

- సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం
- బాధ్యతారాహిత్యంగా పనిచేస్తే వేటు
- రూ.7 లక్షలు రికవరీ చేయాలని ఆదేశం

ఉపాధి పనుల్లో అవినీతి

పామూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పామూరు మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతి కన్నా సిబ్బంది బాధ్యతారాహిత్యం అధికంగా ఉందని, పని తీరు మార్చుకోకపోతే వేటు తప్పదని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ హెచ్చరించారు. పామూరు మండలంలో 2023- 2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 603 పనులకు గాను ఖర్చు చేసిన రూ. 12,11,76,918లపై స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఉపాధి పథకం కింద చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగాయని గుర్తించారు. సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు పంచాయతీల్లో ఆవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు లేవని, కేవలం గుంతలు మాత్రమే ఉన్నాయని డీఆర్పీలు తెలిపారు. మొక్కల మీద పెట్టిన నిధులు వృథా అయినట్లు అధికారులు గుర్తించి సిబ్బందిని నిలదీశారు. కోడిగుంపల, చింతలపాలెం, లక్ష్మీనరసాపురం పంచాయతీల్లో పని ప్రదేశంలో నాటిన మొక్కలు లేక పోవడంతో సంబంధిత టీఏ, ఎఫ్ఏలకు జరిమానా విధించారు. రోజ్‌గార్ నివాస్ కార్యక్రమాలు చేపట్టడం లేదని, జాబ్‌కార్డు మంజూరుకు రూ. 500లు, వారానికి రూ.100 లు కూలీల నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో మానవత్వంతో పనిచేయాలని సూచించారు. వగ్గంపల్లిలో హార్టీకల్చర్ కింద పండ్ల తోటలను సాగు చేసిన రైతులకు బ్యాంకు ఖాతాలు తెరవకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గ్రామానికి వెళ్లి రైతులతో సమావేశం పెట్టి బ్యాంకు ఖాతాలను తెరిపించి తనకు ఫొటోలు పెట్టాలని హెచ్చరించారు. పంట కుంటల పనుల్లో, కొలతల్లో భారీగా వ్యత్యాసం ఉందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనుల్లో విచారిస్తామని పీడీ తెలిపారు. సక్రమంగా పనులు చేయకపోతే మానుకోవాలని సూచిస్తూ ఉపాధి పనుల అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో రూ.3.37 లక్షలు, పీఆర్ పనుల్లో జరిగిన అవినీతి పై రూ. 3.50 లక్షలు సంబంధిత వ్యక్తుల నుంచి వారం రోజుల్లో రికవరీ చేపట్టాలని ఆదేశించారు. మరోమారు ఉపాధి పనుల్లో అవినీతికి ఆస్కారం ఇస్తే ఉపేక్షించేదిలేదన్నారు. డీవీవో ఝాన్సీరాణి, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో బి. సురేష్, ఏపీవో బి. మాల్యాద్రి, ఎస్ఆర్‌పీ వెంకటేశ్వరరావు, డీఆర్‌పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ

కార్యకర్తల క్షేమం కోరేది టీడీపీ ఒక్కటే

- సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో కార్యకర్తల క్షేమం కోరే పార్టీ టీడీపీ ఒక్కటే అని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో శనివారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. గతంలో పార్టీ సభ్యత్వంలో కనిగిరికి రాష్ట్రంలోనే గుర్తింపు లభించిందని, ప్రస్తుతం చేపట్టే సభ్యత్వ నమోదులో కూడా కనిగిరి ముందుండాలని కోరారు. సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన వారికి కుటుంబ సంక్షేమం కోసం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక వసతులు కూడా కల్పించారన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వాన్ని పొడిగించుకోవటంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి చురుకుగా తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు, వాట్సాప్, టెలిగ్రామ్, వెబ్‌లింక్ ద్వారా చేసుకునే విధానం ఉందన్నారు. తాను రూ.1లక్షతో శాశ్వత సభ్యత నమోదు చేసుకున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, చిరంజీవి, మండలపార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, జిల్లా రైతు అధికార ప్రతినిధి రాచమల్ల శ్రీనివాసులు రెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, సానికొమ్ముతిరుపతిరెడ్డి, ఫిరోజ్ తమ్మినేని శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రూ.1లక్షతో శాశ్వత సభ్యత్వం చేసుకున్న జిల్లా రైతు అధికార ప్రతినిధి రాచమల్ల శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.


విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

పశు గణనకు ప్రజలు సహకరించాలి

పామూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశుగణన ఇంటింటి సర్వేకు మండల ప్రజలు పూర్తి సహకారం అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో 21వ జాతీయ పశుగణన ఆన్‌లైన్ సర్వేకు సం బంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ఈమని శ్రీసాయి మాట్లాడుతూ మండలంలో 7 బృందాలు ఇంటింటా తిరిగి పశుగణన చేపడతారని తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు సర్వే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఉప్పలపాటి హరిబాబు,జి. శ్రీనివాసులు, చావా సుబ్బారావు, దేవరపు మాల్యాద్రి, పత్తు మస్తాన్, కోటపాటి రాంమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమించే కార్యకర్తలు టీడీపీకే సొంతం

సభ్యత నమోదులో ఇన్‌చార్జి లక్ష్మి

దర్శి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీని ప్రాణంగా భావించి పనిచేసే కార్యకర్తలు తెలుగుదేశం పార్టీకే సొంతమని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. దర్శిలోని ఆమె నివాసం వద్ద శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా అత్యధిక కార్యకర్తల బలం ఉన్న ఏకైక పార్టీ టీడీపీ మాత్రమే అన్నారు. గత ఎన్నికల్లో కార్యకర్తలు ప్రాణాలొడ్డి కూటమి విజయానికి కృషి చేశారని కొనియాడారు. వారి కష్టాన్ని పార్టీ మరచిపోదని, అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలను గుర్తించి గౌరవించటం జరుగుతుందని అన్నారు. ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. దర్శి నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతంగా పూర్తి చేయాని విజ్ఞప్తి చేశారు. గతంలో కంటే రెట్టింపు సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి. సంక్షేమ పథకాలు శరవేగంతో అమలు జరుగుతున్నాయన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా తొలుత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి లక్ష రూపాయల సభ్యత్వం తీసుకున్నారు. ఆ స్ఫూర్తితో దర్శి నగర పంచాయతీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కలవకొలను చంద్రశేఖర్, దర్శి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు లక్ష రూపాయల సభ్యత్వాలు తీసుకున్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా సభ్యత్వాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మెన్ పిచ్చయ్య, తాళ్ళూరు, ముండ్లమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఒబుల్‌రెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, తెలుగు మహిళ నాయకురాళ్లు ఎం. శోభారాణి, ఎం. నాగమణి, టీడీపీ దర్శి పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, టీడీపీ నాయకులు సంగా తిరుపతిరావు, జూపల్లి కోటేశ్వరరావు, గుర్రం బాలకృష్ణ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండలో..

దొనకొండ : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం భూమనపల్లి గ్రామంలో ప్రారంభించారు. గ్రామంలో మండల టీడీపీ నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి, విప్పర్ల శేషు ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదును చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విప్పర్ల వెంకటరామయ్య, వెంకటేశ్వర్లు, పవన్, గురుకృష్ణ, మంత్రి రవణయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

తాళ్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :రీసర్వేలో తలెత్తిన భూసమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.నాగలక్ష్మి తెలిపారు.దోసకాయలపాడు గ్రామంలో రీసర్వే గ్రామసభ శనివారం జరిగింది.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో రీసర్వేలో జరిగిన తప్పులను దిద్దుబాటు చేసేందుకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీసర్వేలో తప్పులు దొర్లిన రైతాంగం తగు వివరాలతో దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని, తమపరిధిలో సాధ్యం కాని విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని వివరించారు. సభలో రైతుల నుంచి 65 దరఖాస్తులు అందాయి. సర్పంచ్ శివలక్ష్మి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, వీఆర్‌వో శివారెడ్డి, గ్రామ టీడీపీ నేత నల్లపాటి సత్యం, రైతులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

వృద్ధురాలి హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

పామూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండలం డీజీపేట గ్రామంలో గత ఆదివారం జరిగిన రత్తమ్మ అనే వృద్ధురాలి హత్యకేసును చాలెంజ్‌గా తీసుకొని అన్నికోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం. భీమానాయక్ తెలిపారు. డేగా రత్తమ్మను హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు వస్తువులు దోచుకొని వెళ్లిన కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇప్పటికే పలువురు అనుమానితులను గుర్తించి వారిపై నిఘా పెట్టామన్నారు. త్వరలో కేసును ఛేదిస్తామన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

వెలిగండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెలిగండ్ల ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామని తెలిపారు. వెలిగండ్ల బీసీ కాలనీకి చెందిన మాగుటూరి శ్రీను అనే వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద 35 మద్యం సీసాలలు పట్టుబడినట్టు చెప్పారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.



- గుంటూరు జేసీ పర్సన్ ఇన్‌చార్జిగా నియామకం
- మిర్చియార్డు, జీడీసీసీబీ, జీడీసీఎంఎస్ పదవుల భర్తీలో జాప్యం
- నియామకాలపై మరికొన్ని నెలలు పట్టే అవకాశం ఉందని సంకేతాలు









ఇంకా ఇన్‌చార్జి పాలనలోనే

బాపట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం జరుగుతున్నది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదో నెల సమీపిస్తున్నా ఇంకా ముఖ్యమైన పదవులు భర్తీ చేయకపోవడంపై టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో కొంత నిరాశ నెలకొన్నది. ఇదే సమయంలో ఆయా పోస్టులకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తుండటంతో భర్తీ చేయడానికి మరికొన్ని నెలల సమయం పట్టే అవకాశం ఉందన్న విషయాన్ని చెప్పకనే చెప్పినట్లు అవుతున్నది. నామినేటెడ్ పదవుల్లో టీడీపీకి 80 శాతం, బీజేపీ, జనసేన కలిపి 20 శాతం పంపిణీ చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. ఆ మేరకు కసరత్తు జరిపి ఒక నిర్ణయానికి వచ్చేసరికి కొత్త సంవత్సరం వస్తుందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. నామినేటెడ్ పదవుల్లో అత్యంత ప్రాధాన్యం కలిగినది గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు) ఛైర్మన్ పదవి. ఏటా రూ.2 వేల కోట్ల వరకు టర్నోవర్ కలిగి ఉన్న మిర్చియార్డు ఛైర్మన్‌తో పాటు పాలకవర్గంలో ఇతర పదవులకు కూడా ఎక్కువమంది ఆశిస్తుంటారు. ఇదేరీతిన గుంటూరు జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(జీడీసీసీబీ) ఛైర్మన్ పదవి. ఈ పదవికి నామినేట్ అయితే బ్యాంకు రుణాల రూపంలో ఎంతోమందికి సాయం చేయొచ్చు. అలానే జీడీసీఎంఎస్ ఛైర్మన్ పదవి. రైతులు పండించిన ఉత్పత్తుల కొనుగోళ్ల విషయంలో ఛైర్మన్, పాలకవర్గం సహాయ పడొచ్చు. ఈ ముగ్గురికి జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉంటుంది. అలానే జిల్లా సమీక్ష మండలి సమావేశానికి కూడా హాజరై సమస్యలను ప్రస్తావించొచ్చు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల కోసం శ్రమించిన పలువురు నాయకులు ఆయా పదవులు ఆశిస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి తమ అభ్యర్థిత్వాలను బలపరుస్తూ సిఫార్సు లేఖలు తీసుకుని పార్టీ హైకమాండ్‌కు నివేదిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఈ మూడు కీలక పదవులపై ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. దీంతో పరిపాలన కుంటుపడకుండా ఉండేందుకు గుంటూరు జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే కనీసం మరో మూడు నెలల పాటు అయినా ఆయా పదవుల భర్తీ జరగకపోవచ్చన్న అభిప్రాయం మూడు పార్టీల శ్రేణుల్లో వ్యక్తమౌతున్నది. నామినేటెడ్ ఛైర్మన్‌లు ఉంటే పనులు చేయించుకోవడానికి సులభతరంగా ఉంటుం దని, అదే ఐఏఎస్ అధికారి వద్ద ఆ పరిస్థితి ఉండదన్న అభిప్రాయాన్ని చెబుతున్నారు.



సేవలు.. శూన్యం

వ్యవ.. సాయం లోపించిన మార్కెట్ యార్డులు. రైతుల నుంచి సెస్సు వసూలు చేస్తూ సేవలు విస్మరించిన కమిటీలు. యార్డుల ద్వారా అన్నదాతలకు అందాల్సిన పథకాలన్నీ రద్దు.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుల పరిస్థితి. రైతుల కోసం ఏర్పడిన.. రైతుల సేవలో నిమగ్నమవ్వాల్సిన వ్యవసాయ మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా మిగిలాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగానే మిగిలాయి. గతంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతూ వస్తున్న రైతుబంధు పథకం రద్దైంది. రైతులకు లబ్ధి చేకూర్చే ఈ-మార్కెటింగ్ విధానాన్ని ఆపేశారు. పొలాలకు లింకురోడ్ల నిర్మాణాలు, ఉచిత పశు వైద్య శిబిరాలు, గోదాముల నిర్మాణాలు శూన్యంగా మారాయి.

- అలంకారప్రాయంగా మార్కెట్ యార్డులు
- సెస్సు వసూళ్లపై శ్రద్ధ.. విస్మరించిన సంక్షేమం
- కమిటీల ఖాతాలకు ఏటా రూ.కోట్లలో ఆదాయం
- యార్డుల ద్వారా అన్నదాతలకు అందాల్సిన పథకాలన్నీ రద్దు
- కూటమి ప్రభుత్వంలో యార్డుల పాలకవర్గాల నియామకాల్లో జాప్యం
- మళ్లీ మార్కెట్ యార్డులకు పూర్వవైభవం రావాలని కోరుతున్న రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులు మోసపోకుండా.. ఉత్పత్తుల విక్రయాల్లో నష్టపోకుండా.. అన్నదాతలకు అండగా.. రైతుల కోసం ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ యార్డులు అలంకారప్రాయంగా మారాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 24 వ్యవసాయ మార్కెట్ యార్డుల పరిధిలో లక్షల మంది రైతులున్నారు. అయితే ఒక్క యార్డు పరిధిలో.. ఒక్క రైతుకు కూడా ఐదేళ్లగా ఒక్క ప్రయోజనం కూడా అందలే దు. మార్కెట్ యార్డులు అన్నదాతలకు సేవలు అందించడంలేదు. వ్యయసాయ దిగుబడులపై ఒక శాతం సెస్సు(పన్ను)ను ముక్కుపిండి వసూలు చేసే మార్కెట్‌కమిటీలు వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం కమిటీల ఖాతాల్లో చేరుతున్నా ఆ నిధులను వారికోసం ఖర్చు చేయడంలేదు. అన్నదాతలకు మార్కెట్‌యార్డుల ద్వారా అందించాల్సిన పథకాలను కూడా ఎత్తేశారు. మార్కెట్ యార్డుల కమిటీల నుంచి రైతులకు ఏ ఒక్క ప్రయోజనం కూడా కలగడం లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వ్యవస్థలు నాశనమైనట్లే మార్కెట్‌యార్డుల పరిస్థితి కూడా మారిందని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్ యార్డుల ద్వారా రైతులకు అప్పటికే అందే సేవలను కొనసాగిస్తూ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేవన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా సేవలు మాట దేవుడెరుగు అప్పటి వరకు కొనసాగిన పథకాలు, కార్యక్రమాలను కూడా రద్దుచేసిందని రైతులు మండిప డుతున్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశాల్లో తీర్మానాలు చేయడమే తప్ప పనులు మాత్రం జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదో నెల సమీపిస్తోంది. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డుల పాలక వర్గాలు భర్తీకి నోచుకోక కమిటీలు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక యార్డు కమిటీలను రద్దు చేశారే కానీ కొత్త కమిటీల నియమాకం చేపట్టలేదు.

● దోపిడీకి గురవుతున్న రైతులు


రైతులకు విస్తృతమైన సేవలు అందించేందుకు ఏర్పాటైన మార్కెట్ యార్డు లు వారి ప్రయోజనాలను విస్తరిస్తున్నాయన్న విమర్శలు న్నాయి. మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ప్రతి రోజు యార్డులు ప్రకటించాల్సి ఉంది. ముఖ్యంగా కూరగాయల ధరలు మార్కెట్లలో కూడా ప్రకటించాలి. రైతుకు ఇవ్వాల్సిన ధర అమలు అయ్యేలా యార్డులు కృషి చేయాల్సి ఉంది. కనీసం ధరల పట్టికను కూడా యార్డులు నిర్వహించడలేదని రైతులు వాపోతున్నారు. దీని వలన తాము దోపిడీకి గురౌతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టేనా

కూటమి ప్రభుత్వంలో యార్డులకు మహర్దశ పడుతుందని, తమకు సేవలు అందుతాయని అన్నదాతలు ఆశిస్తున్నారు. రైతు బంధు.. పశువైద్య శిబిరాలు.. పొలాలకు లింకు రోడ్లు.. గోదాములు.. శీతల గిడ్డంగులు నిర్మాణాలు.. మళ్లీ ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్ యార్డులకు పాలకవర్గాలను వెంటనే నియమించి పాలనను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కృషి చేయాలని రైతులు కోరుకుంటున్నారు.



● అటకెక్కిన రైతుబంధు



ఐదేళ్లుగా అన్నదాతలకు రైతు బంధు పథకం అక్కరకు రాలేదు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేని పక్షంలో వాటిని యార్డుల్లో కుదవ పెట్టుకుని రుణాలు ఇవ్వాలి. పంట విలువలో 80 శాతం వరకు రుణంగా ఇచ్చే అవకాశం ఉంది. ధర వచ్చాక ఆయా ఉత్పత్తులను విక్రయించి రుణాలను తిరిగి తీర్చుకునే వెసులుబాటును కమిటీలు కల్పించాలి. అయితే ఈ పథకం ఐదేళ్ల వైసీపీ పాలనలో అమలు కాలేదు. దీంతో వ్యవసాయ ఉత్పత్తులను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని దోపిడీకి గురవుతున్నారు.

● అనుబంధ రహదారులేవి



వ్యవసాయ ఉత్పత్తులను కల్లాలకు, ఇళ్లకు తరలించుకునేందుకు వీలుగా పొలాలకు లింకు రహదారులను మార్కెట్ యార్డులే నిర్మించాలి. గతంలో ఒక్కో కమిటీ పరిధిలో 30 శాతం నిధులు ఇందుకు కేటాయించేవి. ఒక్కో యార్డు పరిధిలోని ప్రాధాన్యం మేరకు ఏడాదికి 10నుంచి 15 రహదారులు వేసేవారు. రైతుల అభిప్రాయాలు తీసుకుని అవసరమైన మేరకు ప్రాధాన్యం ఇచ్చేవారు. గత ఐదేళ్లలో ఒక్క రహదారి నిర్మాణం కూడా జరగలేదు. అసలు రైతుల కోసం ప్రతిపాదనలు కూడా లేవు.

● వైద్య శిబిరాలు ఎత్తేశారు



రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉండే పాడి సంపద అభివృద్ధికి గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్ కమిటీలు పెద్ద పీట వేసేవి. యార్డుల పరిధిలో ఏడాదికి నాలుగు పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసే వారు. వ్యాధులతో బాధపడుతున్న పశువులకు ఒకే చోటకు చేర్చి సంపూర్ణ వైద్యం అందించి ఉచితంగా మందులను కూడా ఇచ్చేవారు. ఒక్కో శిబిరానికి రూ.10 నుంచి రూ.20 వేలు వరకు ఖర్చు చేసేవారు. అయితే ఐదేళ్లుగా పశు వైద్య శిబిరాల నిర్వహణ లేదు. అయితే ఆయా నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. పాడి పశువులకు చికిత్స కోసం రైతులు సొంతంతగా ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది.

● గోదాముల నిర్మాణాలు నై..



మార్కెట్ కమిటీల నిధులతో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గోదాములు, శీతల గిడ్డంగులు నిర్మించాలి. ఐదేళ్లలో ఒక్కటి కూడా నిర్మించలేదు. దీని వల్ల మార్కెట్ కమిటీలకు ఆదాయం పోతోంది. మరోవైపు రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ప్రైవేటు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని రుసుములు చెల్లించుకుంటున్నారు. దీని వల్ల పంట అమ్మిన మొత్తాల్లో సగం వరకు నిల్వకే ఖర్చవుతోంది. రైతులు దళారుల వలలో పడకుండా ఈ-మార్కెటింగ్ విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆన్‌లైన్‌లో కొనుగోళ్ల జరపాలని నిర్ణయం తీసుకుంది. ఈ విధానం కూడా పక్కాగా అమలు కావడంలేదు. ప్రతి మార్కెటింగ్ కమిటీ కొనుగోలు కేంద్రంగా మారాలని ప్రతిపాదించారు. అయితే ఆ ప్రకారం ఎక్కడా ఉత్పత్తుల కొనుగోళ్ల జరగలేదు.

- రౌడీషీటర్ కోసం కానిస్టేబుల్ బరితెగింపు
- చనిపోయిన వైసీపీ నేత డెత్ సర్టిఫికెట్ రౌడీషీటర్‌కు కేటాయింపు
- ఎస్ఐ సంతకం ఫోర్జరీ చేసి కోర్టుకు పత్రాల సమర్పించిన వైనం
- పోలీసు శాఖ, న్యాయ వ్యవస్థను తప్పుదారి పట్టించినా చర్యలపై మీనమేషాలు



బతికుండగానే చంపేశాడు



గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కరుడుగట్టిన రౌడీషీటర్‌ను పోలీసులే చంపేశారు. చంపడం అంటే ఇక్కడ ప్రాణం తీయడం కాదు.. ప్రాణం పోయడం. రౌడీషీటర్‌పై కోర్టులో ఉన్న కేసులను తీయించడం కోసం ఏకంగా కోర్టు కానిస్టేబుల్ బరితెగించాడు. పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపుతున్న ఈ ఘటనకు సంబంధించి ఆలస్యంగా వెలుగు చూసిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన పాదర్తి రమేష్, మధు సోదరులు. గతంలో వీరు రౌడీషీటర్ నల్లపాటి శివయ్యకు ప్రధాన అనుచరులుగా ఉండేవారు. కారసాని హత్యానంతరం శివయ్యకు పాదర్తి సోదరులకు మధ్య మనస్పర్థలు వచ్చాయి. నరసరావుపేట పరిధిలోని చిన్నకాకాని వద్ద పాదర్తి మదును, మరొకరిని నల్లపాటి శివయ్య, ఆయన అనుచరులు హత్య చేశారు. శివయ్య అనుచరులకు పాదర్తి రమేష్‌కు మధ్య ఆధిపత్యపోరు సాగింది. ఈ నేపథ్యంలో శివయ్య అనుచరులను చంపిన కేసులో రమేష్ నిందితుడిగా ఉన్నాడు. పాదర్తి రమేష్‌పై రెండు హత్యలు, అనేక హత్యాయత్నాలు, పలు దాడులు,

(మిగతా 6వ పేజీలో..)

యువజన చాంపియన్.. హిందూ కళాశాల





ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ కళాశాలల యువజనోత్సవాలు శనివారంతో ముగిశాయి. యువజనోత్సవాల ఓవరాల్ చాంపియన్‌గా గుంటూరులోని హిందూ కళాశాల, రన్నరప్‌గా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల సొంతం చేసుకున్నాయి. విజేతలకు సినీహీరో సోహైల్, బిగ్‌బాస్ ఫేమ్ శ్రీసత్యలు బహుమతులు అందజేసి విద్యార్థులతో సందడి చేశారు.



వర్సిటీలో ముగిసిన ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ పర్యటన

పెదకాకాని(ఏఎన్‌యూ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎన్ఐ ఆర్ఎఫ్ ఎక్స్పర్ట్ కమిటీ పర్యటన శనివారంతో ముగిసింది. ఐక్యూఏసీ, లైబ్రరీ, హెర్బల్ గార్డెన్, బొటానికల్ గార్డెన్, ఇంక్యుబేషన్ సెంటర్, వెజిటబుల్ గార్డెన్లను కమిటీ సభ్యులు సందర్శించారు. ఐక్యూఏసీ, నాక్ ఎన్ఐ ఆర్ఎఫ్ ర్యాంకులు పొందేందుకు ఇచ్చిన నివేదికలను పరిశీలించారు. అధ్యాపకులు పరిశోధకులతో ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనల వైపు అడుగులు వేయాలని సూచించారు. ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణసత్య తదితరులు కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు.

పాఠశాలలకు పూర్వవైభవం

- జీవో నం.117 రద్దు నిర్ణయంపై ఉపాధ్యాయుల హర్షం
- ప్రపంచ బ్యాంక్ నిధుల కోసమే జీవో అంటూ ఆరోపణ
- అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 80వేల మంది ప్రైవేటు బాట

గుంటూరు(విద్య), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో సంస్కరణల పేరుతో నాటి వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో న.117తో ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక విద్య కళను కోల్పోయింది. రెండేళ్ల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 80 వేల మంది విద్యార్థులు ప్రాథమిక పాఠశాల నుంచి ప్రైవేటు బాట పట్టారు. తాజా ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ జీవోను వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు

(మిగతా 6వ పేజీలో..)



ఆపదలో ఉన్న కార్యకర్తలకు టీడీపీ అండ

- విద్యుత్ మంత్రి రవికుమార్
- పార్టీ సభ్యత్వాల నమోదు ప్రారంభం

అద్దంకి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : ఆపద లో ఉన్న కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచే పార్టీ తెలుగుదేశం పార్టీ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద మంత్రి గెస్ట్‌హౌస్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ముందుగా మంత్రి రవికుమార్ రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, అనుబంధ సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ శ్రేణులకు సభ్యత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 100 రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. నియోజకవర్గంలో గతంలో కంటే ఎక్కువ సభ్యత్వ నమోదు జరిగేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కూడా త్వరలో అమలు చేస్తామన్నారు. గ్రామాలలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యానికి ప్రాధాన్యత కల్పించి ప్రజల వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అద్దంకి పట్టణ, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు, కఠారి నాగేశ్వరరావు, రావూరి రమేష్, ఇ బ్రాయిల్, గాడిపర్తి వెంకటరావు, నేతలు ఆట్లా చినవెంకటరెడ్డి, కరి పరమేష్, ఏసోబు, సన్నెబోయిన ఏడుకొండలు,కరి సుబ్బారావు, కుందారపు రామారావు, కాకాని అశోక్, గుర్రం శేఖర్ పాల్గొన్నారు.


టీడీపీ సభ్యత్వ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

మార్టూరు : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం పార్టీ కార్యాలయంలో నాయకులు ప్రారంభించారు. ముందుకు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, తాటి నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, తేలప్రోలు సాంబశివరావు, గొట్టిపాటి వెంకట్రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలో పార్టీ అధ్యక్షుడు నల్లపనేని రంగయ్యచౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో తారకరామారావు, వంశీ, సతీష్ పాల్గొన్నారు.

చినగంజాం : టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదులో చినగంజాం మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో చినగంజాం, నీలాయపాలెం సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, తూమాటి శ్రీనివాసరావు,


సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

నాయకులు సయ్యద్ అబ్దుల్ కలాం అజాద్, చెరుకూరి రాఘవయ్య, సందు శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పార్టీ సభ్యత్వ నమోదులో అందరూ భాగస్వాములు కావాలని మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కరి శ్రీనివాసరావు, రఫీ, శ్రీనివాసరావు, రమేష్, మార్క్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


ఈపురుపాలెంలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సభ్యత్వ నమోదుతో భరోసా : ఎమ్మెల్యే ఏలూరి

రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం స్వీకరణ

పర్చూరు : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు ఆర్థిక భరోసా చేకూరుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా పార్టీ నిలుస్తుందని, రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న కార్యకర్తకు రూ.5లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా సభ్యత్వ నమోదు తీసుకోవాని ఆయన కోరారు. పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ప్రారంభించారు.

రూ.లక్ష చెల్లించి పొందిన సీనియర్ నేత ఏడుకొండలు

పంగులూరు : టీడీపీ సీనియర్ నాయకుడు ముప్పవరం గ్రామానికి చెందిన కుక్కపల్లి ఏడుకొండలు పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అతిథి గృహంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గస్థాయిలో శనివారం ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని పొందారు. రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం విధేయతతో పనిస్తున్న ఏడుకొండలు శాశ్వత సభ్యాన్ని పొందడంపట్ల మంత్రి రవికుమార్‌తోపాటు పలువురు నాయకులు అభినందించారు.

అగ్రస్థానంలో నిలుపుదాం : ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : టీడీపీ సభ్యత్వ నమోదులో చీరాలను అగ్రస్థానంలో నిలుపుదామని, అందుకు పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పని చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఆయా సందర్భాల్లో కొండయ్య మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. బాధ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, ఆయా ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు, బాధ్యులు పాల్గొన్నారు.


గన్నవరం రోడ్డులో పడిపోయిన గ్రానైట్ బండ

రోడ్డుపై గ్రానైట్ బండ

- ప్రయాణికులకు ఇబ్బందులు

మార్టూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు నుంచి గన్నవరం వెళ్లే రోడ్డులో నాలుగు రోజుల కిందట రోడ్డుపై పెద్ద గ్రానైట్ ముడిరాతిబండ పడిపోయింది. గ్రానైట్ క్వారీ నుంచి బొబ్బేపల్లి దండుదారి వద్ద గ్రానైట్ పరిశ్రమలకు ట్రాలీ లారీపై నుంచి తీసుకువెళుతున్న సమయంలో రోడ్డుపై గుంతలు కారణంగా వాహనదారుడు రోడ్డుపైనే రాతిబండను పడవేశారు. అసలే రోడ్లపై ఉన్న గుంతలు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు రోడుపై ఉన్న రాతి బండను తొలగించేదెవరు, గుంతలను పూడ్చేదెవరని ప్రయాణికులు అంటున్నారు.

పారిశుధ్యంపై అవగాహన పెరగాలి

అద్దంకి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యంపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలని కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణంలోని 5వ వార్డులోని రాజీవ్‌కాలనీలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ అద్దంకిలో భాగంగా అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటి చెత్త సేకరణ, తడి, పొడి చెత్త వేరు చేసి అందించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ కార్యదర్శులు, పబ్లిక్ హెల్త్ వర్కర్లు, అసిస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

- నల్ల బ్యాడ్జీలతో విధుల్లోకి హాజరైన వైద్య మిత్రలు


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యమిత్రలు

చీరాలటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని డా.ఎన్‌టీఆర్ వైద్య మిత్రలు కోరారు. శనివారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు రాజు, మురళి, అనిల్‌కుమార్, ఫణి, ప్రభాకరరావు, రాజశేఖర్, రిబ్కా, బోయాజ్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ బదిలీ తప్పనిసరి


ఏపీఎం, సీసీలను సన్మానిస్తున్న ఏపీఎం, స్త్రీనిధి మేనేజర్

చినగంజాం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగికీ బదిలీ తప్పనిసరి అని, ఎక్కడకు వెళ్లిన అంకితభావంతో పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని డీఎంజీ శ్రీనివాసరావు, స్త్రీ నిధి మేనేజర్ కరుణాకర్ అన్నారు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం గద్దె సుబ్బారావు అధ్యక్షతన శనివారం జరిగిన సన్మాన సభలో వారు మాట్లాడారు. చినగంజాంలో పనిచేస్తూ బదిలీపై వేటపాలెం వెళ్లిన ఏపీఎం కాటి అంజిబాబు, సీసీ కే చిన్నారావు, చీరాల వెళ్లిన సీసీ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ 2011 నుంచి సామాజిక పెట్టుబడి నిధి ద్వారా తీసుకున్న రూ.60లక్షల రుణం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. తాను ఇచ్చిన 20రోజులలో పెండింగ్ రుణానికి సంబంధించి రూ.10లక్షలను రికవరీ చేసినట్లు తెలిపారు. దీనిలో గ్రూపు సభ్యులు, యానిమేటర్లు, వెలుగు సిబ్బంది 20 మంది ఉన్నట్లు తెలిపారు. 20 మంది నుంచి త్వరలో రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీసీలు వెంకటస్వామి, మాధవి, శ్రీలక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

పర్చూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శనగలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మోహనరావు సూచించారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో శనివారం సబ్‌డివిజన్ పరిధిలోని ఆయా మండలాల వ్యవసాయాధికారులకు ప్రభుత్వ సబ్సిడీలు, యాజమాన్య పద్ధతులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సబ్సిడీపై ఖరీఫ్ సాగుకోసం శనగ విత్తనాల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మేరిమ్మ, ఇంకొల్లు వేణుగోపాల్, కారంచేడు సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ కంఠం సమస్యపై కదిలిన యంత్రాంగం

తహసీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో విచారణ

పర్చూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ప్రైవేటు భూములు, స్థలాలను తమ సొంత స్థలాలుగా నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్‌లు అవ్వక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈసమస్యను బాధితులు శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఏలూరి తక్షణమే చర్యలు తీసుకొని బాధిత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో పర్చూరు తహసీల్దార్ పి.బ్రహ్మయ్య శనివారం రెవెన్యూ సిబ్బంది నేతృత్వంలో సంబధిత భూములను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరులోని గ్రామకంఠం సర్వే నెంబర్ 439లో శ్రీవేణుగోపాలస్వామి గుడికి సంబధించి 47 సెంట్ల భూముకి గాను అదే సర్వే నంబర్‌లో ఎకరం విస్తీర్ణంలో ప్రైవేటు ఇంటి నిర్మాణాలు దేవదాయశాఖ ఆస్తులుగా నమోదు అయ్యాయి. దీంతో ఆలయంతోపాటు, ప్రైవేటు వ్యక్తుల నివాశాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఆల్తాఫ్, ఇన్‌చార్జి ఆర్ఐ ప్రమ్‌కుమార్, వీఆర్వో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


పర్చూరులోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

సీపీఎం మహాసభను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం అద్దంకి ప్రాంతీయ కమిటీ 12వ మహాసభ నవంబర్ 10వ తేదీన జరుగుతుందని అందరు పాల్గొన్ని మహాసభను జయప్రదం చేయాలని కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు డి. గంగాధర్, కె.రఘుచంద్, విజయకుమార్ పాల్గొన్నారు.

విచారణ వేగవంతం చేయండి

- పారదర్శకంగా నిజాలు నిగ్గుతేల్చండి
- డీఎస్పీ జగదీష్‌నాయక్, సీఐ శేషగిరిరావుతో ఎమ్మెల్యే కొండయ్య


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

కొత్తపేట (చీరాల), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు అలియాస్ బాతుల శ్రీను మృతికి సంబంధించిన విచారణ వేగవంతం చేసి, నిజాలను నిగ్గుతేల్చాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పోలీస్ అధికారులకు చెప్పారు. కొత్తపేట టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్య శనివారం డీఎస్పీ జగదీష్‌నాయక్, రూరల్ సీఐ శేషగిరిరావు, ఈపురుపాలెం ఎస్ఐ శివకుమార్‌తో శ్రీనివాసరావు మృతికి సంబంధించి కేసు పురోగతిపై సమీక్షించారు. ప్రాథమికంగా పోలీస్ దర్యాప్తులో డాగ్ స్క్వాడ్, పోస్టుమార్టం రిపోర్ట్ కీలకం. అలానే సెల్‌ఫోన్ కాల్ డేటా కూడా కీలకమే. ఈ క్రమంలో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు, కొనసాగుతున్న తీరుపై ఆరా తీసినట్లు తెలిసింది. కేసుకు సంబంధించిన విచారణ రెండుమూడు రోజుల్లో ఒక కొలిక్కి వ స్తుందని, రావల్సిన రిపోర్టులు వస్తాయని, వాస్తవ పరిస్థితులను వెల్లడిస్తామని పోలీస్ అధికారులు ఎమ్మెల్యే కొండయ్యకు చెప్పినట్లు సమాచారం.

అవాస్తవాలు వండి వారిస్తే .. మూల్యం చెల్లించుకోవాల్సిందే

ఎమ్మెల్యే కొండయ్య


రాజకీయాలు ఆరోగ్యకరంగా ఉండాలని, ఒకరి మృతి ని కూడా తమకు అనుకూలంగా మార్చుకుందామని అవాస్తవాలు వండి వార్చడం సరికాదని, అలా చేసిన వారు నిజాలు తెలిశాక తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ విచారణ పారదర్శకంగా జరుగుతోందని, కొద్ది రోజుల్లోనే అన్ని కోణాల్లో దర్యాప్తు అనంతరం పోలీసులు వాస్తవాలను వెల్లడిస్తారన్నారు. చీరాలలో రాజకీయ హత్య ఒక్కటీ జరగలేదని, ఘట నలు వివిధ కారణాలు, క్షణికావేశంలో జరిగాయన్నది బహిరంగ రహస్యమన్నారు. శ్రీను మృతిపై వైసీపీ వాళ్లు ఆందోళ చేస్తుంటే ఎమ్మెల్యే అక్కడకు వెళ్లాలా..?. మోకాలికి బోడిగుండుకు ముడిపెట్టినట్లు మాట్లాడేవారు పద్ధతి మార్చుకోవాలని హితవు చెప్పారు. ఇది మనవి అనుకున్నా .. లేదా హెచ్చరిక అనుకున్నా .. వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వ్యక్తులు, వ్యవస్థల మధ్య రెచ్చగొట్టే చర్యలతో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఉపేక్షించేంది లేదన్నారు. అంతిమంగా తమ సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, పలువురు నాయకలు పాల్గొన్నారు.

తాగునీరు, శానిటేషన్‌పై అప్రమత్తం

గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ

అద్దంకిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాల కారణంగా గ్రామాల్లో అంటువ్యాధులు, డయేరియా ప్రబలే అవకాశం ఉంది. తాగునీరు, శానిటేషన్ విషయంలో అధికారులు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాయపాలెం సచివాయంలో తాగునీటి శాంపిల్ పరీక్షలను ఆయన పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అన్ని గ్రామాల్లో శానిటేషన్ పనులు, మంచినీటిని సరఫరా చేసే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వాటర్ ట్యాంక్‌లు, ఆర్‌వో ప్లాంట్‌లలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి వారి పర్యవేక్షణలో పరీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు. అనంతరం సీసీ రోడ్డు, సైడ్ కాలువల నిర్మాణ పనులను ఎంపీడీవో పరిశీలించారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రీ-సర్వేలో తలెత్తిన భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. కశ్యాపురంలో రీసర్వే సమస్యల పరిష్కారం కోసం శనివారం గ్రామసభ నిర్వహించారు. రీసర్వేలో తలెత్తిన సబ్‌డివిజన్ సమస్యలతోపాటు విస్తీర్ణ వ్యత్యాసాలు, మ్యూటేషన్, ఫొటో, పేరు మార్పు లాంటి సమస్యలు తమ దృష్టికి వస్తున్నట్లు తెలిపారు. గ్రామ రైతుల నుంచి సబ్ డివిజన్ కోరుతూ 4, విస్తీర్ణ వ్యత్యాసాల సవరణ కోరుతూ 3, మ్యూటేషన్ కోసం రెండు దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల వెంకటరావు, మండల సర్వేయర్ బి.సురేష్, గ్రామ సర్వేయర్ రాజా, వీఆర్వో సుమతి, కార్యదర్శి పాల్గొన్నారు.

క్రీడాకారులు విజయాలతో ముందుకు సాగాలి


క్రీడాకారులకు బహుమతిని అందజేస్తున్న బాబూరావు

చీరాలటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో సాధన చేసి క్రీడాకారులు విజయాలతో ముందుకు సాగాలని చీరాల ప్రేమ హార్ట్ హాస్పిటల్స్ అధినేత డా.ఐ.బాబూరావు అన్నారు. ఈనెల 19 -21 తేదీలలో అనంతపురంలో జరిగిన షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలో బాపట్ల జిల్లా మూడవ స్థానాన్ని దక్కించుకుంది. దీంతో క్రీడాకారులు అనిల్, శివ, వినయ్, కార్తీక్, ఆనంద్, రామ్, చైతన్య, అనిల్ కుమార్, రాజశేఖర్, శ్రీరామ్, రామ్‌చరణ్, మురళి, చార్లెస్‌ను బాబూరావు అభినందించారు. తాను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఐదవ విజయం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కోచ్‌లు తుమ్మా శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిరెడ్డిని కొనియాడారు.

కల్వర్టు రోడ్డు బాగు



రోడ్డును బాగు చేస్తున్న ఎక్స్‌కవేటర్

పర్చూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - గుంటూరు అర్‌అండ్‌బీ రోడ్డులో అడుసుమల్లి వద్ద ఏర్పాటు చేసిన కల్వర్ట్ వద్ద అప్రోచ్ రోడ్ అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రయాణికుల అవస్థలపై కల్వర్ట్ నిర్మించారు..అప్రోచర్ రోడ్డు అభివృద్ధి మరిచారు శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై స్పందించారు. అడుమల్లికి చెందిన టీడీపీ నాయకులు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో అప్రోచ్ రోడ్డు మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనదారుల ఇక్కట్లు తొలగాయి. వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు మహిళల అరెస్ట్

అద్దంకి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్ ఎక్కే మహిళ హ్యాండ్ బ్యాగ్‌లోని 3 సవర్ల బంగారం గొలుసు అపహరించిన కేసులో ఇద్దరు మహిళా నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు. ఈపూరుపాలెంకు చెందిన కావటి అలివేలు, సత్తుపాటి సునీత లను శనివారం అద్దంకి లోని రామాటాకీస్ బజారులో అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

బాణసంచా అమ్మకాలకు అనుమతి తప్పనిసరి

వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు



చీరాలటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని దుకాణదారులు బాణసంచా అమ్మకాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని వన్ టౌన్ సీఐ మారీదు శ్రీనివాసరావు సూచించారు. గోడౌన్, తదితర నిల్వలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ప్రమాదాలకు బాధ్యులవుతారని సీఐ హెచ్చరించారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన



మద్యం వ్యాపారికి, మహిళకు మధ్య వాగ్వాదం

వేటపాలెం(చీరాల), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వెలమ వీధిలో నూతనంగా మద్యం దుకాణం ఏర్పాటుకు తమకు బలవంతంగా ఇళ్లు ఖాళీ చేయిస్తున్నారని ఓ మహిళ, ఆమె తరపువారు ఆందోళనదిగారు. ఈ ఘటన వేటపాలెంలో శనివారం జరిగింది. ఆ ప్రాంతంలో రైతు భరోసా కేంద్రం, నిర్మాణంలో ఉన్న హెల్త్ క్లినిక్ భవనాలు ఉండడంతో అక్కడ మద్యం దుకాణం వద్దని చుట్టుపక్కలవారు కూడా అభ్యంతరం చెప్పారు. అయితే ఓ కానిస్టేబుల్ తనను ఇళ్లు ఖాళీ చేయాలని చెప్పారని ఆ మహిళ ఆరోపించింది. ఈ నేపథ్యంలో చీరాలకు చెందిన ఇరువురు మద్యం వ్యాపారులు అక్కడకు చేరారు. అందులో ఓ మద్యం వ్యాపారి ఆ కానిస్టేబుల్‌కు మద్దతుగా మాట్లాడే క్రమంలో వారి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారు తహసీల్దార్, ఆర్డీవోలకు అర్జీలు పెట్టుకుని తమ సమస్యను విన్నవించాలని చెప్పారు. అలా నే ఇంటికి సంబంధించి యజమాని, అద్దెదారులు మాట్లాడుకోవాలని సూచించడంతో సమస్యల సద్దుమణిగింది.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాలటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బార్ షాపులు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, అలాగే వైన్స్ ఉద యం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహణ కొనసాగించాలన్నారు. అలాగే ఈనెల 30 నాటికి కచ్చితమైన స్థానాల్లో అనుమతులు పొందిన 24 దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్ణయించిన ధరలకే విక్రయాలు చేయాలన్నారు.

దాడిపై కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఈపూరుపాలెంకు చెందిన విజయ్ అదే ప్రాంతానికి చెందిన కోటేశ్వర సాయిపై దాడి చేశాడు. దీంతో బాధితుడు ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బతికుండగానే చంపేశారు

5వ పేజీ తరువాయి

బాంబుల కేసులు ఉన్నాయి. గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో పాదర్తి రమేష్‌పై ఏ ప్లస్ కేటగిరి రౌడీషీట్ ఉంది. ఈ కేసులు గుంటూరు కోర్టులో విచారణలో ఉన్నాయి. సోదరుడు మధు హత్య అనంతరం రమేష్ గుంటూరు నుంచి దాచేపల్లి మండలం గామాలపాడుకు మకాం మార్చాడు. దీంతో పోలీసులు రౌడీషీట్‌ను గురజాల డీఎస్పీకి బదిలీ చేశారు. ఆ తర్వాత నుంచి అతడు ఎక్కడ ఉంటున్నది ప్రశ్నార్థకంగా మారింది.

వైసీపీ నేత పాదర్తి మృతిని అనుకూలంగా మార్చుకున్న రౌడీషీటర్

గుంటూరుకు చెందిన వైసీపీ నేత పాదర్తి రమేష్‌గాంధీ గత కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా విజయం సాధించారు. మేయర్ పీఠం రేసులో ఉన్న తరుణంలో ఆయన మృతి చెందారు. దీనిని రౌడీషీటర్ పాదర్తి రమేష్ పట్టాభిపురం కోర్టు కానిస్టేబుల్ రాజుతో తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. పాదర్తి రమేష్‌గాంధీ డెత్ సర్టిఫికెట్‌ను తీసుకువచ్చి రౌడీషీటర్ పాదర్తి రమేష్ చనిపోయినట్లుగా గుంటూరులోని వివిధ కోర్టుల్లో కానిస్టేబుల్ సమర్పించాడు. దీనితో రౌడీషీటర్ పాదర్తి రమేష్‌పై ఉన్న కేసులన్నింటిని కోర్టు రద్దు చేసింది. అప్పటి పట్టాభిపురం ఎస్ఐ విజయ్‌కుమార్ ఆ డెత్ సర్టిఫికెట్‌ను ధ్రువీకరిస్తూ సంతకం చేసినట్లుగా ఎస్ఐ సంతకాన్ని కానిస్టేబుల్ ఫోర్జరీ చేసి కోర్టుకు సమర్పించినట్లు తెలిసింది.

కానిస్టేబుల్‌కు పోలీస్ శాఖ అండదండలు

నేరస్తులకు కోర్టులో శిక్ష పడే విధంగా వ్యవహరించాల్సిన కానిస్టేబుల్ రౌడీషీటర్‌కు అనుకూలంగా చేసిన వ్యవహారం పోలీస్ శాఖలో కలకలం రేపుతుంది. కానిస్టేబుల్ ఇంతగా బరితెగించిన ఘటనపై పోలీస్ అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం కూడా పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. సదరు కానిస్టేబుల్‌ను వేరే స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. పోలీస్ శాఖను, న్యాయ వ్యవస్థను తప్పుదారి పట్టించి తీవ్రమైన నేరాలకు పాల్పడిన కానిస్టేబుల్‌పై పోలీసు ఉన్నతాధికారులు మిన్నకుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వివాహేతర సంబంధం పెట్టుకున్న కానిస్టేబుల్‌పై చర్యలు నిల్

గుంటూరు ఏటిఅగ్రహారం నాలుగో లైన్‌లో ఓ పెయింటర్ భార్యతో నగరంపాలెం కానిస్టేబుల్ కిరణ్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఒకరోజు కానిస్టేబుల్ తన భార్యతో ఉండగా పెయింటర్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో సదరు కానిస్టేబుల్ పెయింటర్‌ను బెదిరించడంతో ఊరు వదిలి పారిపోయారు వారం రోజులు అనంతరం హైదరాబాదులో ఉన్న తన కుటుంబసభ్యుల సహకారంతో పెయింటర్ నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్‌పై కేసు నమోదైనా పోలీసు అధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు.

గృహయోగం

- వచ్చేనెల 1 నుంచి 30 తేదీ వరకు ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల గుర్తింపు

ఒంగోలు నగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబానికి ఓ గూడు సమకూర్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలను మంజూరు చేసేందుకు సిద్ధమైంది. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సొంతిల్లు లేని కుటుంబాల్ని గుర్తించి వారికి పక్కాగృహం మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ప్రతి పేద కుటుంబానికి ఇంటిని మంజూరు చేసేందుకు సిద్ధమైంది. రాష్ట్రప్రభుత్వం ఈ మేరకు నవంబర్ ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టబోతోంది. ప్రతి సచివాలయం పరిధిలో ఈ లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమం నెలరోజుల పాటు జరగనుంది. ఇల్లు లేని పేద కుటుంబాలను గుర్తించి వారికి ఇళ్లను మంజూరుచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన సఖి అనే యాప్ ద్వారా గ్రామాల్లో గుర్తించిన లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయనున్నారు. జిల్లాలో గృహం లేని పేద కుటుంబాలకు చెందిన వారు ప్రభుత్వం అందించే సహాయంతో ఇంటిని నిర్మించుకుంటామని ముందుకు వచ్చే వారికే కొత్తగా గృహాలను మంజూరు చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల్లో ఇప్పటికీ 25వేల గృహాల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. వీరికి కూడా పాత మంజూరు ఉత్తర్వులను రద్దుచేసి కొత్తగా పీఎంఏవై గ్రామీణ్ 2.0 పథకం కింద కొత్తగా పక్కాగృహాలను మంజూరు చేయనున్నారు. గతంలో పక్కా గృహం మంజూరై ఒక్కసారి ప్రభుత్వం నుంచి బిల్లు తీసుకున్నా ప్రస్తుత కొత్త గృహాల్లో చోటు కల్పించరు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 పథకం మంజూరుచేసే పక్కాగృహాలకు యూనిట్ విలువ ఎంత ఇస్తారో అనే విషయంలో ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు.

పాఠశాలలకు మళ్లీ పూర్వవైభవం

5వ పేజీ తరువాయి

చేస్తామని ప్రకటించడంతో అటు ఉపాధ్యాయుల్లో, ఇటు తల్లిదండ్రుల్లో హర్షాతిరేకం వ్యక్తం అవుతోంది.

వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు..

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 2,773 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులు 3.56 లక్షలు మంది ఉన్నారు. ఆయా విద్యార్థుల్లో అత్యధిక మంది పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన వారే. వైసీపీ ప్రభుత్వం జీవో నం.117 ద్వారా ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల్ని యూపీ, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో దాదాపు 2 లక్షల మందికిపైగా విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అనేక మంది విద్యార్థులు ఉన్నత పాఠశాలల్లో చేరకుండా ప్రైవేటు బాట పట్టారు. ఈ విషయం గురించి ఎన్నిసార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సంఘాలు తీసుకెళ్లినా స్పందించలేదు. ప్రపంచ బ్యాంకు ఇచ్చే రుణం కోసం ఇలా ప్రాథమిక పాఠశాలల్ని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

విద్యకు తీవ్ర విఘాతం

ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నం.117 వలన ప్రాథమిక పాఠశాలలు దాదాపు నిర్వీర్యం అయ్యే పరిస్థితి నెలకొంది. నాడు నేడు పథకం ద్వారా అనేక పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మించారు. తీరా విద్యార్థులు పాఠశాలల్లో చేరే సమయంలో 3,4,5 తరగతుల్ని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఒకే కుటుంబంలో ప్రాథమిక విద్యను అభ్యసించే ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు ప్రాథమిక పాఠశాలలో 1 లేదా 2 తరగతుల్లో ఉండగా, కొంతమంది ఉన్నత పాఠశాలల్లో విలీనం అయిన 3,4,5 తరగతుల్లో చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి కుటుంబాల్లో అనేక మంది ప్రభుత్వ స్కూల్స్‌లో పిల్లల్ని మాన్పించి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. అనేక ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం తొలుత అమ్మఒడి డబ్బులు చెల్లిస్తే చాలంటూ అడ్మిషన్ ఇచ్చిన తరువాత యథావిధిగా ఫీజులు వసూలు చేయడం ప్రారంభించారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం భారీ సంఖ్యలో ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 400 ప్రాథమిక పాఠశాలల్లో తీవ్ర స్థాయిలో ఉపాధ్యాయుల కొరత నెలకొంది.

ఎన్‌డీఏ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ఎన్‌డీఏ ప్రభుత్వం జీవో నం.117 రద్దుకు చర్యలు తీసుకోవడం హర్షణీయం. ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5, తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయ్యే పరిస్థితి నెలకొంది. ఊరి బడికి ఉరి పేరుతో ఉపాధ్యాయ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినా నాటి ప్రభుత్వం స్పందించలేదు. కేవలం నిధుల కోసమే జీవో తీసుకువచ్చారు. ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతులు ఒకే చోట ఉండాలి.

- పి.ప్రేమ్‌కుమార్, యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు

డీఈవోగా కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా అత్తోటి కిరణ్‌కుమార్ శనివా రం బాధ్యతలు స్వీకరించారు. బదిలీ అయిన డీఈవో సుభద్ర నుంచి ఆయన చార్జి తీసుకున్నారు. విద్యారంగంలో కిరణ్ కుమార్‌కు విశేష అనుభవం ఉంది. గుంటూరు జిల్లా బోయపాలెం డైట్‌లో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. డైట్ అధ్యాపకుడిగా పనిచేస్తూ గుంటూరు సర్వశిక్షా అభియాన్‌లో ఏఎంవోగా పనిచేశారు. వివిధ విద్యా డివిజన్లలో ఉప విద్యాధికారిగా బాధ్య తలు నిర్వర్తించారు. మైనంపాడులోని డైట్ అధ్యాపకుడుగా పనిచేస్తూ మార్కాపురం, పర్చూరు డివిజన్ ఉపవిద్యాధికా రిగా కూడా పనిచేశారు. డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ ఏడీ, ఇతర సూపరింటెండెంట్లు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలోని పలువురు ఎంఈవోలు, మైనంపాడులోని డైట్ అధ్యాపకులు, సిబ్బంది. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

అందరితో మర్యాదగా మెగాలి

డీఈవో కార్యాలయానికి వివిధ పనుల మీద వచ్చే ఉపాధ్యాయులు, ఇతరులతో కార్యాలయ అధికారులు, సిబ్బంది మర్యాదగా మెలగాలని తనను కలిసిన సిబ్బందికి డీఈవో సూచించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాల న్నారు. కార్యాలయ నోట్ ఫైల్స్‌పై కచ్చితంగా సంబంధిత సిబ్బంది సంతకాలు ఉండాలన్నారు. టీచర్ల సమస్యలను పరిష్కరించే విషయంలో ఫైళ్ల పరుగులు పెట్టాలని ఉద్యోగులకు సూచించారు.

గాలిలో డీఎస్‌లు

- ఇదో వాట్సాప్ గ్రూప్
- ఆ సభ్యులంతా చిరుద్యోగులే
- ఎమ్మెల్యే కొండయ్యను ఆశ్రయించిన పలువురు డిజిటల్ అసిస్టెంట్లు

చీరాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వాళ్లంతా చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. పంచాయతీలలో డిజిటల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నారు. వారిలో 48 మందితో ఓ గ్రూపు ఏర్పాటు చేశారు. ఆ గ్రూపు పేరు గాలిలో ఉన్న డీఎస్ (డిజిటల్ అసిస్టెంట్స్). ఇది వినటానికి ఆశ్చర్యంగా ఉన్నా వాస్తవం. తమకు ఎదురైన ఇబ్బందులపై పరిష్కారానికి వారు గ్రూపును వేదికగా చేసుకుని తమ అభిప్రాయాలను పరస్పరం పంచుకుంటున్నారు. ఈ క్రమంలో తమకు న్యాయం చేయాలని పలువురు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను ఆశ్రయించారు.

వారంతా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పంచాయతీలకు సంబంధించి జరిగిన బదిలీల్లో ఇబ్బంది పడుతున్నవారు. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి డీపీవోగా పనిచేసిన ఉద్యోగి నిర్వాకంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు ఆరోపిస్తున్నారు. సుమారు 50 మంది తమ బదిలీలు, నియామకాలకు సంబంధించి ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను పొందారు. అంతవరకు బాగానే ఉంది. అందులో కొందరిని ఎంపీడీవోలు జాయిన్ చేసుకోలేదు. ముందు పనిచేసిన ప్రదేశం నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో వారు గాలిలో ఉన్నారు. కొందరు తమకు కేటాయించిన పంచాయతీల్లో డిజిటల్ అసిస్టెంట్లుగా విధుల్లో చేరారు. తరువాత తమను నియమించారంటూ మరొకరు ముందస్తుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ పొందినవారి స్థానంలో డిజిటల్ అటెండెన్స్ వేస్తున్నారని, దీంతో తమ పరిస్థితి డోలాయమానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారిలో చీరాల నియోజకవర్గ పరిధిలో ఉన్నవారు ఎమ్మెల్యే కొండయ్యను ఆశ్రయించారు. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎవరు గాల్లో ఉన్నామని కంగారు పడొద్దని వారికి ధైర్యం చెప్పారు. ఎక్కడున్నా మీ జీతం డ్రా చేసుకునేందుకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని కూడా సూచించామని వారికి భరోసా ఇచ్చారు. దీంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నారు.

సమస్యను వెంటనే పరిష్కరించాలి



గతంలో ఇన్‌చార్జి డీపీవోగా పనిచేసిన వారి చర్యలతో మేము ఇబ్బంది పడుతున్నాం. నాకు గతంలో పనిచేస్తున్న పంచాయతీ నుంచి చీరాల మండలం విజయనగర్ కాలనీ పంచాయతీ డిజిటల్ అసిస్టెంట్‌గా నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఎమ్మెల్యే కొండయ్య సిఫార్సు లేఖ కూడా ఉంది. ప్రస్తుతం వేరే వాళ్ల నేను విధులు నిర్వహిస్తున్న పోస్టును తనకు కేటాయించారని డిజిటల్ అటెండెన్స్ వేస్తున్నారు. నాకు వేరే ప్రాంతానికి బదిలీ చేశారని చెప్తున్నారు. ఇదెక్కడి న్యాయం. మా సమస్య పరిష్కరించాలి.

- బాలాత్రిపుర సుందరి, డిజిటల్ అసిస్టెంట్, విజయనగర్‌కాలనీ, చీరాల మండలం

సినీరంగంలో ధ్రువతార దర్శకుడు కామేశ్వరరావు



ప్రతిభామూర్తులకు నివాళులర్పిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : పౌరాణిక బ్రహ్మ, శిరోమణి బిరుదలతో సినీ రంగంలో ధ్రువతారగా వెలిగిన దర్శకుడు కమలాకర కామేశ్వరరావు అని వారణాసి రఘురామ శర్మ అన్నారు. శనివారం రాత్రి చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్వర్యంలో ప్రతిభ మూర్తులు, మధుర స్మృతులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు కామేశ్వరరావు, అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాండవవనవాసం, నర్తనశాల, పండురంగ మహత్యం, శ్రీకృష్ణతులాభారం మొదలైన చిత్రాలు కామేశ్వరరావు ప్రతిభకు ఆనావాళ్లు అని అన్నారు. సినీ నటుడు అక్కినేని దాసరి నారాయణరావు దర్శకత్వంలో సంవత్సరం పాటు ప్రదర్శించిన ప్రేమాభిషేకం నాగేశ్వరరావు జీవితంలో గొప్ప మైలురాయి అని లక్కరాజు శ్రీనివాసరావు గుర్తు చేశారు. ఈ సందర్భంగా అతిథిగా వచ్చిన వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య)ను వివిధ సంస్థల సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు, నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య, చప్పిడి వీరయ్య, అన్నమనేని వెంకట్రావు, శ్రీనివాసరావు, ప్రసాద్, చిన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఎల్‌వోసీని అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

అత్యవసర వైద్య చికిత్సలకు రూ.25.89లక్షలు మంజూరు

అద్దంకి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైన 6 గురుకి, వైద్య చికిత్సలు చేయించుకున్న 24 మందికి 25,89,215 రూపాయల చెక్కులు, యల్‌వోసీ పత్రాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం అందజేశారు. వైద్య చికిత్సలు చేయించుకున్న 24 మంది కి 16,39,015 రూపాయలు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైన నాగులపాడు కు చెందిన మంగమూరి సుబ్బాయమ్మకు రూ.2,17,200, అద్దంకి టౌన్‌లోని ముజావారిపాలెంకు చెందిన కోటపాటి అనంతలక్ష్మి కి 1,08,600, ఏల్చూరు కు చెందిన జర్రా శాంతయ్యకు 1.50 లక్షల రూపాయలు, మేదరమెట్ల కు చెందిన వంశీకృష్ణ కు 40 వేలు, అలవలపాడుకు చెందిన పీర్ల పేరమ్మకు 2,17,200, అమ్మిశెట్టి వెంకయ్య కు 2,17,200 రూపాయల యల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఆయా గ్రామాల స్థానిక నేతలు పాల్గొన్నారు.



మంచినీటి చెరువులో పేరుకున్న నాచు, తామర

అభివృద్ధికి నోచుకోని పర్చూరు మంచినీటి చెరువు

చిల్లచెట్లు, నాచుతో నీరు కలుషితం

పర్చూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మంచినీటి చెరువులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. చెరువులో తామర, నాచు పేరుకుపోయి నీరు కలుషితంగా మారి కంపుకొడుతోంది. అంటు రోగాలు, చర్మవ్యాధులు ప్రబలుతాయోమనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అదే నీటిని రోటరీ గంగ ద్వారా ఫిల్టర్ చేసి మంచినీటికి వినియోగిస్తున్నారు. దాదాపు పదిహేను వేలకు పైగా జనాభా ఉన్ననియోజకవర్గంలో మంచినీటి చెరువు దుస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో చెరువుల పరిస్థితి చెప్పనవసరం లేదు. నీటిని పరిశుభ్రం చేసే ఫిల్టర్ బెడ్‌లు పనిచేకపోవటంతో పరిస్థితి దారుణంగా మారింది. అధికారులు పర్చూరు మంచినీటి చెరువులో ఉన్న తామర, నాచును తొలగించి, చెరువు చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

ముఖాముఖి



మద్యం పాలసీ పారదర్శకం సారాపై ఉక్కుపాదం

చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

మద్యం పాలసీని పారదర్శకంగా అమలు చేస్తాం. సారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతాం. గంజాయిపై గట్టి నిఘా పెడతామని, బార్ అండ్ రెస్టారెంట్లలో నిబంధనలు పాటించేవిధంగా చర్యలు చేపడతామని చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆంధ్రజ్యోతికి చెప్పారు.

● చీరాల సర్కిల్ పరిధిలో ఎన్ని మద్యం షాపులు, బార్‌లు ఉన్నాయి. ఎక్కెడెక్కడ ఎన్ని ఉన్నాయి?

సీఐ : చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 24 మద్యం దుకాణాలు, 4 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. చీరాల అర్బన్‌లో 4 బార్లు, 8మద్యం దుకాణాలు, చీరాల మండలంలో 6, వేటపాలెం మండలంలో 5, చినగంజాం మండలంలో 3, కారంచేడు మండలంలో 2 ఉన్నాయి.

● నూతన మద్యం పాలసీ పక్కాగా అమలు జరుగుతుందా?

సీఐ : ప్రభుత్వ నిబంధనల మేరకు నూతన మద్యం పాలసీని పక్కాగా అమలు చేస్తున్నాం. ఒకటి, రెండు దుకాణాల ఏర్పాటులో స్వల్ప అభ్యంతరాలు ఉన్నాయి. లైసెన్సీలు అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకుంటున్నారు.

● దుకాణాలకు రూ.99 మద్యం (క్వార్టర్) డిపోలో అందుబాటులో లేదని లైసెన్సీలు చెప్తున్నారని, పాత ధర రూ.150 (అన్నింటి కన్నా తక్కువ ధర) విక్రయిస్తున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు?

సీఐ : లైసెన్సీలు దుకాణాలు తెరిచిన కొన్ని రోజులు రూ.99 మద్యం అందుబాటులో లేని మాట నిజమే. అయితే ప్రస్తుతం అన్ని దుకాణాల్లో రూ.99(క్వార్టర్) మందుతో పాటు ప్రీమియం బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి.

● కొన్ని చోట్ల బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. మీ దృష్టికి వచ్చిందా?

సీఐ : లైసెన్స్ పొందిన మద్యం దుకాణల్లో మాత్రమే మద్యం విక్రయించాలి. అలా కాకుండా ఎవరు మద్యం విక్రయించినా ఉపేక్షించం. బెల్టు షాపులపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించాం. నియంత్రిస్తున్నాం.

● నాటు సారా తయారీ, విక్రయాలు బాగానే జరుగుతున్నాయిగా?

సీఐ : సారా తయారీ, విక్రయాలను పూర్తి స్థాయిలో అణచివేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. నియంత్రిస్తాం. అలానే గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించాం.

● కార్యాలయంలో సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారా? కొరత ఉందా?

సీఐ : మొత్తం 11 మంది మెన్ ఉండాలి. అందుకుగాను ప్రస్తుతం ఆరుగురు ఉన్నారు. మరో ఐదు మంది రావల్సి ఉంది. పారదర్శకంగా వ్యవహరిస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.



రికార్డులను పరిశీలిస్తున్న న్యాయాధికారి సుధ

చిన్నారులకు నాణ్యమైన సేవలందించాలి

న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్స్‌లో ఉండి విద్యనభ్యసిస్తున్న వారిపై ప్రత్యేక శ్రద్ధను పాటించాలని న్యాయాధికారి సుధ అన్నారు. శనివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ, ఆనంద నిలయం బాలికల హాస్టల్స్‌ను న్యాయాధికారి తనిఖీ చేశారు. ఈసందర్భంగా వసతులపై చిన్నారులను ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఆహార నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పీఎల్‌వీలు మదీన్, కృష్ణ, సుభాని, ఇర్ఫాన్, వార్డెన్‌లు సుజాత, విజయకుమారి పాల్గొన్నారు.

పౌరులందరూ యూనిఫామ్ లేని పోలీసులే



వాకీటాకీలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాల), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని పౌరులందరూ యూనిఫామ్ లేని పోలీసులేనని ఎస్సై వెంకటేశ్వర్లు విద్యార్థినులకు చెప్పారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జెడ్పీ స్కూల్ విద్యార్థినులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసు విధులు, బాధ్యతలు, ఆయుధాలు, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు : పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం మార్టూరు పోలీసులు విద్యార్థినులకు పోలీస్ స్టేషన్ పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ ఎం.శేషగిరిరావు శ్రీహర్షిణి 9, 10 వతరగతులు చదువుతున్న బాలికలను స్టేషన్‌కు తీసుకువచ్చారు. స్నేహపూరితవాతావరణంలో వారికి స్టేషన్ లోని వివరాలను తెలియచేశారు. ఎఫ్ఐఆర్ అంటే ఏమిటి, దొంగలు గదిలో ఉంచుతారో తదితర వివరాలను వారు ప్రత్యక్షంగా తిలకించేలా అవకాశం కల్పించారు. రికార్డులు, వైర్‌లెస్‌లో మాట్లాడడంపై చూపించారు. సమాజంలో బాధ్యతగల పౌరులుగా మెలగాలని, అందరిలోనూ దేశభక్తి ఉండలాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సైదా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ మాల్యాద్రి అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆయా పాఠశాలల విద్యార్థులకు పోలీసుల విధులు, చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై సురేష్ రెడ్డి, సిబ్బంది నాగూర్, నాయక్, బాషా, చైతన్య పాల్గొన్నారు.


మహిళా మార్ట్‌ను తొలగించాలని హైవే అధికారుల నోటీసులు

పరిశీలించిన డీఆర్‌డీ పీడీ

చీరాలటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణాలు జరుగుతున్న క్రమంలో అడ్డంగా ఉన్న మహిళా మార్టును తొల గించాలని అధికారులు నోటీసులిచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ మార్టును పరిశీలించారు. ఇప్పటికే హైవే అధికారులు మార్ట్‌ను తొలగించాలని నోటీసులు అందించారు. ఈ క్రమంలో పీడీ శనివారం పరిశీలించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లి మరో చోట ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుత స్టాక్, రికార్డులు పరిశీలించారు. ఆమెతోపాటు డీపీఎం ప్రమీలారాణి, ఏపీఎం మధుసూదనరావు పాల్గొన్నారు.



మాల్‌ను పరిశీలిస్తున్న పీడీ పద్మ



కార్పొరేషన్ అధికారులపై కేసు

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించనందుకు కోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు కార్పొరేషన్ అధికారులపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు... కరోనా సమయంలో సంతపేట మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన పెండాల్స్ (షామియానాలు)కు అద్దె ఇవ్వని కారణంగా బాధితుడు విజయ శంకర్ కోర్టును ఆశ్రయించాడు. 2019-21 రెండేళ్ల కాలానికి రూ.45 లక్షలకు పైగా బిల్లుకాగా, రూ. 2.18 లక్షలు మాత్రమే చెల్లించేలా తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించినట్లు బాధితుడు కోర్టుకు ఫిర్యాదు చేశాడు. దీంతో కోర్టు ఆదేశాలతో అప్పటి కమిషనర్లు, అధికారులపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.



భలే ఉందే!

ఆకట్టుకున్న 'పోలీస్ ఓపెన్ హౌస్'

కరుడుగట్టిన నేరగాళ్లను పోలీసులు ఏవిధంగా ఎదుర్కొంటారో మీరు గమనించారా!? విపత్కర పరిస్థితుల్లో వాడే ఆయుధాలు ఏవో మీకు తెలుసా!? నేరం జరిగిన ప్రదేశాల్లో నిందితుల ఆనవాళ్లను క్లూస్‌టీం ఏవిధంగా గుర్తిస్తుంది. బాంబ్‌ను ఏవిధంగా డిస్పోజ్ చేస్తారు.. డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరు ఎలా ఉంటుంది ఈ వివరాలన్నీ కళ్లకు కట్టినట్టు చూపించారు జిల్లా పోలీసులు. నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో శనివారం జరిగిన 'పోలీస్ ఓపెన్ హౌస్' ప్రజలను, విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. తుపాకుల్లో ఎన్ని రకాలు ఉంటాయో.. వాటిల్లో నుంచి బుల్లెట్లు ఏవిధంగా దూసుకువస్తాయో... వాటి పనితీరును పోలీస్ అధికారులు కళ్లకు కట్టినట్లు వివరించారు.

6





తిన్నంత భోజనం..


తరగని రుచి

- ఇదీ కోమల విలాస్ ప్రత్యేకం

కోమలా విలాస్.. నెల్లూరులో ఈ హోటల్ పేరు తెలియనివారంటూ ఉండరు. నెల్లూరుకు అతిథులు వచ్చినా.. ఇక్కడ నుంచి బయట ప్రాంతాలకు వెళ్లినా!? 'కోమలా'లో భోజనం చేశారా!? అని ప్రశ్నించే వాళ్లే ఎక్కువగా ఉంటారు. అంత బాగుం టుందన్నమాట ఇక్కడ భోజనం. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ హోటల్ ఇప్పటికీ రుచికి, శుచికి పేరు గడిస్తూనే ఉంది. అందుకే కాబోలు అభిమానుల సంఖ్య రెట్టింపు అవుతూనే ఉంది.

6

సర్ చార్జ్



- వైసీపీ ప్రభుత్వం పాపం.. ప్రజల పాలిట శాపం
- ఇంటి కరెంటు బిల్లుపై మరో బాదుడు
- యూనిట్‌కు రూ.1.21 చొప్పున అదనపు వడ్డన
- నవంబరు నుంచే అమలులోకి
- జిల్లావాసులపై నెలకు రూ.20 కోట్ల భారం

నెల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు సంస్థల నుంచి ఎడాపెడా కరెంటు కొనుగోలు చేయడం, ఏపీ జెన్కో కంపెనీల్లో విద్యుత్ ఉత్పత్తిని కుదించి వేయడంతో ఇప్పుడు ప్రజలపై సర్దుబాటు చార్జీల రూపంలో అదనపు భారం పడనుంది. ఈ క్రమంలో జిల్లా గృహ విద్యుత్ వినియోగదారులపై 2022-23 విద్యుత్ సర్దుబాటు చార్జీల కింద ఒక యూనిట్‌కు రూ.1.21 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. నవంబరు నెల నుంచే ఈ అదనపు చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికే రెండు సర్దుబాటు చార్జీల రూపంలో ఒక యూనిట్‌పై రూ.1.05 చెల్లిస్తున్న వినియోగదారులు వచ్చే నెల నుంచి అదనంగా మరో రూ.1.21 చెల్లించాల్సి ఉంటుంది. అంటే నవంబరు నుంచి సర్‌చార్జీల భారం ఒక యూనిట్‌పై రూ.2.26 భారం పడుతుంది.

● రూ.20.40 కోట్ల అదనపు భారం

విద్యుత్ కొనుగోలుకు, విక్రయానికి మధ్య వ్యత్యాసపు ధరను సర్దుబాటు చార్జీల రూపంలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. ఈ క్రమంలో 2022-23 సర్దుబాటు చార్జీల రూపంలో ఒక యూనిట్‌కు ఒక్క రూపాయ 21 పైసలు చొప్పున వసూలు చేసుకోవడానికి డిస్కంకు ఏపీఈఆర్‌సీ అనుమతి ఇచ్చింది. నవంబరు నుంచి ఈ అదనపు బాదుడు ఆరంభం కానుంది. జిల్లాలో 11,94,474 గృహ విద్యుత్ సర్వీసులు ఉండగా, నెలకు 19.50 కోట్ల యూనిట్ల విద్యుత్ వాడుతున్నారు. ఈ మొత్తం యూనిట్లపై 2022-23 సర్దుబాటు చార్జీల రూపంలో ఒక యూనిట్‌పై రూ.1.21 అదనంగా వసూళ్లు చేయనున్నారు. అంటే ఎల్టీ సర్వీసుదారులు నెలకు సుమారుగా 20 కోట్ల రూపాయలను సర్దుబాటు చార్జీల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీలను 12 నెలలపాటు వసూలు చేస్తారు. అంటే ఏడాదికి రూ.240 నుంచి 280 కోట్ల వరకు జిల్లా వినియోగదారులపై అదనపు భారం పడనుంది.

> గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేసిన పాపం వైసీపీ అధికారానికి దూరమైనా రాష్ట్ర ప్రజలను మాత్రం వదిలిపెట్టలేదు. సర్దుబాటు చార్జీల రూపంలో మూడేళ్లుగా రాష్ట్ర ప్రజలకు షాక్ ఇస్తూనే ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది, ఇక కరెంటు బిల్లులు షాక్‌లు కొట్టవని ప్రజలు ఊపిరి పీల్చుకొంటున్న తరుణంలో అప్పట్లో వైసీపీ పాలకులు చేసిన పాపం ప్రజల పాలిట శాపంగా మారి మరోసారి కరెంటు బిల్లుల రూపంలో వారి కష్టార్జితాన్ని కొల్లగొట్టడానికి సిద్ధమయ్యాయి.

● ఇది వైసీపీ పాపమే!

విద్యుత్ కొనుగోళ్లలో గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా రాష్ట్ర ప్రజలు ఒక యూనిట్‌పై (మూడు సర్దుబాటు చార్జీలు కలిపి) రూ.2.26 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో ఏపీ జెన్కో రంగ సంస్థల్లో విద్యుత్ ఉత్పత్తిని తగ్గించడం, ప్రైవేటు రంగ సంస్థల నుంచి భారీ రేట్లకు కొనుగోలు చేయడం, బొగ్గు కొనుగోలు వ్యవహారాలు, ప్రైవేటు కంపెనీల నుంచి కొనుగోలు రేట్ల వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచడం తదితరాలు అప్పట్లో విద్యుత్ కొనుగోళ్లలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పుడు సర్దుబాటు చార్జీల రూపంలో వినియోగదారులు ఒక యూనిట్‌కు 2.26 రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏదిఏమైనా గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ విధానాల కారణంగా జిల్లా ప్రజలకు నెలకు రూ.44 కోట్లు, ఏడాదికి 528 కోట్ల రూపాయలను సర్దుబాటు చార్జీల రూపంలో చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది.

రిజిస్ట్రేషన్లకు స్టాంపులు

వచ్చేశాయ్!

- జిల్లాకు రూ. 1.20 కోట్ల విలువైన స్టాంపులు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీరనుంది. రూ.1.20 కోట్ల విలువైన రూ.100, 50 స్టాంపులను కూటమి ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. రిజిస్ట్రేషన్లకు ఫిజికల్ స్టాంపు పేపర్లు అవసరం లేదని, ఈ స్టాంపులు వాడాలంటూ గత వైసీపీ ప్రభుత్వం అధీకృత కలెక్షన్ సెంటర్‌లను ఏర్పాటు చేయించి విక్రయాలు సాగేలా చేసింది. దీంతో ఈ స్టాంపింగ్ పేపర్లపై అక్షరాలు కొద్దిరోజులకే చెరిగి పోతాయంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాన్ జ్యుడీషియల్ స్టాంపులపై దృష్టి సారించి వినియోగదారులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. జిల్లాలో సంవత్సరానికి 10 లక్షలకుపైగా స్టాంపుల అవసరం ఉండగా, స్టాంపుల రాకతో వినియోగదారుల కష్టాలు తీరనున్నాయి. జిల్లాకు వచ్చిన స్టాంపులను రెండు రోజుల్లో అన్నీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



\- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



ఆ ఆలయాలు

అద్భుతః

పొదలకూరులో విరాళాలతో శ్రీవారి ఆలయాలు

ఎక్కడాలేని విధంగా రాతితో నిర్మాణం

ఆకట్టుకుంటున్న శిల్పసౌందర్యం

వారంతా శ్రీవారి భక్తులు. చేయి చేయి కలిపారు. విరాళాలు సేకరించారు. ఆలయాన్ని నిర్మించారు. అదీ ఒక్కటి కాదు.. రెండు ఆలయాలను అద్భుత రాతికట్టడంతో అపురూపంగా తీర్చిదిద్దారు. నిత్యపూజలతోపాటు పర్వదినాలలో ప్రత్యేక పూజలు ఇక్కడ జరుగుతుంటాయి. పొదలకూరుకు వన్నె తెచ్చిన ఆ ఆలయాల గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

6



కావలి : బీద రవిచంద్రకు సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం : అజీజ్ నుంచి పార్టీ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

తొలిరోజే అట్టహాసంగా!

- టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం
- జిల్లావ్యాప్తంగా పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు

నెల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు శనివారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఎమ్మెల్యేలు, పలువురు ప్రముఖులు సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొని, పార్టీ సభ్యత్వం స్వీకరించారు. మండల పార్టీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సారథ్యం వహించగా ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ సభ్యత్వం స్వీకరించారు.

- బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. భర్త ఎంపీ వేమిరెడ్డి, కుమారుడు అర్జున్‌రెడ్డిల తరపున ఎమ్మెల్యే సభ్యత్వ నమోదు పత్రాలు స్వీకరించారు.
- కావలిలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే, బీద రవిచంద్రలు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం స్వీకరించారు.
- నెల్లూరులోని వేదాయపాళెం వద్ద టీడీపీ కార్యాలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. వెంకటాచలం, ముత్తుకూరు, టీపీ గూడూరుల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు సభ్యత్వం అందుకున్నారు
- ఉదయగిరిలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు.
- కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సభ్యత్వ నమోదును ప్రారంభించగా, టీడీపీ నేత వెంకటేశ్వర్లు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.



నెల్లూరులో మాట్లాడుతున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



గన్ చేతబట్టిన ఎస్పీ కృష్ణకాంత్

మా ఆయుధాలు ఇవే!

- నేరస్థులను, విపత్తులను వీటితోనే ఎదుర్కొంటాం
- విద్యార్థులకు వివరించిన ఎస్పీ కృష్ణకాంత్
- ఆకట్టుకున్న 'పోలీస్ ఓపెన్ హౌస్'

● పోలీసు స్టేషన్లలో సీఐలు, ఎస్ఐలు వాడే పిస్టోల్ గురించి మీకు తెలుసా? ఒక్కసారి లోడ్ చేస్తే చాలు పది రౌండ్‌లు నేరుగా కాల్చే అవకాశం ఉంటుంది.

● ఇక మనం సినిమాల్లో పదే పదే వినే పదం ఏకే 47. దీని గురించి మీకు తెలుసా!? ఇది గన్ కాదు రైఫిల్. ఒక్కసారి లోడ్ చేస్తే చాలు సింగిల్, ఆటో ఆప్షన్‌లో ఫైర్ చేసే అవకాశం ఉంటుంది. దీని మెగ్జైన్ కెపాసిటీ 30 రౌండ్లు, వెపన్ చిన్నగా ఉన్న దీని రేంజ్ 60 గజాలు ఉంటుంది.

● నెం.1 మార్క్-3 పాయింట్ 303, నెం.4 మార్క్-1 పాయింట్ 303 ఈ రెండు ఇంచ్ రైఫిల్ ఇది ప్రతి రౌండ్‌కు లోడింగ్ చేసి ఫైరింగ్ చేయాల్సి ఉంటుంది. 300 గజాలు దూరంలో టార్గెట్‌ను అందుకుంటుంది.

● 7.62 ఎంఎం ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్ ఒక్కసారి లోడ్‌చేస్తే అందులోని 20 మ్యాగ్జైన్‌కు 20 రౌండ్లు ఉండగా ప్రతిసారి లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా స్టిగ్గర్ నొక్కుకుంటూ పోతే గన్‌లో నుంచి బుల్లెట్ దూసుకెళుతుంది. ఈ రైఫల్ ఫైరింగ్ రేంజ్ 300 నుంచి 600 గజాలు ఉంటుంది.

● మిషన్ కార్బైన్ 9ఎంఎం దీనిని ఎక్కువగా వీవీపీ ఎక్స్‌కార్ట్ ఉద్యోగులు ఉపయోగిస్తారు. ఒక్కసారి లోడ్ చేసే సింగ్‌లో, ఆటోలు ఫైర్ చేసే అవకాశం ఉంటుంది. దీని రౌండ్ 30 నుంచి 50 గజాల దూరం.



పిల్లలూ.. పిస్టోల్ ఇలా ఉంటుంది!

పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం పోలీసు కవాతు మైదానంలో నిర్వహించిన పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రజలను, విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. ఎస్పీ కృష్ణకాంత్ విద్యార్థులతో ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, బాంబు డిస్పోల్ టీం పరికరాలు, డ్రోన్, డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరు, ట్రాఫిక్ విభాగం, కమ్యూనికేషన్ ఎక్యూట్‌మెంట్ వాడే విధానం, విపత్తుల సమయంలో పోలీసుల కమ్యూనికేషన్ చేసే తీరును విద్యార్థులకు ఎస్పీ వివరించారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను వివరించి అందరూ మంచి ప్రవర్తనతో జీవించాలని, మంచి లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపుఎస్పీలు సౌజన్య, మునిరాజా, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



ఎస్పీకి గౌరవ వందనం చేస్తున్న పోలీస్ డాగ్

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

లైసెన్సుదారులే బాణసంచా విక్రయించాలి

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): లైసెన్సు కలిగిన వ్యాపారులు మాత్రమే బాణసంచా విక్రయాలు జరపాలని, ప్రమాదాలకు తావు లేకుండా సరైన భద్రత, ప్రమాణాలు పాటిస్తూ దుకాణాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో శనివారం పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. సర్కిల్ వారీగా నేరాలపై అధికారులతో సమీక్ష జరిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్ల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, జీ మునిరాజా, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు

● 3 నుంచి శ్రీశైలం, అరుణాచలం సర్వీసులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో సోమవారం నాడు ఒకే రోజు పంచారామ క్షేత్రాల దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, అలాగే అరుణాచలం గిరి ప్రదక్షిణకు నెల్లూరు 1వ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నా మని ఆ డిపో మేనేజర్ మురళీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. పంచారామ క్షేత్ర దర్శనానికి నవంబరు 3, 10, 17, 24 తేదీలలో రాత్రి 9 గంటలకు నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి బస్సు బయల్దేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు రూ. 2500 చార్జీ వసూలు చేస్తారని, మినరల్ వాటర్ బాటిల్, పసుపు, కుంకుమ, ఒక బిస్కెట్ ప్యాకెట్ ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు ఆర్టీసీ బస్టాండ్‌లోగానీ, అధీకృత వ్యక్తుల నుంచి గానీ టికెట్లు పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్ కావలసిన వారు 46480 సర్వీస్ నెంబరుపై రిజర్వేషన్ పొందవచ్చన్నారు. నవంబరు 3వ తేదీ నుంచి ప్రతీ రోజు రాత్రి 9.15 నిమిషాలకు ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి శ్రీశైలంకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని తెలిపారు.

అరుణాచలానికి బస్సులు

కార్తీక మాసం సందర్భంగా నవంబరు 3,9,10,14,17,24, డిసెంబరు 1 తేదీలలో ఉదయం 9 గంటలకు నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు బయల్దేరుతాయని డీఎం తెలిపారు. ఆ బస్సులు మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు తిరుగు ప్రయాణమై నెల్లూరుకు చేరుకుంటాయన్నారు. ఈ యాత్రకు రూ. 1200 చార్జీ వసూలు చేస్తారన్నారు.

నెల్లూరులో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు లేకుండా

బిల్డర్లకు మార్ట్‌గేజ్ డీడ్‌లు విడుదల

- విచారణ జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించండి
- హైకోర్టులో పిల్ దాఖలు

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండానే బిల్డర్లకు మార్ట్‌గేజ్‌డీడ్‌లు విడుదల చేసిన వ్యవహారంపై విచారణ జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ఈ పిల్ దాకలు చేశారు. నెల్లూరులో నిర్మించిన అపార్ట్‌మెంట్‌లు నివాసయోగ్యమైనవా?కాదా? అనే విషయాన్ని పరిశీలించకుండానే జూన్ 2019- జూన్ 2024 మధ్య అప్పటి కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయడంతోపాటు బిల్డర్లకు మార్ట్‌గేజ్ డీడ్‌లు విడుదల చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన అప్పటి కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్‌పై విచారణ జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, అవినీతి నిరోధకశాఖ డీజీ, నెల్లూరుజిల్లా కలెక్టర్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్, నెల్లూరు జిల్లా ఎస్పీ, నెల్లూరు పూర్వ మున్సిపల్ పూర్వకమిషనర్లు, ఐఏఎస్ అధికారులు డి.హరిత, వికాస్ మర్మత్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ డి.చందును ప్రతివాదులుగా చేర్చారు.

తిన్నంత భోజనం..

తరగని రుచి

- ఇదీ కోమల విలాస్ ప్రత్యేకం
- 88 ఏళ్ల చరిత్ర.. తగ్గని అభిమానం
- రాష్ట్రానికే వన్నె తెచ్చిన శాకాహార భోజనశాల

నెల్లూరులో కోమలావిలాస్ అంటేనే తెలియనివారుండరు. శతాబ్దాల తరబడి భోజన ప్రియుల ఆదరాభిమానాలను చూరగొంటున్న ఈ హోటల్‌ను ట్రంకురోడ్డులో 1936లో వెంకటాచలం అయ్యర్, శారదమ్మలు ప్రారంభించారు. తర్వాత శ్రీనివాసన్, ప్రస్తుతం ఈయన కుమారుడు కోమల ప్రసాద్, అన్నపూర్ణలు నిర్వహిస్తున్నారు. దాదాపు 88 సంవత్సరాలుగా తెలుగింటి కూరలుతోనే భోజనం వడ్డిస్తున్నారు. తొలినాళ్లలో ఇక్కడ భోజనం అణాతో మొదలైంది. 1984 నాటికి ఒకరికి భోజనం ధర రూ.3.75లకు చేరింది. ఆ తర్వాత ముడిసరుకుల ధరల పెంపుతో ఇక్కడ భోజనం ధర కూడా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఫుల్ భోజనం రూ.110, ప్లేట్ భోజనం రూ.80.

● ఇవీ ప్రత్యేకం

ఆదివారం రాగి సంగటి, ఉల్లి పాయ పులుసు, వెజ్‌బిరియాని, సోమవారం వంకాయి మునగ కాయ ముద్దకూర, మంగళవారం వడపులుసు, బుధవారం అవ్యల్ (కేరళ వంటకం), గురువారం నూనె వంకాయ కూర, శుక్రవారం ముక్కల పులుసు, శనివారం చింతపండు పులిహోర ఇక్కడ ప్రత్యేకం. వీటితోపాటు రైస్, పప్పుకూర, తాళింపు, పచ్చడి, సాంబార్, రసం, మజ్జిగ పులుసు, పెరుగు, మజ్జిగ, ఊరగాయ, శనగలపొడి, స్వచ్ఛమైన నెయ్యితో వడ్డిస్తారు.

● ప్రముఖులూ అభిమానులే

కోమలా విలాస్ అభిమానుల్లో ప్రముఖులూ ఉన్నారు. పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విద్యార్థి దశ నుంచే కోమల విలాస్ భోజనం చేసినవారే. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుతోపాటు మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు కోమలా విలాస్‌లో భోజనం చేసిన వారే.

- నెల్లూరు (సాంస్కృతికం)



కోమల విలాస్ వ్యవస్థాపకులు వెంకటాచలం అయ్యర్, శారదమ్మ



హోటల్‌లో భోజనం వడ్డిస్తున్న సిబ్బంది



3న కాపు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బలిజ (కాపు) భవన్‌లో నవంబరు 3వతేదీన బలిజ, తెలగ, కాపు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు కార్యనిర్వాహకులు బీస్ అధ్యక్షుడు పీఎస్ అనిల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు, డాక్టర్ పోకల రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి తల్లిదండ్రులు లేని విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్ పాసై ఉంటే రూ.10వేలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి 10వ తరగతిలో 550 మార్కులు, ఇంటర్‌లో 950 మార్కులు సాధించిన వారికి రూ.5వేలు, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన వారికి రూ.2500 చొప్పున అందజేస్తామన్నారు. ఎంబీబీఎస్, ఐఐటీ, ఐఐఐటీ, నీట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానిస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు 94919 23117, 94405 10891, 97046 45469 ఫోన్ నెంబర్లకు వివరాలు తెలపాలని కోరారు.

నేడు యథావిధిగా

విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యుత్ బిల్లులు వసూలు చేసే అన్ని కేంద్రాలు ఆదివారం సెలవు దినం అయినప్పటికీ యథావిధిగా పని చేస్తాయని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

జిల్లాను క్షయ రహితంగా మార్చాలి

● వైద్యులు, సిబ్బందిదే బాధ్యత : కలెక్టర్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను క్షయ రహితంగా మార్చేందుకు వైద్యాధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శనివారం తిక్కన భవన్‌లో జిల్లా స్థాయి క్షయ ఫోరం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలో క్షయ వ్యాధి వల్ల ఒక్క మరణం కూడా సంభవించకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఆ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు ఉన్నవారు తప్పని సరిగా గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. ఆశావర్కర్లు, గ్రామీణ ప్రాంతాల్లోని ఏఎన్ఎంలు గళ్ల శాంపిల్స్ సేకరణలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు, వసతిగృహాలు, పాఠశాలలు ఉండే ప్రాంతాల్లో క్షయ పరీక్షలపై దృష్టిపెట్టాలన్నారు. క్షయ వ్యాధి నివారణ చర్యలను క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 64 శాతం బీసీజీ వ్యాక్సిన్ వేసి జిల్లా ముందంజలో ఉన్నట్లు తెలియచేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, ఐఎంఏ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అశోక్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ భవానీ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లూరు(విద్య), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పబ్లిక్ పరీక్షల ఫీజులు చెల్లించాలని డీఈవో ఆర్ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110 చెల్లించాలని పేర్కొన్నారు. ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60, వయసు మినహాయింపు కోరేవారు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80 చెల్లించాలని తెలిపారు. ఈ ఫీజులను ఈనెల 28 నుంచి నవంబరు 11వతేదీలోపు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో నవంబరు 12 నుంచి 18 వరకు, రూ.200 అపరాధ రుసుముతో నవంబరు 19 నుంచి 25 వరకు, రూ.500 అపరాధ రుసుముతో నవంబరు 26 నుంచి 30వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. విద్యార్థులు చెల్లించే పరీక్ష ఫీజులను జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 28 నుంచి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే చెల్లించాలని ఆదేశించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను గానీ, నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ పరీక్షల విభాగంలోగానీ సంప్రదించాలని కోరారు.

గర్భిణులు, పిల్లలకు

మెరుగైన వైద్యం అందించాలి

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



చిన్నపిల్లలకు అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకుంటున్న పద్మావతి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో గర్భవతులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి ఆదేశించారు. శనివారం జీజీహెచ్‌లోని ప్రసూతి, చిన్నపిల్లల విభాగాలను ఆమె పరిశీలించారు. బాధితులకు అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అవసరమైతే తప్ప సిజేరియన్ కాన్పు చేయరాదని వైద్యులకు సూచించారు. అనంతరం గాయత్రి నగర్‌లో ఉన్న రత్నం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

ఆ ఆలయాలు

అద్భుతః!

- పొదలకూరులో విరాళాలతో శ్రీవారి ఆలయాలు
- ఎక్కడాలేని విధంగా రాతితో నిర్మాణం
- ఆకట్టుకుంటున్న శిల్పసౌందర్యం



శ్రీనివాస లేఅవుట్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం

పొదలకూరులో కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని కొంతమంది భక్తులు పూనుకుని అనతికాలంలోనే జిల్లాలో ఎక్కడా లేని విధంగా అద్భుతంగా తీర్చిదిద్దారు. ఒక్క ఆలయం నిర్మిద్దామని పూనుకున్న వారు కొన్ని కారణాల వల్ల పోటీపోటీగా రెండు ఆలయాలను నిర్మించారు. వీటిలో ఒకటి పట్టణంలోని శ్రీనివాస లే అవుట్‌లో ఉంటే మరొకటి అయ్యప్పనగర్‌లో ఉంది. భక్తుల విరాళాలతో చేపట్టిన ఏడుకొండల వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం ఏడేళ్లలో పూర్తి కావడం, ఏడేళ్లు దాటకముందే ప్రారంభానికి నోచుకోవడాన్ని భక్తులు విశేషంగా చెప్పుకుంటున్నారు.

● శ్రీనివాసనగర్ లే అవుట్‌లో 2015, జూన్ 11వతేదీన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీ రామచంద్ర జీయర్ స్వామి శంకుస్థాపన చేశారు. వెంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదాదేవి అమ్మవార్లతోపాటు శ్రీ గరుడ ఆళ్వార్ స్వామి ఆలయాలను నిర్మించారు. ఈ ఆలయాల నిర్మాణం మొత్తం రాతితో చేపట్టారు. ప్రతివారం స్వామివారికి పల్లకి సేవలు, ప్రతి నెల శ్రవణా నక్షత్రం రోజున శ్రీవారి కల్యాణం, ప్రతి శనివారం స్వామి వారికి పల్లకీసేవతోపాటు శుక్రవారం అమ్మవార్లకు అభిషేకాలు జరుగుతాయి. ముక్కోటి ఏకాదశినాడు ఉత్తర ద్వార దర్శనం, ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక ప్రతిరోజు భక్తులకు అన్నదానంతోపాట ఆలయ ప్రాంగణంలో 22 ఆవులతో గోశాల నిర్మించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆలయ ప్రాంగణంలో తల నీలాలు సమర్పించుకుని, శ్రీవార్లను దర్శించుకుంటారు. కాగా, ప్రస్తుతం రూ.40 లక్షలతో శ్రీవారికి రథ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2025, మే నెలలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఈ రథాన్ని అందుబాటులోకి తెస్తారు.



ఆకట్టుకుంటున్న రాతికట్టడం

● పట్టణంలోని అయ్యప్పనగర్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం 2023, జనవరి 27వ తేదీన ప్రారంభమైంది. అల్లూరు రమణయ్య అనే అయ్యప్ప భక్తుడు 17ఏళ్ల క్రితం బాలాలయాన్ని నిర్మించారు. ఏడేళ్ల క్రితం రూ.4 కోట్ల విరాళాలతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఎక్కడా లేనివిధంగా కల్యాణ వెంకటేశ్వర స్వామితోపాటు పరివార దేవతలుగా విఘ్నేశ్వరుడు, ఆంజనేయుడు, అయ్యప్ప, శివయ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. శ్రీనివాసుడికి నిత్యకైం కర్యాలు, కల్యాణోత్సవాలతోపాటు అన్నదానం చేపడుతున్నారు. వీటితోపాటు యేటా మకర సంక్రాంతి రోజున అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం, అయ్యప్ప మాలాదారులకు అన్నదానం, భజన కార్యక్రమాలు జరుగుతాయి.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)



రథం తయారీలో చెక్కతో చేసిన శిల్పాలు



అయ్యప్పనగర్‌లోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం

న్యూస్ బాక్స్

జేసీ భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న జేసీ తదితరులు

వింజమూరు, అక్టోరు 26 (ఆంధ్రజ్యోతి):పంచాయతీలోని బీసీకాలనీ సమీపంలో ఉన్న పీర్లమాన్యం భూములను, కావలి రోడ్డులోని సీహెచ్‌సీ భూములను శనివారం జేసీ కార్తీక్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ గతంలో తాము వైద్యశాలకు భూ ములు ఇచ్చామని, ఇంతవరకు తమకు భూములు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తానని వారికి జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దారు హమీద్, సర్వేయర్ రవి, శిరీష, కంచర్ల రమణయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నర్రవాడ పంచాయతీలోని శ్రీవెంగమాంబ ఎస్టీ కాలనీలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, వీఆర్వో మాల్యాద్రిల సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి హరీష్ రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ చుండి హరిగోపాల్‌రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు షేక్ రియాజ్, రమీజా, సూర్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల నిర్వహణలో భాగంగా ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివే స్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నరసింహం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పాలూరు, దొండపాడు, సినిగేవారిపాలెం, మదన గోపాలపురం, శ్రీరంగరాజపురం గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించగలరని కోరారు.

మాలకొండ ఆదాయం రూ. 6.25 లక్షలు

వలేటివారిపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహ స్వామికి శనివారం భక్తుల నుండి రూ.6,2 5,180 ఆదాయ వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వి సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అష్టోత్తరం టిక్కెట్లు, కుంకుమార్చన, వివాహాలు, తల నీలాలు, వాహనపూజలు ప్రత్యేకద ర్శనం, స్థల పురాణం పుస్తకాలు విక్రయం, రూము అద్దెలు, కవర్లు అమ్మకాలు, లడ్డుప్రసాదం, అన్నదానం, విరాళాలు ఉన్నట్లు డీసీ సాగర్‌బాబు పేర్కొన్నారు.

రేపు ప్రజా విజ్ఞప్తుల వేదిక

అనంతసాగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాల యంలో సోమవారం ఉదయం 10 గంట లకు ప్రజావిజ్ఞప్తుల వేదిక నిర్వహించనున్నట్లు కార్యక్రమానికి దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచిప్రకటన విడుదల చేశారు.

పనుల పరిశీలన

ప్రజావేదిక వద్ద జరుగుతున్న పనులను శనివారం ఆత్మకూరు ఆర్డీవో పావని పరిశీలించారు. కార్యక్రమం గురించి ప్రజలకు తెలిసేలా ప్రచారం ముమ్మరంగా చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ ఉన్నారు.

కావలి మున్సిపాలిటీకి అవార్డు

కావలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆత్మ నిర్భయ నిధి (పీఎం స్వానిధి) పథకం కింద తోపుడు బండ్ల వ్యాపారుల రుణాల మంజూరుకు చేసిన కృషికి కావలి మున్సిపాలిటీ అవార్డుకు ఎంపికైనట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన 15 మున్సిపాల్టీలలో కావలి మున్సిపాల్టీ కూడా అవార్డుకు ఎంపికైందన్నారు. ఈ అవార్డును ఈ నెల 29న విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు అందజేస్తారని పేర్కొన్నారు.

ప్రపంచ తెలుగు సమాఖ్య సన్నాహక సమావేశం

● పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

కందుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభ సన్నాహ సమావేశం శుక్రవారం రాత్రి హైదరాబాదులో నిర్వహించారు. ఈ సమావేశానికి కందుకూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు డాక్టర్ దివి శివరాం, సతీమణి సౌభాగ్య పాల్గొన్నారు. 2025 జనవరి 3,4,5 తేదిల్లో 2000మంది డెలిగేట్స్‌తో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభ నిర్వహించ బోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రాళ్లపాడు స్పిల్‌వేలో మరమ్మతులు

● 5వ నంబరు రేడియల్ గేటు రోప్ కట్‌అయిన వైనం
● కొత్త రోప్ కోసం అధికారుల ప్రతిపాదనలు

లింగసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులోని కొత్త స్పిల్‌వేకు చెందిన 5వ నంబరు రేడియల్ గేటు మరమ్మతులకు గురైంది. ఈ రేడియల్ గేటును ఆపరేట్ చేసే రోప్ వంక తిరిగి కొన్ని పీసులు కట్ అయ్యింది. ఈ సమస్యతో గేటు సుమారు ఏడెనిమిది నెలల నుంచి పని చేయడం లేదు. అయితే భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి వరద నీరు ఉధృతంగా వస్తే అధికారులు కొత్త స్పిల్‌వేలోని 5 గేట్ల ద్వారా 1 లక్షా 70 వేల కూసెక్కుల వరద నీరు మన్నేరులోకి విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ గేటు పని చేయనందు వలన ప్రస్తుతం మిగిలిన నాలుగు గేట్ల ద్వారా మాత్రమే వరద నీరు మన్నేరుకు విడుదల చేసే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం 1 లక్షా 50 వేల క్యూసెక్కులకు మించి వరద నీరు వస్తే పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు ఏఈ జి.చంద్రమౌళిని వివరణ కోరగా కొత్త రోప్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇది ఇలా వుండగా పాత స్పిల్‌వేలోని 10 క్రస్ట్ గేట్లు, 2 పూడు గేట్లు అధికారులు చాలా ఏళ్లుగా ఆపరేట్ చేయడం లేదు. ఈ గేట్ల కౌంటర్ వెయిట్లు చాలా పాతవి కావడంతో వీటిని ఆపరేట్ చేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి, ఈ గేట్ల కౌంటర్ వెయిట్లు కొత్తవి మరియు కొత్త రేడియల్ గేటు రోప్ త్వరగా ఏర్పాటు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలోని 5వ నంబరు రేడియల్ గేటు

అట్టహాసంగా టీడీపీ సభ్యత్వ నమోదు

కావలిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

కలిగిరి, వింజమూరులో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కందుకూరులో ఇంటూరి



కలిగిరి: సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న కాకర్ల సురేష్

కావలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. ముందుగా బీద రవిచంద్ర, ఎమ్మెల్యే క్రిష్టారెడ్డిలు చెరో రూ. లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. వారితో పాటు కావలి నేతలు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, తిరువీధి ప్రసాద్, పద్మావతి శ్రీదేవి, కోటా రమేష్ ఈ సభ్యత్వం తీసుకున్నారు.

● రుణం తీర్చుకునేందుకు..

కావలి నియోజకవర్గంలో టీడీపీకి అత్యధిక మెజార్టీ ఇచ్చిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు బీద రవిచంద్ర సహకారంతో మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేసేందుకు ముందుకు పోతున్నట్లు ఎమ్మెల్యే క్రిష్టారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో లక్షకు పైగా సభ్యత్వాలు చేసి అగ్రగామిగా నిలుద్దామని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

● కలిగిరి: పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని అభిమానించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలన్నారు. సభ్యత్వ నమోదుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ చీమల తాతయ్య, సర్పంచులు వెంగపనాయుడు, వరప్రసాద్, రేష్మ, లెక్కల రాంబాబు, మాదాల శ్రీ నివాస్, సతీష్, కొండలరావు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం టీడీపీ సభ్యత్వాల నమోదును మండల టీడీపీ కన్వీనర్ సీహెచ్ బయ్యన్న ప్రారంభించారు. అనంతరం ప లువురు సభ్యత్వాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రా జా, నరసింహులు, సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, నవాజ్, శివకృష్ణ పాల్గొన్నారు.

● సభ్యత్వం నమోదు చేసుకోండి

టీడీపీ సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబుయాదవ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.100లు చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు.

● వరికుంటపాడు: స్థానిక టీడీపీ కార్యాల యంలో శనివారం సభ్యత్వ నమోదును మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

● సీతారామపురం: సభ్యత్వ నమోదులో ఉదయగిరి నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం ఉండాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ కోరారు. శనివారం మండల పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కప్పా ప్రభాకర్ రాజు, సోమనబోయిన రాజశేఖర్, తోట మాల్యాద్రి, తోట మనోజ్, మహాలక్ష్మయ్య, రఘురామయ్య, ప్రసాదు పాల్గొన్నారు.

● వింజమూరు: టీడీపీసభ్యత్వ నమోదులో భాగంగా వింజమూరు, కలిగిరి మండలాలలో శనివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ముందుగా వింజమూరులోని వెలమబజార్, కలిగిరి మండలం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పాల్గొని స్థానిక నాయకులు, కార్యకర్తలను సభ్యత్వం చేర్పించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు బృహత్తర కార్యక్రమమని అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, గణపం సుదర్శన్‌రెడ్డి, గూడా నర్సారెడ్డి, వేమలపాటి మాల్యాద్రి, కొండపల్లి వెంకటేశ్వర్లు, దంతులూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కందుకూరు: సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి



ఉదయగిరి రూరల్: సభ్యత్వాలు తీసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● కందుకూరు: పట్టణంలో నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమంను ప్రారంభించారు. పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పిడికిడి వెంకటేశ్వర్లు రూ.లక్షతో పార్టీ శాశ్వత సభ్యత్వం ఆన్‌లైన్ నమోదు చేసుకోగా సంబంధిత కార్డును ఎమ్మెల్యే నాగేశ్వ రరావు అతనికి అందజేశారు. అలాగే కొండము దుసుపాలెం పొడపాటి మల్లికార్జున్, కాకుమని బసవేశ్వరరావులు ఈ శాశ్వత సభ్యత్వం నమోదు తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, కంద్రా మాల్యాద్రి, దదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, షేక్ మున్నా, పొడపాటి మహేష్ పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: పోకూరులో శనివారం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. నాయ కులు ఇంటింటికి వెళ్లి సభ్యత నమోదు ఆవశ్య కతను వివరించారు. ప్రతిఒక్కరూ సభ్యత్వం తీసుకొని పార్టీలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఘట్టమనేని లక్ష్మీనరసింహం, గురిజాల బెంజిమెన్, సోమినేని తిరుమలరావు, వడ్లమూడి లక్ష్మీనరసింహం, ఘట్టమనేని లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

మెనూలో పండ్లు తప్పనిసరి

● నలంద హైస్కూల్‌లో ఫ్రూట్స్ స్టాల్ ఏర్పాటు



విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫ్రూట్స్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఈగ భాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ మనం తినే ఆహారంలో పండ్లు తీసుకుంటే శరీరానికి అవసర మైన పోషకాలు అందుతాయని నలంద హైస్కూల్ కర స్పాండెంట్ ఈగ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫ్రూట్స్ డే స్టాల్స్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పండ్లు వాటిలో ఉంటే విటమిన్లు వివరిస్తూ డెమో రూపంలో విశదీకరించారు. ఈ సందర్భంగా ఈగ భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. పండ్లు ప్రతిరోజూ తినడం వలన దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయన్నారు. లేనివారికి వ్యాధులు రాకుండా దరిచేరవన్నారు. పండ్లతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులు తెలుసుకొని వారి తల్లిదండ్రులకు తెలియజేస్తారనే లక్ష్యంతో ఈ ఫ్రూట్స్ డే నిర్వహించామన్నారు. నలంద స్కూల్ డైరక్టర్ రత్నమ్మ, ప్రధానో పాధ్యాయులు, బాబు, సైన్స్ టీచర్ రవికుమార్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు షాపు నిర్వహించాలి



వీఆర్వోకు వినతిపత్రం అందచేస్తున్న మహిళలు

బిట్రగుంట, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం షాపు ఏర్పాటు చేస్తే తగదని ఇబ్రహీంపేట, తిప్ప, కోవూరు పల్లి గిరిజన కాలనీకి చెందిన మహిళలు అన్నారు. శనివారం ఇబ్రహీం పేట శివారు ప్రాంతంలో నూత నంగా ఏర్పాటు చేసిన మద్యం షాపు వద్ద నిరసన చేసి దుకా ణం మూయించారు. శివాలయం, ప్రైవేటు ఐటీఐ ఉన్నచోట మద్యం దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. అనం తరం తహసీల్దారు కార్యాలయంలో వీఎస్ఆర్ పేట వీఆర్వో రామోహన్‌కు వినతి పత్రం అంద జేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు ఎల్.సుధీర్ బాబు, ఎస్.భాస్కర్, అహ్మద్‌బాషా, ఆదిశేషయ్య, క్రాంతి, మనోహర్, నరసింహారావు, జయరామ్, యు.రవి ఉన్నారు. వివాద విషయం తెలుసుకున్న సెబ్ ఎస్సై దేవిక, సిబ్బంది సంఘ టన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిం చారు. ఈ విషయమై కావలి సెబ్ సీఐ శ్రీని వాసులు మాట్లాడారు. షాపులకు ప్రస్తుతం తాత్కాలిక లైసెన్సులతో నిర్వహి స్తున్నట్లు చెప్పారు.

నూతన కార్యాలయ నిర్మాణానికి ఆమోదం

కలిగిరి(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 26: ఎంపీడీఓ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్న దృష్ట్యా నూతన ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి శనివారం జరిగిన మండల సర్వసభ్య సాధారణ సమావేశంలో ఏకగ్రీవ ఆమోదం చేసినట్లు ఎంపీపీ మెట్టుకూరు శిరీష తెలిపారు. వర్షాకాలంలో ప్రతి గ్రామంలో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదే శించారు. విత్తనాలను పూర్తిస్థాయిలో రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఏఓ సురేష్‌బాబుకు సూచించారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి మినరల్ వాటర్‌ప్లాంట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు వేయించాలన్నారు. ఎంపీడీఓ ప్రత్యూష, మండల విస్తరణాధికారి వెలుగోటి మధు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌లో సమస్యలు

కొండాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చింతలదేవి, గరిమెనపెంట, గుడవళ్లూరు సచివాలయాల్లోని ఆధార్ సెంటర్లు పని చేయక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర విద్యాశాఖ దేశ వ్యాప్తంగా ఒకే ఐడీ నెంబరును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. అలాంటి నెంబరును రూపొందించేటపుడు ప్రతి విద్యార్థి వారి ఆధార్ నెంబ రును అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు వారి పుట్టిన తేదీ సర్టిఫికెట్లు లేకపోవడంతో ఆధార్ అప్‌డేట్ తీవ్ర సమస్యగా నెలకొంది. అలాంటి వారికి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంలు ధృవీకరించాల్సి ఉంది.

రీ సర్వే తప్పులపై చర్యలు తీసుకుంటాం



తూనుగుంటలో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్

లింగసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో జరిగిన పొరపాట్లను సరి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శనివారం తూనుగుంటలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పా ల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు 57అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ నాగ రాజు, సర్వేయర్లు ఎం.నాగరాజు కె.వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభకు అర్జీల వెల్లువ

జలదంకి, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): తిమ్మసముద్రంలో శనివారం రెవెన్యూ అధికారులు చేపట్టిన రీసర్వేపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వంశీక్రిష్ణ హాజరై ప్రజల నుండి వినతులు స్వీకరించారు. రీసర్వేలో భూవిస్తీర్ణంలో, భూ యజమాని పేరు తప్పులు దొర్లాయని వందలసంఖ్యలో అర్జీలు వచ్చాయి. 15రోజుల వ్యవధిలో అన్ని తప్పులు సరిచేసి పక్కాగా రికార్డులలో చేరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు, డిటి జూలీబాయ్, వీఆర్వో గిరి, టీడీపీ నేత కంచర్ల వినోద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

జలదంకి, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణక్రాకలో శనివారం సర్పంచ్ ఇండ్ల సుధాకర్, కార్యదర్శి నీరజలు పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంచాయతీలో వీధుల వెంబడి నిలిచిన వర్షపునీరు నిలిపై పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు.

ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలి

కావలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒట్టూరు మోడల్‌స్కూల్‌కు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లి తండ్రులు శనివారం కావలి ఆర్టీసీ డిపో ట్రాఫిక్ కంట్రోలర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కావలి -తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ పనులతో 15 రోజులుగా స్కూల్‌కు వెళ్లే బస్సు తిగటం లేదన్నారు. కార్యక్రమంలో కరువది భాస్కర్, ఎస్‌కే ఖాదర్‌బాష, ప్రవీణ్, రవి, నరసింహారావు, నాయబ్, చంద్ర, ఇజహార్, శ్రీను పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కావలి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉప్పు అన్నపూర్ణ (40) నెల్లూరులో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ నెల 21వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడగా భర్త, సోదరుడు ఆమెను పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారటంతో ఈ నెల 25న మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. మృతురాలికి భర్త వెంకటేశ్వర్లు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ బాష తెలిపారు.

అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కందుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై కలెక్టర్ ఆనంద్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. కొన్ని పంచాయతీలలో వైసీపీ సర్పంచులను అడ్డం పెట్టుకొని శానిటేషన్ చేయకుండా, వీధిలైట్లు, రోడ్లు వేయకుండా అధికార పార్టీ నాయకులునిధులు దుర్వినియోగం చేశారన్నారు. వైసీపీ పార్టీ నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వచ్చామా..వెళ్లామా!

మొక్కుబడిగా మండల సమావేశం

వరికుంటపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సమావేశం శనివారం మొక్కుబడిగా సాగింది. అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు సైతం వచ్చామా.. వెళ్లమా ! అనే రీతిలో పట్టుమని పది నిమిషాలు కూడా సభలో ఉండకుండానే వెళ్లిపోయారు.ఉదయం 10.30 గంటలకు నిర్వహించాల్సిన సమావేశం కోరం లేకపోవడంతో ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. అయినా ఫలితం లేకపోవడంతో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు చొరవ తీసుకొని సమీపంలోని జడదేవి ఎంపీటీసీ కోసం ఆమె నివాసానికి కారు పంపి సమావేశానికి తీసుకొచ్చారు. అంతవరకు వేదికపై ఎంపీపీ జీ వెంకటలక్ష్మి ఎదురుచూడాల్సి వచ్చింది. 12.15 గంటలకు వేదికపైకి జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ఎంపీడీవో, వైస్ ఎంపీపీ మధు రావడంతో సమావేశాన్ని ప్రారంభించారు. అయినా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు గైర్హాజరు కావడంతో అజెండాలోని అంశాలను గాలికొదిలేశారు. కేవలం 30 నిమిషాల్లోనే సమావేశాన్ని ముగించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ సమావేశానికి అధికారులే సమావేశాలకు డుమ్మా కొట్టడం ఎంతవరకు సమంజసమని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి సమావేశంలోనూ ఇలాంటి వైఖరే అవలంబిస్తున్నారని మండిపడ్డారు. దీంతో ప్రజాప్రతినిధులు కూడా సమావేశానికి హాజరు కాలేకపోతున్నారన్నారు. కాగా తొమ్మిది మంది ఎంపీటీసీలకుగాను కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. 24 మంది సర్పంచులకుగాను ముగ్గురే హాజరయ్యారు.

చిన్నారులు, గర్భిణుల సంక్షేమమే ధ్యేయం

● సౌజన్య, ఐసీడీఎస్ సీడీపీవో



కావలి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, గర్భవతులు, బాలింతల సంక్షేమమే తమ ధ్యేయమని కావలి ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య తెలిపారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ద్వారా నిధులు కేటాయించి పోషక ఆహారం అందిస్తున్నాం.

? పిల్లలకు ఎలాంటి పోషకాహారం అందిస్తున్నారు.

! పాలు, గుడ్డు, చిక్కీలు, బాలమృతం, ఆకు కూరలతో భోజనంతో పాటు ఇతర పోషక ఆహారం అందిస్తున్నాం.

? గర్భిణులు, బాలింతలకు ఏ పోషకాలు ఇస్తారు.

! గర్భిణిలు, బాలింతలకు నెలకు 3కేజీల బియ్యం, కెజి పప్పు, ఆర కిలో నూనె, కెజి బాలసంజీవని, 2కేజీల రాగి పిండి, కేజి అటుకులు, పావు కిలో కర్జూరం, పావు కిలో బెల్లం, పావు కిలో చిక్కీలు, 5 లీటర్ల పాలు, 25 కోడి గుడ్లు ఇళ్లకు ఇస్తున్నాం.

? ప్రీ స్కూల్ నూతన టైం టేబుల్ ఎలా ఉంది.

! నూతన ప్రీ స్కూల్ టైంటేబుల్ సత్ఫలితాన్ని ఇస్తుంది. విద్యతో పాటు విలువలు, ఆట,పాటలు, మంచి ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణ, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వ హిస్తాం.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

ఉలవపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాల యానికి రావలసిన సెస్ తప్పనిసరిగా వసూలు చేయాలని, ధరావత్తు సభ్యులను ఎక్కువ మందిని చేర్చాలని, నోటీస్ బోర్డు ఏర్పాటు చేసి గ్రంథాలయ పూర్తి సమాచారాన్ని అందులో ఉంచాలని సూచించినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి

ఉలవపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్ శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ చార్జీల పెంపుతో పెను భారం పడుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలన్నారు.

దళితులందరూ ఐకమత్యంగా ఉండాలి

అల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై దళితులందరూ ఏకతాటి పైకి వచ్చి పోరాడాలని అంబేద్కర్ యువ జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు తెలిపారు. శనివారం ఇస్కపల్లిలో ఎస్సీ కాలనీల్లో ఆయన మాలల మహాగర్జనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజకీయ లబ్దికోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలను విడగొట్టేందుకు కక్ష కట్టారని ఆరోపించారు. నవంబరు 4న అల్లూరులో జరిగే మాలల మహా గర్జన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కంటేపల్లి సింహాద్రి, పొంగులూరి సుధాకర్, దానం మాల్యాద్రి, గంగపట్నం సతీష్, కమలాకర్, మహేష్ పాల్గొన్నారు.

కూలిన ఘాట్‌రోడ్డు రక్షణ గోడ

వలేటివారిపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డులో మలుపుల వద్ద నిర్మించిన రక్షణ గోడ కూలిపోయింది. మలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుండా రక్షణ గోడలు నిర్మించారు. ఈ రక్షణ గోడలు పదిరోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు పగుళ్లిచ్చి కూలిపోయింది. ప్రతి శనివారం వాహనాల్లో వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దర్శనం అనంతరం కొండ పైనుండి ఘాట్‌రోడ్డులో కిందకు వచ్చే సమయాలలో వాహనాలు అదుపుతప్పితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భక్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కూలిన రక్షణ గోడలను తిరిగి నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

వైభవంగా పెంచలకోన లక్ష్మీనరసింహుడి కల్యాణం

రాపూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన నిత్యకళ్యాణ మండపంలో శనివారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణంను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 4గంటల నుంచి అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్లకు ఊంజల సేవ చేపట్టారు. వేడుకల్లో ఆలయ డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్త పీర్ల సోమయ్యయాదవ్, దేవస్థానం, సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో స్వామివారు